


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 46

సోమవారం 8-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

NEET-2022 లో ఇతర వైద్యకళాశాలల్లో MBBS సీట్లు సాధించిన నారాయణ విద్యార్థులు



సోమవారం 8-5-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 46


'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'



సూపర్ రైజర్స్...
రాజస్తాన్ జట్టుపై ఆఖరి బంతికి గెలిచిన హైదరాబాద్ -12లో



రాబడులు చూసి మోసపోవద్దు
పెట్టుబడి చేసిన వెంటనే లాభాలు ఆశించొద్దంటున్న నిపుణులు -13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కర్ణాటకను వేరు చేసే కుట్ర
భారతదేశం నుంచి కర్ణాటకను వేరు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతోందని ప్రధాని మోదీ మండిపడ్డారు.
వివరాలు 6లో ▸



21లోగా అరెస్ట్ చేయాలి
బ్రిజ్‌ను అరెస్ట్ చేసి, రెజ్లర్ల సమస్యను పరిష్కరించకుంటే 21న కీలక నిర్ణయం తీసుకుంటామని కిసాన్ సంఘ్ నేతలు స్పష్టం చేశారు.
వివరాలు 6లో ▸



కర్ఫ్యూ నిబంధనలు సడలింపు
ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ నిబంధనలు సడలించారు.
వివరాలు 6లో ▸



అమెరికా మాల్‌లో కాల్పులు..
తాజాగా టెక్సాస్ రాష్ట్రం అల్లెన్‌లోని ఓ మాల్‌లో జరిగిన కాల్పుల్లో అనుమానితుడు సహా 9 మంది చనిపోయారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ



బీజేపీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా పోరాడుతామన్నారు.
- వివరాలు 10లో▶

నీట్: కెమిస్ట్రీ కఠినం..



ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన 'నీట్'పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 95% మందికి పైగా పరీక్షకు హాజరయ్యారు. గత నాలుగేళ్లతో పోలిస్తే.. ఈసారి నీట్ కాస్త కఠినంగానే ఉందని విద్యార్థులు, నిపుణులు చెప్పారు.
- వివరాలు 14లో▶

ఆర్టీసీకి 'ముహూర్త' బలం



శుభ ముహూర్తాలు ఆర్టీసీని లాభాల బాటపట్టించాయి. ఏప్రిల్‌లో జీతాలిచ్చేందుకు సంస్థ ఇబ్బందిపడ్డ పరిస్థితి మారి.. ప్రస్తుతం రోజువారీ సగటు ఆదాయం రూ.15.50 కోట్లుగా నమోదవుతోంది. దీంతో 45 డిపోలు లాభాల్లోకి చేరాయి.
- వివరాలు 5లో▶

రేపే ఇంటర్ ఫలితాలు



ఇంటర్ ఫలితాలు మంగళవారం (మే 9వ తేదీ) విడుదల కానున్నాయి. మంత్రి సబిత ఫలితాలు వెల్లడించాల్సి ఉన్నందున ఆమె వెసులుబాటును పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఫలితాల విడుదల తేదీని బోర్డు అధికారులు ప్రకటించారు.
- వివరాలు 14లో▶

కొత్తగా 'పాలమూరు'!

ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మార్చిన రాష్ట్ర ప్రభుత్వం | కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు మంగళం

- దీని ఆయకట్టుకు ఉద్ధండాపూర్ రిజర్వాయర్ నుంచే సాగునీరు
- ఆ రిజర్వాయర్‌కు అనుసంధానంగా కుడి, ఎడమ ప్రధాన కాల్వల నిర్మాణం
- రూ.5,680 కోట్లతో పరిపాలనపర అనుమతులు జారీ
- కాల్వల ద్వారా 9,06,684 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు సర్కారు కీలక నిర్ణయం
- దక్షిణ తెలంగాణలో 16 అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రభావం!



సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అలైన్‌మెంట్‌లో కీలక మార్పు చోటు చేసుకుంది. ప్రాజెక్టులో తొలుత ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉప సంహరించుకుంది. దానికన్నా ముందే ఉన్న ఉద్ధండాపూర్ రిజర్వాయర్ నుంచే రెండింటి ప్రతిపాదిత ఆయకట్టుకు నీరివ్వాలని, ఇందుకోసం రెండు ప్రధాన కాల్వలను నిర్మించాలని నిర్ణయించింది. నాలుగైదు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం దాదాపు 16 నియోజకవర్గాలపై ప్రభావం చూపిస్తుందని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. ఆగస్టు నాటికల్లా ఉద్ధండాపూర్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశించడం గమనార్హం. అయితే ప్రాజెక్టులో తొలిదశ కింద తాగునీటి అవసరాల కోసం మాత్రమే ఈ పనులను చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

సచివాలయంలో తొలి సంతకం దీనిపైనే..

శ్రీశైలం జలాశయం నుంచి 90 టీఎంసీల కృష్ణా జలాలను ఎత్తిపోసి.. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 12,44,940 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, ఆయా జిల్లాలకు తాగునీరు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం 'పాలమూరు' ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాజెక్టులో భాగంగా అంజనాగిరి, వీరాంజనేయ, వెంకటాద్రి, కురుమూర్తిరాయ, ఉద్ధండాపూర్, కేపీ లక్ష్మీదేవిపల్లి పేర్లతో మొత్తం 6 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను ప్రతిపాదించారు. తాజాగా ఇందులో చివరిదైన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రభుత్వం విరమించుకుంది. ఈ రిజర్వాయర్ కింద ప్రతిపాదించిన ఆయకట్టుకు ఐదో రిజర్వాయరైన ఉద్ధండాపూర్ ద్వారానే సాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించింది. 16.03 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తున్న మిగతా 2వ పేజీలో ▶

ప్రధాన కాల్వలకు వ్యయం
రూ. 5,678 కోట్లు

కుడి/ఎడమ ప్రధాన కాల్వల నిర్మాణానికి మొత్తం రూ.4,659 కోట్ల వ్యయం అవుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. వీటి నిర్మాణానికి 8,411 ఎకరాల భూసేకరణ జరపాల్సి ఉంటుందని.. ఎకరాకు రూ.12లక్షల చొప్పున అంచనా వేసుకుంటే అదనంగా రూ.1,019.41 కోట్లు అవసరమని తేల్చింది. దీంతో మొత్తంగా ప్రధాన కాల్వల వ్యయం రూ.5,678 కోట్లు అవుతుందని అంచనా వేసింది. సాగునీటి శాఖ ప్రతిపాదనల ప్రకారం.. ఉద్ధండాపూర్ జలాశయం నుంచి ప్రధాన కాల్వ ప్రారంభమవుతుంది. 16.5 కిలోమీటర్ వద్ద ఎడమ, కుడి ప్రధాన కాల్వలుగా విడిపోతుంది.

మాయావతిని గజమాలతో సత్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు



ఏమార్చేందుకే విగ్రహాలు

కేసీఆర్ దళితులను మోసం చేశారు
బీఎస్పీ అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతి ఫైర్

- దళితులకు మూడెకరాల భూపంపిణీ పథకాన్ని కేసీఆర్ నా నుంచే కాపీ కొట్టారు
- అయినా భూ పంపిణీ చేయకుండా మోసం చేశారు
- అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలంటున్నారు
- బీఎస్పీ సీఎం అభ్యర్థిగా ప్రవీణ్‌కుమార్ పేరు ప్రకటన
- సరూర్‌నగర్ స్టేడియంలో బీఎస్పీ 'తెలంగాణ భరోసా సభ'

కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుంటోంది
- ప్రగతిభవన్‌పై నీలి జెండా ఎగురవేస్తాం: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- వివరాలు 5లో▶

సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ పేరుతో తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం స్వార్థ రాజకీయాలు చేస్తోందని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జాతీయ అధ్యక్షురాలు మాయావతి మండిపడ్డారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలంటున్న కేసీఆర్.. ఆ మహానుభావుడి విగ్రహాల సాకుతో అణగారిన వర్గాలను మరోసారి ఏమార్చేందుకు వస్తున్నారని విమర్శించారు. బీఎస్పీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో 'తెలంగాణ భరోసా సభ' జరిగింది. మాయవతి ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఉత్తరప్రదేశ్ సీఎంగా ఉన్నప్పుడు భూమి లేని దళితులకు మూడెకరాల భూమిని ఉచితంగా ఇచ్చానని.. కేసీఆర్ ఆ పథకాన్ని మిగతా 5వ పేజీలో ▶

• అంతరిక్షంపై ఆశలు
యురేనస్ చంద్రుళ్లపై సముద్రాలు!

జీవుల మనుగడకు ఆధారం జలం. విశ్వంలో భూమిపైనే కాకుండా ఇంకెక్కడైనా జలరాశి ఉందా? అనేదానిపై సైంటిస్టులు శతాబ్దాలుగా అన్వేషణ కొనసాగిస్తున్నారు. సూర్యుడి ప్రభావం పెద్దగా ఉండని సౌర వ్యవస్థ అంచుల్లోనూ జల అన్వేషణ సాగుతోంది. ఈ విషయంలో 'నాసా' సైంటిస్టులు పురోగతి సాధించారు. మన సౌర కుటుంబం కొసన యురేనస్ గ్రహానికి చెందిన ఉపగ్రహాలపై మహా సముద్రాలు ఉన్నాయనడానికి ఆధారాలు కనిపెట్టారు.


6 లో

• స్వేచ్ఛకు కంట్రోల్
రాజు చుట్టూ ని'బంధనాలు'

ఒక దేశానికి రాజైతే నిత్యం రాజభోగాలు అనుభవించడమే అనుకుంటే పొరపాటే. విందు వినోదాలు, చుట్టూ వందిమాగధులు, ఏ చిన్న పనికైనా జీ హుజూర్ అనే సేవకులు ఇవన్నీ ఉన్నప్పటికీ మరిన్ని ఆంక్షల చట్రంలో బతకాల్సి ఉంటుంది. ఒక రకంగా బంగారు పంజరంలో బంధించినట్టుగా స్వేచ్ఛను కోల్పోవలసి ఉంటుంది. బ్రిటన్ రాజుగా పట్టాభిషిక్తుడైన కింగ్ చార్లెస్-3కి ఇష్టం ఉన్నా లేకపోయినా ఈ నిబంధనలన్నీ పాటించి తీరవలసిందే.


6 లో

• ఆకాశంలో సంపూర్ణం
నారీ శక్తితో గణతంత్రం

యుద్ధ శకటాలు, విమానాల విన్యాసాల ప్రదర్శన ఇలా భారత గణతంత్ర దినోత్సవ పెరేడ్ అంటేనే కదనరంగంలో మన సత్తా ఎంతో ప్రదర్శించడమే. అలాంటి పరేడ్‌ను వచ్చే ఏడాది మహిళా శక్తితో నిర్వహించడానికి కేంద్రం సన్నాహాలు చేస్తోంది. కేంద్ర బలగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడం కోసం 2024 జనవరి 26న కర్తవ్యపథ్‌లో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌ను కేవలం మహిళలతో నిర్వహించాలని రక్షణ శాఖ ఫిబ్రవరిలోనే ప్రతిపాదించింది.


6 లో



నేడు కాంగ్రెస్ 'యూత్ మేనిఫెస్టో'

- సరూర్‌నగర్ వేదికగా ప్రియాంకా గాంధీ 'యువ సంఘర్షణ సభ'
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ
- సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 6:30 వరకు ప్రియాంక పర్యటన

- వివరాలు 3లో▶

పొలిటికల్ టూరిస్టులకు స్వాగతం : కేటీఆర్

- 'సోనియా బలిదేవత'న్న వ్యక్తిని పీసీసీ చీఫ్‌ను చేశారు
- కాంగ్రెస్.. గాంధీభవన్‌ను గాడ్సేకు అప్పగించింది
- అమరుల బలిదానాలపై ప్రియాంక క్షమాపణ చెప్పాలి



సాక్షి, హైదరాబాద్: సోనియాగాంధీని 'బలిదేవత'అన్న వ్యక్తికే పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వానిది అమాయకత్వమో, ఆత్మహత్యా సదృశమో తేల్చుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు అన్నారు. గాంధీభవన్‌ను గాడ్సేకు అప్పగించి కాంగ్రెస్ పార్టీ తన అంతానికి స్వయంగా వీలునామా రాసుకుందన్నారు. పొలిటికల్ టూరిస్టులకు తెలంగాణ స్వాగతం పలుకుతోందన్నారు. కాంగ్రెస్ 'యువ సంఘర్షణ'సభకు హాజరయ్యేందుకు ప్రియాంకాగాంధీ వస్తున్న నేపథ్యంలో కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ నిరుద్యోగులు రాష్ట్ర యువతను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. సకాలంలో తెలంగాణ ఇవ్వక.. తెలంగాణ ఉద్యమకారుల బలిదానాలకు కారణమైనందుకు కాంగ్రెస్ తరఫున మిగతా 3వ పేజీలో ▶

రాయచూర్‌లో 'టగ్ ఆఫ్ వార్'!



- తెలుగువారి ప్రభావమున్న జిల్లాలో మూడు ప్రధాన పక్షాల మధ్య పోరు
- రెండు చోట్ల జేడీఎస్, మూడు చోట్ల కాంగ్రెస్, మరోచోట బీజేపీకి అనుకూల పవనాలు.. మరో స్థానంలో హోరాహోరీ.. కర్ణాటకలో రాజకీయం

-2లో▶

ఆర్థిక నేరాలకు మార్గదర్శితో ముగింపు!

- రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నడిపిన కేసులో 4 రోజుల పాటు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో రామోజీ
- కోర్టుల్ని తప్పుదారి పట్టించేలా లెక్కలు చూపించారు
- రామోజీరావు కేసు ముగిసిన కథ అనుకున్నాం
- సీఎం జగన్ ఎస్‌ఎల్‌పీ పిటిషన్‌తో కేసుకు ఊపిరి వచ్చింది
- రామోజీ – మార్గదర్శి అక్రమాలపై విశాఖ 'స్వర్ణాంధ్ర వేదిక' సదస్సులో వక్తలు

- వివరాలు 10లో▶

ఇదండీ సంగతి



ప్రచారం కూడా వాళ్లనే చేయమని చెప్పి వచ్చాం సార్!

రూ. 260 కోట్ల వక్ఫ్ భూమికి ఎసరు!

సాగులో లేని రైతుల పేరిట చక్రం తిప్పిన రియల్ ఎస్టేట్ సంస్థ

- జీపీఏతో సుమారు 52.25 ఎకరాల్లో భారీ వెంచర్
- ల్యాండ్ రెవెన్యూ రికార్డుల్లో కానీ, ధరణిలో కానీ లేని పేర్లు
- లే అవుట్ పర్మిషన్ జారీ చేసిన హెచ్ఎండీఏ..
- కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు
- ఒకవైపు నిషేధిత జాబితాలో భూమి
- మరోవైపు హైకోర్టులో వివాదం
- వక్ఫ్‌బోర్డు ప్రేక్షక పాత్రపై అనుమానాలు



సాక్షి, హైదరాబాద్: వక్ఫ్‌బోర్డు భూములు దర్జాగా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. రెవెన్యూ శాఖ (ధరణి)తో పాటు స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ల శాఖ నిషేధిత జాబితాలో పొందుపర్చిన భూములకు కనీస పరిశీలన లేకుండానే లేఅవుట్ అవుట్ పర్మిషన్లు జారీ అవుతుండగా, ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ యథేచ్ఛగా కొనసాగుతోంది. తాజాగా హైదరాబాద్ శివారులో ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న కొంగర కుర్దు-ఏలో ఈ విధంగా ఓ భారీ రియల్ వెంచర్ వెలుగుచూసింది. సుమారు రూ.260 కోట్ల విలువైన 52.25 ఎకరాల వక్ఫ్ భూములకు సంబంధించి హైకోర్టులో వివాదం కొనసాగుతుండటం గమనార్హం. ఇంత జరుగుతున్నా వక్ఫ్ బోర్డు ప్రేక్షక పాత్ర పోషించడం అనుమానాలకు తావిస్తోంది.

ఇదీ కథ..: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగరకుర్దు-ఏలో సర్వే నంబర్ 2 నుంచి 400 వరకు దర్గా సయ్యద్ శారాజ్ ఖత్తాల్ హుస్సేనీ ఖిబ్లా పేరిట సుమారు 500 ఎకరాలకు పైగా వక్ఫ్ భూమి ఉంది. 1954 నుంచి ఇప్పటివరకు పహాణీల్లో పట్టాదారు కాలంలో దర్గా పేరే నమోదై ఉంది. 2007లో వక్ఫ్ బోర్డు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా ఆ భూమిని సాగు చేసుకుంటున్న రైతులందరితో పాటు సర్వే నంబర్ 86, 87, 88, 89లోని సుమారు 52.25 ఎకరాల భూమి సాగు చేసే చెట్కూరి వంశీయులు కూడా గెజిట్‌ను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టేటస్ కో ఆర్డర్ జారీ చేయడంతో అప్పటి నుంచి కేసు పెండింగ్‌లోనే ఉంది. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులతో పాటు రిజిస్ట్రేషన్ల శాఖ నిషేధిత జాబితాలో సైతం ఆయా సర్వే నంబర్ల వివరాలు పొందుపర్చారు. ఫలితంగా భూముల రిజిస్ట్రేషన్లు కూడా నిలిచిపోయాయి. పహాణీ, ధరణిలో కబ్జాదారుడు (పీటీ)ల కాలమ్‌లో చెట్కూరి కుటుంబ వంశీయుల పేర్లు, పట్టాదారుల కాలమ్‌లో మిగతా 5వ పేజీలో ▶

'ఓఆర్ఆర్ ప్రైవేటు'కు నిర్ణయం ప్రజల గొంతుకోయడమే

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



- ప్రభుత్వ ఖజానాకు బంగారుబాతులాంటి ఓఆర్ఆర్‌ను 30 ఏళ్ల లీజు ఎందుకు ఇస్తున్నారు
- వైజాగ్ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకించి ఓఆర్ఆర్‌ను మాత్రం ఇచ్చేస్తారా?

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగురోడ్డు(ఓఆర్ఆర్)ను ప్రైవేటు సంస్థకు అప్పగించాలనే నిర్ణయం తెలంగాణ ప్రజల గొంతు కోయడమేనని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలను నమ్మించి గొంతుకోయడంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు కుటుంబం ఆరితేరిందని ఆయన ఆరోపించారు. ఓఆర్ఆర్ ప్రైవేటీకరణతో కల్వకుంట్ల కుటుంబం కొత్త నాటకానికి తెర తీసిందని, వైజాగ్ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణపై మొసలి కన్నీరు కారుస్తున్న సీఎం కేసీఆర్ ఇప్పుడు ఓఆర్ఆర్‌ను ప్రైవేటు పరం చేయడంలో అర్థం లేదని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర మిగతా 2వ పేజీలో ▶

రెండ్రోజులు పెరగనున్న ఉష్ణోగ్రతలు

40 నుంచి 43 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం: వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్‌: రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని ఉత్తరాది జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారుగా 40 డిగ్రీల సెల్సియస్‌ నుంచి 43 డిగ్రీల సెల్సియస్‌ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వివరించింది. గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ వరకు నమోదు కావొచ్చని పేర్కొంది. రాష్ట్రానికి దక్షిణ దిశ నుంచి బలమైన గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత నల్లగొండలో 39.5 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 21.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. సోమవారం నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

తెలంగాణలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నల్లగొండ	39.5	23.4
ఆదిలాబాద్‌	39.0	26.7
మహబూబ్‌నగర్‌	38.5	24.0
నిజామాబాద్‌	37.6	26.4
రామగుండం	37.6	27.3
భద్రాచలం	36.2	25.0
మెదక్‌	35.6	21.6
ఖమ్మం	35.2	26.4
హనుమకొండ	35.0	25.0
హైదరాబాద్‌	34.8	24.5
దుండిగల్‌	34.0	25.0
హకీంపేట్‌	33.6	22.7

క్లుప్తంగా...

ఆసియా బెర్లిన్ సదస్సుకు కేటీఆర్‌



సాక్షి, హైదరాబాద్‌: జర్మనీలోని బెర్లిన్‌లో జూన్‌ 12 నుంచి 15 వరకు జరిగే 'ఆసియా బెర్లిన్ సదస్సు 2023'కు మంత్రి కేటీఆర్‌ హాజరు కానున్నారు. 'స్టార్టప్‌ వాతావరణాల అనుసంధానం'అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే సదస్సులో ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌ను జర్మనీ సెనేట్‌కు చెందిన ఎకనామిక్స్, ఎనర్జీ, పబ్లిక్‌ ఎంటర్‌ప్రైజ్‌ శాఖ కోరింది. జర్మనీ, ఆసియా దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను, భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఏటా ఈ సదస్సును నిర్వహిస్తారు. జర్మనీలో ఉన్న స్టార్టప్‌లను ఆసియా ఖండంలోని మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. మొబిలిటీ, లాజిస్టిక్స్, ఎనర్జీ, గ్రీన్‌టెక్, వాతావరణ మార్పులు, ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ వంటి ప్రధానమైన అంశాలను ఈ సదస్సు చర్చించనుంది.

నేడు మణిపూర్ నుంచి రాష్ట్రానికి విద్యార్థులు

ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్‌: మణిపూర్‌లో అల్లర్ల నేపథ్యంలో అక్కడి నుంచి తెలంగాణ విద్యార్థులు, పౌరులను ప్రత్యేక విమానం ద్వారా స్వరాష్ట్రానికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పా ట్లు చేస్తోంది. కోల్‌కతా మీదుగా సోమవారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక విమానం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునే అవకాశం ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ విద్యార్థులు, పౌరులకు సహాయం కోసం న్యూఢిల్లీతో పాటు హైదరాబాద్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇంఫాల్ నుంచి తెలంగాణ విద్యార్థులను హైదరాబాద్‌కు తరలించేందుకు సీఎస్ శాంతి కుమారి, మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపింది. కాగా, రాష్ట్రానికి చెందిన హర్షవర్ధన్ అనే విద్యార్థికి ఆదివారం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకోవడంతో ప్రభుత్వం తెలంగాణ భవన్‌లో బస ఏర్పాటు చేసింది.

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ పూర్తి

అర్హులకు ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసు క్రమబద్ధీకరణ పూర్తయింది. ఇందుకు సంబంధించి సంబంధిత అధ్యాపకులకు వ్యక్తిగత ఆదేశాలు వెళ్లాయి. వీరంతా ఇక నుంచి పర్మినెంట్ అధ్యాపకులుగా కొనసాగుతారు. జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3,096 మంది, డిగ్రీ కళాశాలల్లో 280 మంది, పాలిటెక్నిక్ కళాశాలల్లో 520 మందికి నియామక ఉత్తర్వులు అందినట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన అర్హత, సర్వీసును ఆన్‌లైన్ రికార్డుల ద్వారా పరిశీలించిన అధికారులు రెండ్రోజులుగా నియామక ఉత్తర్వులు సిద్ధం చేస్తూ వస్తున్నారు. ఇంటర్ కళాశాలల్లో 3 వేల మందికి పైగా ఉండటంతో వారికి సంబంధించిన ఉత్తర్వులపై ఒక్కరే సంతకం చేయాల్సి వచ్చింది. దీంతో సంబంధిత అధికారి జయప్రదాబాయ్ రాత్రంతా కూర్చుని సంతకాలు చేయాల్సి వచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం క్రమబద్ధీకరించినందుకు కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నేత కొప్పిశెట్టి సురేష్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాయచూర్‌లో 'టగ్ ఆఫ్ వార్'!



నారాయణపూర్, హోస్పేట ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో.. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి వచ్చి స్థిరపడిన తెలుగు ప్రజలు చేసే వ్యవసాయంతో కళకళలాడుతూ కనిపించే కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలు రాజకీయంగా చైతన్యవంతంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ పట్టణ ప్రాంతాల్లో పెద్దగా అభివృద్ధి కనిపించకపోవడం, పాలకుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమనే అభిప్రాయం ఉన్నా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వ్యవసాయాభివృద్ధి కనిపిస్తుంది. రాయచూర్ (పట్టణ), రాయచూర్ (గ్రామీణ), సింధనూర్, మస్కి, మాన్వి, దేవదుర్గం, లింగసూగుర్ నియోజకవర్గాలున్న రాయచూర్ జిల్లాలో.. ఈసారి ఎన్నికల్లో అనేక రాజకీయ, సామాజిక అంశాలు ప్రభావం చూపనున్నాయి. లింగాయత్, వాల్మీకి (నాయక్)లతోపాటు తెలుగు ప్రజలు ఇక్కడ ఎక్కువ. రెండు నియోజకవర్గాల్లో అయితే తెలుగు ప్రజలే నిర్ణాయక శక్తిగా ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన ఇది.

\- రాయచూర్ నుంచి మేకల కల్యాణ్ చక్రవర్తి

రాయచూర్ పట్టణ (అర్బన్)

రాయచూర్ పట్టణ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు నడుస్తోంది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, లింగాయత్ వర్గానికి చెందిన శివరాజ్‌పాటిల్, కాంగ్రెస్ నుంచి మాజీ కౌన్సిలర్ మహ్మద్‌షా ఆలం, జేడీఎస్ నుంచి మాజీ మున్సిపల్ చైర్మన్, ఈడిగ సామాజిక వర్గానికి చెందిన వినయ్‌కుమార్ బరిలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి పాటిల్ ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే పార్టీ పరంగా బీజేపీకి సానుకూలత కనిపిస్తోంది. షా ఆలంకు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ మైనార్టీ ఓట్లపై ఆశలు పెట్టుకుంది.

రాయచూరు గ్రామీణ (రూరల్)

ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన రాయచూరు రూరల్‌లో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దద్దల్ బసన్నగౌడ, బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే తిప్పరాజు, జేడీఎస్ అభ్యర్థి, మాజీ జెడ్పీ సభ్యుడు చిన్న నర్సింహ నాయక్ పోటీ చేస్తున్నారు. ఇక్కడి ఎమ్మెల్యేకు సాత్వికుడనే పేరుంది. పెద్దగా వ్యతిరేకత కనిపించడం లేదు. అయితే ఈ నియోజకవర్గానికి కృష్ణా, తుంగభద్ర జలాలు తీసుకురావడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపాయన్న భావన ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి బసన్నగౌడ పట్ల సానుకూలత కనిపిస్తోంది.

తెలుగువారి ప్రభావమున్న జిల్లాలో మూడు ప్రధాన పక్షాల మధ్య పోరు

ప్రత్యర్థులు, పార్టీలు పాతవే అయినా ఈసారి కొత్త సమీకరణాలు

రెండు చోట్ల జేడీఎస్, మూడు చోట్ల కాంగ్రెస్, మరోచోట బీజేపీకి అనుకూల పవనాలు

మరో స్థానంలో హోరాహోరీ పోరు ఉన్నా కాంగ్రెస్‌కు మొగ్గు!

సింధనూర్

జేడీఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన వెంకట్రావ్ నాడగౌడ, కాంగ్రెస్ నుంచి అంపన్నగౌడ బాదర్లి బరిలో ఉండగా, బీజేపీ నుంచి కరియప్ప పోటీ చేస్తున్నారు. ఇక్కడ బీజేపీ ప్రభావం తక్కువే అయినా కరియప్ప కాంగ్రెస్ నుంచి వెళ్లి బీజేపీ టికెట్ తెచ్చుకోవడంతో.. త్రిముఖ పోటీ నెలకొంది. ఇక్కడ తెలుగువారు ఎక్కువ. వారు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్టు చెప్తున్నారు.

రాయచూర్ రూరల్ హత్నూరలో నీటి తిప్పలు



మస్కి


ఇక్కడ పార్టీలు మారినా ప్రత్యర్థులు పాతవారే. కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న బసన్నగౌడ గతంలో బీజేపీలో పనిచేశారు. బీజేపీ నుంచి పోటీలో ఉన్న ప్రతాపగౌడ పాటిల్ అంతకు ముందు కాంగ్రెస్‌లో పనిచేశారు. గత ఎన్నికల్లో, తర్వాత ఉప ఎన్నికల్లో వారు తలపడ్డారు. ఇప్పుడూ వీరి మధ్యనే పోటీ ఉంది. ఇక్కడ వాల్మీకి, లింగాయత్‌లు చెరోసగం బీజేపీ, కాంగ్రెస్‌ల వైపు ఉండగా.. ఇతర కులాలు, తెలుగు క్యాంపులు కాంగ్రెస్ వైపు కనిపిస్తున్నాయి. జేడీఎస్ నామమాత్రపు పోటీకి మాత్రమే పరిమితమనే అంచనాలున్నాయి.

లింగసూగుర్

ఇది ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. కాంగ్రెస్ నుంచి డీఎస్ ఉలిగేరి, బీజేపీ నుంచి మానప్ప వజ్జల్, జేడీఎస్ నుంచి సిద్ధూ బండి పోటీ చేస్తున్నారు. పైకి మాత్రం ఉలిగేరి, వజ్జల్ మధ్య పోటీ భీకరంగా కనిపిస్తోంది. అయితే, సిద్ధూ బండిపై సానుభూతి కనిపిస్తోంది. ఆయన గతంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోవడంతో ఈసారి ఆయనకు ఓట్లు పడతాయనే అంచనాలున్నాయి. జేడీఎస్ ప్రభుత్వం నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి ఈ నియోజకవర్గానికి సాగునీరు తీసుకువచ్చారనే అభిప్రాయం కలసిరానుంది.

మాన్వి

ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గం మాన్విలో హోరాహోరీ పోరు నడుస్తోంది. జేడీఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి అంపయ్యనాయక్, బీజేపీ నుంచి బీవీ నాయక్ పోటీ చేస్తున్నారు. లింగాయత్, వాల్మీకి వర్గాలు ప్రధాన ఓటర్లు అయినా తెలుగువారి ప్రభావం ఎక్కువే. మాన్వి జనరల్ నియోజకవర్గంగా ఉన్నప్పుడు బోసురాజు ఎమ్మెల్యేగా పనిచేశారు. తర్వాత వెంకటప్పనాయక్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఇద్దరూ తెలుగు ఓటర్ల మద్దతుతోనే గెలిచారని అంచనా. ఈసారి కూడా వారు కాంగ్రెస్‌వైపు మొగ్గుచూపుతున్నారు. లింగాయత్‌లు బీజేపీ వైపు కనిపిస్తున్నారు.



దేవదుర్గం

ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ ఏమీ చేయలేదని, జేడీఎస్ అధికారంలో ఉన్నప్పుడే నారాయణపూర్ నుంచి సాగునీరు తీసుకువచ్చిందన్న సానుకూలత కనిపిస్తోంది. ఇక్కడ జేడీఎస్ నుంచి కరెమ్మ నాయక్, కాంగ్రెస్ నుంచి శ్రీదేవీ నాయక్, బీజేపీ నుంచి శివన్నగౌడ పోటీలో ఉన్నారు. జేడీఎస్ రెండు సార్లు టికెట్ ఇవ్వకపోయినా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన కరెమ్మ నాయక్ పట్ల ప్రజల్లో సానుభూతి ఉంది. కాంగ్రెస్ అభ్యర్థికి ఉన్న కుటుంబ రాజకీయ బలం కొంతమేర ప్రభావం చూపనుంది.


రాజశ్యామల అమ్మవారి ఆలయం నమూనా


యంత్ర ప్రతిష్ఠాపన చేస్తున్న స్వరూపానందేంద్ర స్వామి, స్వాత్మానందేంద్ర స్వామి

రాజశ్యామల అనుగ్రహంతోనే తెలంగాణ ప్రగతి

విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి

మణికొండ: కలియుగంలో శక్తివంతమైన అమ్మవారు రాజశ్యామల అని.. ఆమె అనుగ్రహంతోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా ప్రగతిపథంలో పయనిస్తోందని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రెండు ఎకరాల భూమిలో ఆదివారం ఆయన రాజశ్యామల అమ్మవారి ఆలయం నిర్మాణానికి స్వాత్మానందేంద్రస్వామితో కలిసి శిలాన్యాసం చేశారు. ఈ సందర్భంగా పవిత్ర గంగ, అలకానంద, భగీరథ నదుల నుంచి తెప్పించిన పుణ్య జలాలను చల్లి.. వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి ఆలయ నిర్మాణానికి శిలాన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నీటి కొరత, విద్యుత్ సమస్యలు వెంటాడతాయని అంతా భావించారని.. కానీ ప్రపంచానికే హైదరాబాద్ నగరం కేంద్ర బిందువుగా మారుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాజశ్యామల అమ్మవారిని ఆరాధించటంతోనే అది సాధ్యమవుతోందని స్పష్టం చేశారు. అమ్మవారి ఆలయం రాష్ట్రంలోను ఉండాలనే సదుద్దేశంతో అడగకుండానే ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు ఎకరాల భూమిని కేటాయించారని స్వరూపానందేంద్ర స్వామి తెలిపారు. కోకాపేటలో అమ్మవారి దేవాలయ నిర్మాణాన్ని ఒక్క దాతే చేపడతానని ముందుకొచ్చినా.. భక్తులందరికీ అందులో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో అందుకు అంగీకరించలేదని పేర్కొన్నారు. దేశంలో అనేక పీఠాలు, ఉపపీఠాలున్నా వాటికి భిన్నంగా విశాఖ శారదా పీఠం పనిచేస్తుందని చెప్పారు. దక్షిణ భారత దేశంలో పేరుగాంచిన చోళులు, కాకతీయులు, చాణుక్యుల నిర్మాణ శైలిలో ఆలయం పూర్తి ఆధ్యాత్మిక భావంతో, శక్తి కేంద్రంగా, వేద నిలయంగా నిర్మితమవుతుందని వివరించారు. ఆలయం పూర్తయితే తాను సైతం ఎక్కువ సమయం ఇక్కడే ఉంటానని తెలిపారు. ఆలయ నిర్మాణానికి భక్తులు తమకు తోచిన సహాయం అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, టీఎస్‌ఆర్టీసీ కమిషనర్ సజ్జనార్ పాల్గొన్నారు.

పలువురు సినీ ప్రముఖులకు 'ఫాస్' అవార్డుల ప్రదానం

'సాక్షి' సీనియర్ పాత్రికేయుడు రెంటాల జయదేవకు ఉత్తమ సినీ జర్నలిస్టు అవార్డు


రెంటాల జయదేవ, పరుచూరి, రోజారమణికి అవార్డులు అందజేస్తున్న సుమన్, మురళీమోహన్

బంజారాహిల్స్ (హైదరాబాద్): ఫిలిం ఎనలిటికల్ అండ్ అప్రిసియేషన్ సొసైటీ (ఫాస్) ఆధ్వర్యంలో సినీరంగానికి చెందిన ప్రముఖులకు ఆదివారం అవార్డులు అందచేశారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్లో ఫాస్ అవార్డులు–2023 ప్రదానోత్సవం జరిగింది. అక్కినేని ఫాస్ సిల్వర్ జూబ్లీ, సిల్వర్ పీకాక్ మహిళా ఫిలిం అవార్డుల విభాగం కింద ఉత్తమ చిత్రంగా 'పెళ్లి సందడి', ఉత్తమ దర్శకురాలిగా గౌరీ రోణంకి, ఉత్తమ మహిళా నిర్మాతగా అనురాధా దేవి, ఉత్తమ నటిగా దివ్యవాణి, ఉత్తమ గాయనిగా మాళవిక తదితరులు అందుకున్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఫాస్ సిల్వర్ జూబ్లీ, జీవన సాఫల్య పురస్కారాలను నటులు రోజా రమణి, రచయిత పరుచూరి గోపాలకృష్ణ అందుకున్నారు. దర్శకరత్న దాసరి ఫాస్ సిల్వర్ జూబ్లీ, సిల్వర్ నంది ఫిలిం అవార్డుల విభాగంలో జీవన సాఫల్య పురస్కారాన్ని నిర్మాత శ్రీ కల్యాణ్, దర్శకుడు రేలంగి నరసింహారావు అందుకున్నారు. 2018–2023 వరకు ఉత్తమ సిల్వర్ నంది అవార్డుల విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికైన 'బలగం'కు గాను ఆ సినిమా నిర్మాత హర్షిత్ రెడ్డి, ఉత్తమ సినీజర్నలిస్టు విభాగంలో 'సాక్షి' సీనియర్ పాత్రికేయుడు రెంటాల జయదేవ అవార్డులందుకున్నారు. నటుడు మురళీమోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా కార్యక్రమంలో ఫాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ధర్మారావు, ఎల్. విజయకుమార్ పాల్గొన్నారు.

ఢిల్లీలో మెప్పులు.. గల్లీలో తిట్లు

బీజేపీ తీరు అర్థం కాదు: మంత్రి హరీశ్‌


సిద్దిపేటజోన్: ఢిల్లీలో మెచ్చుకుంటారు..గల్లీలో తిడతారా..ఇదేమి తీరు బీజేపీ నాయకుల వ్యవహార శైలి అర్థం కాదు. రాష్ట్రానికి అవార్డుల మీద అవార్డులిస్తూ ఇక్కడికి వచ్చి రాష్ట్రంలో ఏమీ జరగలేదని వ్యాఖ్యలు చేయడం అర్థరహితమని మంత్రి హరీశ్‌రావు కేంద్రం తీరుపై మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుద్దెడ శివార్లలో ఆదివారం పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయ నూతన కళాశాల భవన సముదాయాల నిర్మాణానికి రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ..రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను నకలు కొట్టేది, రాష్ట్ర సంక్షేమ పథకాలను మెచ్చుకునేది, రాష్ట్ర పనితీరుపై అవార్డులు ఇచ్చేది కేంద్రమేనని, ఇక్కడకొచ్చి తిట్టేది కూడా బీజేపీ పెద్దలేనని ఆపార్టీ వైఖరిని ఎద్దేవా చేశారు.

ప్రజల మనిషి హరీశ్‌

చిత్తశుద్ధి, అంకితభావం ఉన్న నాయకుడు మంత్రి హరీశ్‌రావు అని, అందుకే రాష్ట్రానికి సిద్దిపేట ఆదర్శంగా నిలిచిందని, హరీశ్ ప్రజల మనిషిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభివర్ణించారు. మత్స్య సహకార సొసైటీలో 3.72 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని, మరో లక్షమందికి కొత్తగా సభ్యత్వం ఇస్తున్నట్టు తలసాని పేర్కొన్నారు.

కొత్తగా 'పాలమూరు'!

కుడి, ఎడమ కాల్వాల లే అవుట్ ఇదీ..



నియోజకవర్గాల వారీగా కుడి ప్రధాన కాల్వ ఆయకట్టు..

నియోజకవర్గం	ఆయకట్టు (ఎకరాల్లో)
కల్వకుర్తి	80,986
జడ్చర్ల	1,02,252
షాద్‌నగర్	50,644
చెవెళ్ల	68,811
దేవరకొండ	2,946
ఇబ్రహీంపట్నం	69,057
మహేశ్వరం	15,340
మునుగోడు	3,598
రాజేంద్రనగర్	4,532
పరిగి	402
మొత్తం	3,98,568

ఎడమ ప్రధాన కాల్వ ఆయకట్టు ఇదీ..

నియోజకవర్గం	ఆయకట్టు (ఎకరాల్లో)
మహబూబ్‌నగర్	14,852
కొడంగల్	1,46,627
నారాయణపేట	66,888
మక్తల్	506
పరిగి	79,849
తాండూరు	1,02,797
వికారాబాద్	89,287
చెవెళ్ల	900
మొత్తం	5,01,706

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్దండాపూర్ రిజర్వాయర్ ద్వారా తొలుత 5,02,000 ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించగా.. కేపీలక్ష్మీదేవిపల్లి ఆయకట్టును సైతం కలపడంతో ఇది 9,06,684 ఎకరాలకు చేరింది. ఇటీవల ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆయకట్టుకు సాగునీరు అందించడానికి రూ.5,680 కోట్లతో ఉద్దండాపూర్ కుడి ప్రధాన కాల్వ, ఎడమ ప్రధాన కాల్వ నిర్మాణ పనులకు పరిపాలనపర అనుమతులు జారీ చేస్తూ గత నెల 30న కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ సంతకం చేశారు.

కావాలనుకుంటే మళ్లీ నిర్మాణం!

పాత ప్రతిపాదనల ప్రకారం 2.8 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి 4.13 లక్షల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇప్పటివరకు పనులు మొదలుపెట్టకపోవడంతో ప్రభుత్వం దీన్ని ఉపసంహరించుకుంది. భవిష్యత్తులో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు విస్తరించి అదనపు ఆయకట్టుకు నీరివ్వాలని భావిస్తే.. మళ్లీ కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి. ఈ జలాశయంతో కలిపే ప్రాజెక్టుకు అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని వెల్లడించాయి.

కుడి కాల్వ కింద 3,98,568 ఎకరాలకు..

ఉద్దండాపూర్ కుడి ప్రధాన కాల్వ 105.5 కిలోమీటర్ల పొడవున ఆయకట్టుకు సాగునీరు అందించనుంది. 6,922 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన ఈ కాల్వ ద్వారా 3,98,568 ఎకరాలకు సాగునీరు ఇస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది.

- ఇందులో తొలి కుడి బ్రాంచి కాల్వ (ఆర్బీసీ1) ద్వారా 2,19,731 ఎకరాలకు.. రెండో కుడి బ్రాంచి కాల్వ (ఆర్బీసీ2) ద్వారా 1,00,792 ఎకరాలు, ప్రధాన కాల్వ ద్వారా నేరుగా 78,045 ఎకరాలకు నీరు అందుతుంది. ఈ కుడికాల్వకు అనుసంధానంగా ఫతేపూర్ కాల్వ ద్వారా మరో 6,410 ఎకరాలను సర్కారు ప్రతిపాదించింది.
- తాగునీటి అవసరాల కోసం చించోడ్‌లోని చౌట చెరువు, బ్రహ్మచెరువు, వీర్లపల్లిలోని అంతుకుంట, దామర్‌పల్లిలోని మల్లప్ప చెరువు, హైతాబాద్‌లోని పెద్ద చెరువు, మాచాన్‌పల్లిలోని నల్ల చెరువు, చందనవల్లిలోని పెద్ద చెరువు, తాడ్లపల్లిలోని నాగుల చెరువు, లింగారెడ్డి చెరువు, దారప్పల్లిలోని దార్పల్లి చెరువులను కుడి ప్రధాన కాల్వతో అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎడమ కాల్వ కింద 5,01,706 ఎకరాలకు..

ఉద్దండాపూర్ ఎడమ ప్రధాన కాల్వ 133.65 కిలోమీటర్ల పొడవునా సాగుతుంది. దీని సామర్థ్యం 3,790.8 క్యూసెక్కులు. ఈ కాల్వ కింద 5,01,706 ఎకరాల ఆయకట్టును ప్రభుత్వం ప్రతిపాదించింది. తాగునీటి అవసరాలకు మల్కా చెరువు (కుసుమ సముద్రం), కొత్త చెరువు (ఇప్పాయిపల్లి), చైలమ్మ చెరువు (కుల్కచర్ల), ఖమ్మం చెరువు (ఖమ్మమాచారం), ఊర చెరువు (పాలెపల్లి), కొత్త చెరువు (బాచ్పల్లి), ఊర చెరువు (ఊట్పల్లి), సర్పాన్‌పల్లి ప్రాజెక్టు(సర్పాన్‌పల్లి), అలీపూర్ ట్యాంకు (అలీపూర్), పెద్ద చెరువు (పెద్దెముల్)లను ఎడమ ప్రధాన కాల్వ ద్వారా నింపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఓఆర్ఆర్ ప్రైవేటుకు నిర్ణయం ప్రజల గొంతుకోయడమే

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ముందువరుసలో ఉందని, ఈ క్రమంలో నగరంలో వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని, ఇలాంటప్పుడు ఓఆర్ఆర్‌కు ఆదాయం పెరగడమే తప్ప తగ్గే ప్రసక్తే లేదని చెప్పారు. 30 ఏళ్లలో హెచ్ఎండీఏ టోల్ ఆదాయం కనిష్టంగా రూ.75వేల కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు.

నిబంధనలు తుంగలోకి తొక్కి...

హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ 2031 వరకు మాత్రమే ఆమోదం పొంది ఉందని, కానీ ఓఆర్ఆర్‌ను 30 ఏళ్లకు లీజు ఇచ్చేందుకు టెండరు చేపట్టాల్సిన అవసరం ఏమిటో అర్థం కాలేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. నిబంధనలన్నీ తుంగలోతొక్కి ఈ టెండరు ప్రక్రియ జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని గండికొట్టు విధంగా ఐఆర్‌బీకి టెండరు కట్టబెట్టినట్లు ఆయన ఆరోపించారు. ఓఆర్ఆర్‌పై ప్రైవేటు సంస్థ చేసిన అధ్యయనం నివేదికను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మణిపూర్‌లో కులాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. హింస ద్వారా ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అవుతాయని తెలిపారు. మణిపూర్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.5,500 కోట్లను ఖర్చు చేసిందని వెల్లడించారు. మణిపూర్ యువతను, అక్కడి ప్రజలను కోరుకునేది ఒక్కటేనని, హింసను పక్కనపెట్టి ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు దక్షిణాదే పునాది

30 శాతానికి పైగా జీడీపీ ఐదు దక్షిణాది రాష్ట్రాలదే


- టాప్–5లో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఏపీ, కేరళ రాష్ట్రాలు
- తలసరి ఆదాయంలో తెలంగాణదే అగ్రస్థానం
- పన్ను ఆదాయ వనరుల్లో రెండో స్థానం
- ఆర్బీఐ నివేదిక 2022–23లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్‌: దక్షిణాది రాష్ట్రాలే భారతదేశ ఆర్థిక వెన్నెముకని, దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల స్థూల ఉత్పత్తి (జీడీపీ) దేశ స్థూల ఉత్పత్తిలో 30% కన్నా ఎక్కువ ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వెల్లడించింది. 2022 - 23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్బీఐతో పాటు వివిధ రాష్ట్రాల ఆర్థిక సర్వేలు ఈ మేరకు వెల్లడించాయి. ఈ నివేదికల ప్రకారం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు పలు ఆర్థిక సూచీల్లో ముందు వరుసలో నిలిచాయి.

టాప్5లో రెండు తెలుగు రాష్ట్రాలు..

దక్షిణాది రాష్ట్రాల విషయానికి వస్తే పలు అంశాల్లో రెండు తెలుగు రాష్ట్రాలు అగ్రస్థానాల్లో నిలిచాయి. జీడీపీలో తమిళనాడు (రూ.24.8 లక్షల కోట్లు) మొదటి స్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో కర్ణాటక (22.4లక్షల కోట్లు), తెలంగాణ (13.3లక్షల కోట్లు), ఆంధ్రప్రదేశ్ (13.2లక్షల కోట్లు), కేరళ (రూ.10లక్షల కోట్లు) నిలిచాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం విషయానికొస్తే తెలంగాణ రూ. 2,75,443తో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత కర్ణాటక (రూ.2,65,623), తమిళనాడు (రూ.2,41,131), కేరళ (రూ.2,30,601), ఆంధ్రప్రదేశ్ (రూ. 2,07,771) తొలి ఐదు స్థానాలు దక్కించుకున్నాయి. జీడీపీతో పోలిస్తే అప్పుల్లోనూ తెలంగాణ అతి తక్కువతో మొదటి స్థానంలో నిలిచింది. స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో తెలంగాణ 25.3 శాతం, కర్ణాటక 27.5 శాతం, తమిళనాడు 27.7 శాతం, ఆంధ్రప్రదేశ్ 32.8 శాతం, కేరళ 37.2 శాతం అప్పులు కలిగి ఉన్నాయని నివేదికలు వెల్లడించాయి. రాష్ట్ర పన్నుల ఆదాయంలోనూ తెలుగు రాష్ట్రాలు మంచి ప్రతిభ కనబరుస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. తమిళనాడులో అత్యధికంగా రూ. 1.26 కోట్ల పన్ను ఆదాయం రాగా, ఆ తర్వాత కర్ణాటకలో రూ.1.11 కోట్లు, తెలంగాణలో రూ.92,910 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.85,265 కోట్లు, కేరళ రూ.71,833 కోట్లు వచ్చినట్టు నివేదికలు తెలిపాయి. వడ్డీల చెల్లింపుల్లో కూడా తెలంగాణ 11.3 శాతం, ఆంధ్రప్రదేశ్ 14.3 శాతం, కర్ణాటక 14.3 శాతం, కేరళ 18.8 శాతం, తమిళనాడు 21 శాతంతో దేశంలోనే తక్కువ వడ్డీ చెల్లిస్తున్న రాష్ట్రాలుగా నిలిచాయి.



హెచ్‌సీఆర్ అక్షరాల ఆకారంలో సైక్లిస్టులు

సైక్లింగ్‌తో కాలుష్య నివారణ

- భారీగా 'హైదరాబాద్ సైక్లింగ్ విప్లవం'
- 3,500 మంది సైక్లిస్టుల హాజరు

రసూల్‌పురా (హైదరాబాద్): సైక్లింగ్ కమ్యూనిటీ ఆఫ్ హైదరాబాద్ నేతృత్వంలో నగరంలో యాక్టివ్ మొబిలిటీపై నగర ప్రజలకు అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ సైక్లింగ్ విప్లవం (హెచ్‌సీఆర్) పేరుతో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఆదివారం ఒక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగరంలోని 20 సైక్లిస్ట్ గ్రూపులకు చెందిన 3,500 మంది సైక్లిస్టులు పాల్గొన్నారు. దీర్ఘకాలిక, స్థిరమైన శాశ్వత రవాణా పరిష్కారానికి నడక, పరుగు, సైక్లింగ్ లేదా ప్రజా రవాణాను ఉపయోగించడం వంటి యాక్టివ్ మొబిలిటీపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సైక్లింగ్ మేయర్ శాంతన సెల్వన్ తెలిపారు. ఈ సందర్భంగా సైక్లిస్టులు హెచ్‌సీఆర్ అక్షరాల ఆకారంగా సైకిళ్లతో నిల్చోవడం విశేషంగా ఆకట్టుకుంది.



సైకిళ్ల వినియోగం పెరగాలి

నగర ప్రజలు సొంత రవాణా వ్యవస్థను ఉపయోగించడం వల్ల నగరంలో నానాటికీ కాలుష్యం పెరిగిపోతోంది. సైకిళ్లతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తే కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

– మర్రి లక్ష్మణ్‌రెడ్డి, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్



రెండేళ్ల నుంచి సైక్లింగ్

దుబాయ్‌లో సైక్లింగ్ సర్వసాధారణం. అక్కడ పన్నెండేళ్లు సైక్లింగ్ చేశాను. సైక్లింగ్ వల్ల మంచి వ్యాయామంతో పాటు కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

– షాజియా పర్వీన్, సోమాజిగూడ.

నేడు కాంగ్రెస్ 'యూత్ మేనిఫెస్టో'

సరూర్‌నగర్ వేదికగా ప్రియాంకా గాంధీ 'యువ సంఘర్షణ సభ'

- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ
- ప్రతి నెలా రూ.4 వేలు నిరుద్యోగ భృతి.. ప్రతి ఉమ్మడి జిల్లాలో ఐఐటీ
- బీసీ, ఈబీసీలకూ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీ పనితీరు..
- అమరవీరుల కుటుంబాలకు నెలవారీ పింఛన్ కూడా..
- గురుకుల వ్యవస్థను ఆధునీకరిస్తామనే హామీ ఇవ్వనున్న ఏఐసీసీ అగ్రనేత
- సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 6:30 వరకు ప్రియాంక పర్యటన



సాక్షి, హైదరాబాద్/ సాక్షి, రంగారెడ్డి జిల్లా: రానున్న ఎన్నికల్లో యువతను ఆకట్టుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోమవారం 'యూత్ మేనిఫెస్టో'ప్రకటించనుంది. గత ఏడాది వరంగల్‌లో నిర్వహించిన సభలో రాహుల్‌గాంధీ 'రైతు డిక్లరేషన్'ప్రకటించిన విధంగానే.. సోమవారం సాయంత్రం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే 'యువ సంఘర్షణ సభ'లో ప్రియాంకా గాంధీ 'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్'ను ప్రకటించనున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.4వేల చొప్పున భృతి ఇస్తామని ప్రకటించనున్నట్టు టీపీసీసీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో 18 నుంచి 40 ఏళ్ల మధ్య నిరుద్యోగులు 60 లక్షల మంది ఉంటారని.. అందులో 25 లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఉంటారనే అంచనా మేరకు ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి ప్రకటనలు చేయాలని నిర్ణయించామని వెల్లడించాయి. విద్య–ఉత్పాదకత సృష్టి ద్వారా చదువుకున్న అందరికీ వారి విద్యార్హతల మేరకు ఉపాధి కల్పిస్తామనే హామీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నాయి. యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీ పనితీరును తీర్చిదిద్దుతామని, ఏటా జాబ్ కేలండర్‌ను ప్రకటిస్తామని భరోసా కల్పించనున్నట్టు తెలిపాయి. యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు టెలి కమ్యూనికేషన్స్ మాజీ ఇంజనీర్ శ్యామ్ పిట్రోడా నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'నాలెడ్జ్ సొసైటీ'అధ్యయన నివేదిక మేరకు.. విద్య, ఉపాధి రంగాల్లో రాష్ట్ర యువతకు పలు వరాలు ప్రకటిస్తామని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి.

విద్యా రంగంలోనూ 'భరోసా'

ఉపాధి కల్పనతోపాటు విద్యా రంగంలో భరోసా ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీల తరహాలో బీసీ, ఈబీసీలకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని.. ప్రతి ఉమ్మడి జిల్లాలో ఐఐటీ ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించనుంది. పీవీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఏపీలో సర్వేల్ గురుకులాన్ని ఏర్పాటు చేసి.. రెసిడెన్షియల్ విద్యకు శ్రీకారం చుట్టినది కాంగ్రెస్ పార్టీనేనని పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పుడు ఆ గురుకుల వ్యవస్థను మెరుగైన సౌకర్యాలతో నడిపిస్తామని హామీ ఇవ్వనున్నట్టు తెలిపాయి. మొత్తమ్మీద యువకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకట్టుకునే దిశలో ప్రియాంకా గాంధీ 'యూత్ మేనిఫెస్టో'ప్రకటించనున్నట్టు వెల్లడించాయి.

అమరవీరుల కుటుంబాలకు పింఛన్లు

తెలంగాణ కోసం తనువు చాలించిన అమరవీరుల కుటుంబాలకు ప్రియాంకా గాంధీ సభలో భరోసా కల్పించనున్నట్టు టీపీసీసీ నేతలు చెప్తున్నారు. తొలి, మలిదశ అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటామని, వారికి నెలవారీ పింఛన్ ఇస్తామని హామీనివ్వనున్నట్టు చెబుతున్నారు.

సాయంత్రం 4 గంటలకు రానున్న ప్రియాంక

కర్ణాటక నుంచి సోమవారం సాయంత్రం 4కి శంషాబాద్ విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచి బయలుదేరి 4:45 గంటలకు సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకుంటారు. 5:45 గంటల వరకు సభలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత నేరుగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లి.. 6.30 సమయంలో ఢిల్లీ బయలుదేరుతారని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి.

సభకు ఏర్పాట్లు పూర్తి..

సభ కోసం టీపీసీసీ ఏర్పాట్లు పూర్తి చేసింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, యువ నాయకులు మానవతారాయ్, చరణ్ కౌశిక్, మహ్మద్ రియాజ్, చెనగోని దయాకర్, బాలలక్ష్మి, చారగొండ వెంకటేశ్ రెండురోజులుగా సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం మాణిక్‌రావ్ ఠాక్రే, ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు సభ ఏర్పాట్లను పరిశీలించారు. మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి దేప భాస్కర్‌రెడ్డి సభా వేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 50మంది కూర్చొనేలా విశాల వేదికను ఏర్పాటు చేశారు. స్టేజీ ముందు భాగంలో వీఐపీలకు, మహిళలకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

'నిరుద్యోగ ర్యాలీ'.. ట్రాఫిక్ మళ్లింపులు

వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి సాయంత్రం నాలుగు గంటలకు ఎల్బీనగర్ శ్రీకాంతాచారి విగ్రహం నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు కాంగ్రెస్ 'నిరుద్యోగ జంగ్ సైరన్'ర్యాలీ నిర్వహించనుంది. కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఈ ర్యాలీలో, సరూర్‌నగర్ సభలో పాల్గొంటున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సరూర్‌నగర్, ఎల్బీనగర్ పరిసరాల్లో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి. విజయవాడ హైవే, సాగర్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలను ఇటు చంపాపేట వైపు, అటు నాగోల్ వైపు మళ్లించనున్నారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలను చైతన్యపురి సిగ్నల్ నుంచి నాగోల్ వైపు మళ్లిస్తారు.


దోపిడీలే కల్వకుంట్ల కుటుంబ ధ్యేయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలను దోపిడీ చేయడమే కల్వకుంట్ల కుటుంబ ధ్యేయమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో విమర్శించారు. శనివారం పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ.. మంత్రి కేటీఆర్ సామెతలు మాట్లాడడం ఆపి, వాస్తవాలు మాట్లాడే సంస్కృతి నేర్చుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులే హత్యలు, లైంగిక దాడులు చేస్తూ పట్టుబడుతున్నా కేటీఆర్‌కు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.

బీజేపీని గద్దె దించేందుకు లౌకికశక్తులు ఏకం కావాలి

ఇబ్రహీంపట్నంలో ఇంటింటికి సీపీఐ ముగింపు సభలో నారాయణ పిలుపు



ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజాతంత్ర, లౌకిక, వామపక్ష శక్తులు ఏకం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. దేశంలో మోదీ సర్కారు రాక్షస, రౌడీల పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం ముగింపు సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారం మోపిందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచడం వలన సామాన్య ప్రజలు సతమతమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులైన అదానీ, అంబానీలకు కట్టబెడుతూ కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కుకర్మాగారాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. చర్మకారులు చెప్పులు తయారు చేసుకుని బతుకుతుంటే వారిపై జీఎస్టీ వేసిన ఘనత నరేంద్రమోదీ సర్కారుకే చెల్లిందని మండిపడ్డారు. రాష్ట్రంలో మళ్లీ భూపోరాటాలు చేస్తామని ప్రకటించారు. డ్రగ్స్, గంజాయిలను అఫ్గానిస్తాన్ నుంచి సముద్రమార్గం గుండా విశాఖపట్నం తీసుకొచ్చి హైదరాబాద్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. డ్రగ్స్ మాఫియాను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

కేసీఆర్ లాక్కున్న భూములు తిరిగి పేదలకిస్తాం

- కాంగ్రెస్‌కు అధికారం ఖాయమన్న సీఎల్పీ నేత భట్టి


హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద భట్టి విక్రమార్కకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్/ఎల్బీనగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే... సీఎం కేసీఆర్ పేదల నుంచి లాక్కున్న భూములను మళ్లీ పేదలకే దక్కేలా చర్యలు తీసుకుంటామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట ఔటర్ కూడలిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పేదలకు 10 వేల ఎకరాల భూములను పంచిందని తెలిపారు. ఫార్మాసిటీ, లాజిస్టిక్ పార్కు, హెచ్‌ఎండీఏ లేఔట్ల సాకుతో కేసీఆర్ ప్రభుత్వం వాటిని బలవంతంగా లాక్కున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వాటి మార్కెట్ ధర సుమారు రూ.5 లక్షల కోట్లకు పైగా ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇచ్చినప్పటికీ.. దశాబ్ద కాలంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ వస్తోందన్నారు. మేధావి, విద్యార్థి, నిరుద్యోగ లోకం ఆక్రోశం.. అణు విస్ఫోటనం కంటే ప్రమాదకరమని హెచ్చరించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు భరోసా కల్పించేందుకే ప్రియాంక గాంధీ వస్తున్నారని తెలిపారు. యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించి నూరుశాతం అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని భట్టి జోస్యం చెప్పారు. పీపుల్ మార్చ్ పాదయాత్ర ఆదివారం రాత్రి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేతలు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు భట్టికి ఘన స్వాగతం పలికారు. వనస్థలిపురం సుష్మ థియేటర్ సమీపంలోని ఓ నివాసంలో భట్టి బస చేశారు.

నిరుద్యోగ సభకు భారీగా తరలిరావాలి: మాణిక్‌రావ్ ఠాక్రే

రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా నిరుద్యోగ యువతను మోసం చేయడాన్ని నిరసిస్తూ నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం నిర్వహిస్తున్న సభకు యువత అధిక సంఖ్యలో రావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే పిలుపునిచ్చారు. ఉద్యోగ నోటిఫికేషన్లు అంటూనే రాష్ట్ర ప్రభుత్వం పేపర్లు లీక్ చేస్తూ నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలిటికల్ టూరిస్టులకు స్వాగతం: కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రియాంకా గాంధీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చేతిలోనే తెలంగాణ భవిష్యత్ పదిలంగా ఉంటుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారని తెలిపారు.

రాజకీయం కోసం బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు

జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఎంప్లాయ్‌మెంట్ పాలసీ ప్రకటించకపోవడం వల్లే దేశంలో నిరుద్యోగ సమస్య ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. నిరుద్యోగ సమస్య పట్టించుకోకుండా యువతను రాజకీయాలకు మాత్రమే వాడుకోవడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైందన్నారు. పదేళ్లుగా అధికారానికి దూరమై కాంగ్రెస్ నేతలు అసహనంతో ఉన్నారని, అధికారం కోసం ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతను రెచ్చగొడితే తెలంగాణ సమాజం సహించబోదని హెచ్చరించారు. విశ్వ నగరంగా లక్షలాది మంది టూరిస్టులను ఆహ్వానిస్తోన్న హైదరాబాద్.. ఆ తరహాలోనే ప్రియాంకా గాంధీ లాంటి పొలిటికల్ టూరిస్టులకు స్వాగతం పలుకుతోందన్నారు. ప్రియాంకా గాంధీ ఈ పొలిటికల్ టూర్‌ను ఎడ్యుకేషన్ టూర్‌గా మార్చుకోవాలని కేటీఆర్ హితవు పలికారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివే కాంగ్రెస్ మార్కు సంస్కృతిని పక్కనెట్టి, ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేయాలని, "ఆవో, దేఖో, సీఖో"అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో సంక్షోభం

కాంగ్రెస్ పాలనలో సంక్షోభానికి కేంద్రంగా ఉన్న తెలంగాణ కేసీఆర్ పాలనలో దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా ఎదిగిందని కేటీఆర్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై తప్పుడు కేసులు వేసి అభివృద్ధి నిరోధకులుగా వ్యవహరిస్తున్న సొంత పార్టీ నేతలకు ప్రియాంకగాంధీ బుద్ధిచెప్పాలని సూచించారు. సుదీర్ఘ ఉద్యమంలో ఏనాడు ప్రజల పక్షాన నిలబడకుండా ఇప్పుడొచ్చి మాట్లాడితే తెలంగాణ సమాజం నమ్ముతుందన్న భ్రమలో ఉండొద్దని ప్రియాంకా గాంధీ మంత్రి కేటీఆర్ హితవు పలికారు.



వంద మందిలో వీరుడు పుడతాడు. వెయ్యిమందిలో తెలివైనవాడు కనిపిస్తాడు. కానీ నిష్ణాతుడు లక్షమందిలో కూడా కానరాడు.

– ప్లేటో

సాక్షి

సోమవారం, 8 మే 2023

చావు చిల్లర

రావిశాస్త్రి 'కార్నర్ సీట్' కథ సుప్రసిద్ధం. అందులో ఒకతను రైలు ప్రయాణం చేయబోయి కంపార్ట్‌మెంట్‌లోని కార్నర్ సీట్ ఆశిస్తాడు. కూచునే లోపల ఒక ఆకుపచ్చకోటు వాడు ఆ సీటును ఆక్రమిస్తాడు. అప్పట్నించి ఇతను ఆ ఆకుపచ్చకోటు వాణ్ణి తిట్టుకుంటూనే ఉంటాడు. ఆ ఆకుపచ్చకోటు వాడు ఇదంతా పట్టకుండా ఎటో చూస్తుంటాడు. ఏదో ఆలోచిస్తుంటాడు. మధ్యలో ఒకచోట రైలు ఆగుతుంది. తిరిగి బయలుదేరబోతుంటుంది. ఒక్క క్షణం. ఆకుపచ్చకోటు వాడు ఒక్క ఉదుటున కంపార్ట్‌మెంట్ దిగేస్తాడు. ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ముక్కలైపోతాడు. రెప్పపాటు. అంతవరకూ అతణ్ణి తిట్టుకున్న ఇతను నిశ్చేష్టుడవుతాడు. అతనికీ ఇతనికీ ఏ సంబంధమూ లేదు– కార్నర్ సీటుతో తప్ప. కాని ఇతనికి ఏడుపు వస్తుంది. దుఃఖం కలుగుతుంది. ఈ లోకంలో ఎంతో ఎండా నీడా గాలి నీరూ వర్షం ఉన్నాయి. వాటిని అనుభవించకుండా ఏదో ఒక సూర్యోదయాన్ని సూర్యాస్తమయాన్ని చూసి ఊరట చెందకుండా ఏ కష్టానికి ఎందుకు చనిపోయాడో అని వెక్కివెక్కి ఏడుస్తాడు. ఎదుటివాడి చావు పట్ల మనకు ఉండాల్సిన వేదన, సహానుభూతి గురించి రావిశాస్త్రి రాసిన గొప్ప కథ అది.

ఆర్.కె.నారాయణ్ 'మిస్సింగ్ మెయిల్' కథ కూడా సుప్రసిద్ధమే. వినాయక్ మొదలి వీధిలో ఇంటింటికీ ఉత్తరాలు అందించే పోస్ట్‌మేన్ తానప్పకు ఆ వీధిలోని అందరి కష్టసుఖాలు తెలుసు. రామానుజమ్ గారి కుమార్తె కామాక్షికి చాలా రోజులుగా సంబంధాలు కుదరడం లేదని తెలుసు. ఇప్పుడు కుదిరిన ఢిల్లీ సంబంధం ఈ ముహూర్తం దాటితే తిరిగి మూడేళ్ల వరకు అబ్బాయికి వీలు కాదనీ తెలుసు. రామానుజమ్ ఇంట్లో ఒకవైపు పెళ్లి పనులు జరుగుతుండగా మరోవైపు తానప్పకు టెలిగ్రామ్, ఉత్తరం అందుతాయి. వాటిలో రామానుజమ్ మేనమామ మరణవార్త ఉంటుంది. ఇప్పుడేం చేయాలి? ఈ కబురు రామానుజమ్‌కు తెలిస్తే వెంటనే బయల్దేరాలి. పెళ్లి ఆగిపోవాలి. మళ్లీ మూడేళ్ల వరకూ పోస్ట్‌పోన్ చేయాలి. అందుకే తానప్ప ఆ టెలిగ్రామ్, ఉత్తరం దాచి పెడతాడు. పెళ్లయ్యి అమ్మాయిని సాగనంపాక మెల్లగా ఆ సంగతి తెలియచేస్తాడు. మరణవార్త ఎప్పుడు, ఎలా చెప్పాలో తెలిసి సంస్కారం పాటించిన తానప్పను పాఠకుడు గుండెల్లో పెట్టుకుంటాడు.

చావును గౌరవించడం ప్రతి నాగరికతలో ఉంది. చనిపోయిన వ్యక్తికి 'అంతిమ సంస్కారం' నిర్వహించడం సాటి మనిషి సంస్కారం. జననంతో మొదలయ్యే మనిషి జీవనవృత్తం మరణంతో ముగుస్తుందని అందరికీ తెలిసినా మరణం తెచ్చే శూన్యం, వెలితి ఆ కుటుంబానికి, సంబంధీకులకు, స్నేహితులకు చాలా తీవ్రమైనవిగా జనులు భావిస్తారు. అందుకే నిన్న మొన్నటి వరకూ పల్లెల్లో ఒక వ్యక్తి మరణిస్తే ఎత్తుబడి అయ్యేంత వరకూ ఊరు ఊరంతా పొయ్యి ముట్టించేది కాదు. చావుఇంటి దగ్గర చేరి ధైర్యం చెప్పడం, జరగవలసిన పనులు చూడటం చేసేవారు. మనిషి చనిపోవడం అంటే 'కూకటి వేళ్లతో సహా చెట్టు కూలిపోవడం'గా గాథా సప్తశతి వ్యాఖ్యానిస్తుంది. చెట్టు ఆధారంగా ఎంత జీవం పెనవేసుకుని ఉంటుందో మనిషి ఆధారంగా కూడా అనేక జీవనాలు పెనవేసుకుని ఉంటాయి. ఇప్పటికీ కొన్ని గిరిజన సముదాయాలైతే తమ సమూహంలోని ఎవరైనా ముఖ్యమైన వ్యక్తి మరణిస్తే ఆ ఆవాసాన్ని, గూడేన్ని ఏకంగా ఖాళీ చేసి వెళ్లిపోతాయి జ్ఞాపకాలను తట్టుకోలేక. అందుకే మనిషి పోయినప్పుడు పోయిన వ్యక్తిని గౌరవించడంతో పాటు అతని చుట్టూ ఉన్న వ్యక్తుల వేదనను కూడా గౌరవించి మెలగాలి.

ఈ దేశం విన్న అత్యంత విషాదకరమైన మరణవార్త గాంధీ గారి హత్య. రేడియోలో ఈ వార్త విన్న ఒక బాలిక పరిగెత్తుకుంటూ తల్లి దగ్గరకు వచ్చి 'అమ్మా... గాంధీ గారు చనిపోయారట' అంటే ఆ తల్లి ఉలిక్కిపడి లేచి కూతురి చెంప మీద లాగి పెట్టి ఒక్కటి వేస్తుంది– 'ఏమిటా పాడు మాటలు' అని! ఆ తర్వాత ఆ వార్త నిజం అని తెలిసి కన్నీరుమున్నీరుగా ఏడుస్తుంది. ఇంద్రగంటి జానకీబాల 'కనిపించే గతం' నవల ఈ సంఘటనతోనే మొదలవుతుంది. గాంధీ గారి మరణవార్త విని ఎక్కడికక్కడ కూలబడి విలపించినవాళ్లు, సినిమా హాళ్లలో సగం నుంచి లేచి ఏడ్చుకుంటూ బయటపడినవాళ్ళు, మూడు రోజులు లంకణం చేసినవారు ఎందరో ఉన్నారు. మహనీయులు, కళాకారులు, నాయకులు, ఆపద్బాంధవులు... జనులతో మమేకమై ఉంటారు. అందువల్ల వారి మరణ వార్తల పట్ల ఇంకా గౌరవం పాటించాలి. నిర్ధారణలు చేసుకోవాలి. అప్పుడే చెప్పాలి.

కాని ఇవాళ ఒక వికృతమైన సంస్కృతి ఎల్లెడలా కనిపిస్తూ ఉంది. దానిని పైశాచిక సంస్కృతి అనవచ్చు. చిల్లర సంస్కృతి అనవచ్చు. సోషల్ మీడియా సంస్కృతి అని కూడా అనవచ్చు. వ్యక్తుల చావు వార్తలను సత్యాసత్యాలతో సంబంధం లేకుండా పుకార్ల స్థాయికి దిగజార్చడం. బతికున్నవారిని చంపడం. వైద్యం తీసుకుంటూ పోరాడుతున్నవారికి చావు ముహూర్తం లిఖించడం. దీనికి హతాశులైన ఆ సజీవులు తామే ముందుకొచ్చి 'బతికున్నాం మొర్రో' అని చెప్పడం. బంధువులు దిగ్భ్రాంతితో 'అవన్నీ అబద్ధాలు' అని చెప్పాల్సి రావడం. జవాబుదారీతనం లేని వ్యవస్థ డ్రైనేజీలాంటిది. ఆ డ్రైనేజీతో మనకెందుకు అని నలుగురూ ఊరుకోవడం వల్లే అందులో కంపుతోపాటు ఇంపు కూడా కొట్టుకొనిపోవాల్సి వస్తోంది. ఫేక్‌ఐడిలు, ఆనవాలు లేని వాట్సప్‌లతో తప్పుడు చావువార్తలు వ్యాప్తి చేసి సైకిక్ స్టిమ్యులేషన్ పొందుతున్న వారు ఎంతటి మానసిక రోగులో అనుకోవాల్సి వస్తోంది. ఇలాంటి వాళ్లు మన ఇళ్లలో కూడా ఉండొచ్చు. చావును గౌరవిద్దాం. చావుపై చిల్లర ఏరుకునే వ్యవస్థను చావగొడదాం.

బడి నేర్పిన బతుకు పాఠం

కామెంట్



కరణ్ థాపర్

జీవితంలోకి వచ్చి పడ్డాక, ఎప్పుడైనా బాల్యం గుర్తొస్తే ఆనాటి కాలమంతా బంగారు వర్ణంతో మెరిసిపోతూ కళ్ల ముందర లీలగా కనిపించి మాయం అవుతుంది. మళ్లీ వచ్చి జీవితంలో పడిపోతాం. బాల్యంలో ముఖ్యమైనవి బడిలో గడిపిన రోజులు. అవి ముఖ్యమైనవే. కానీ పూర్తిగా సంతోషాన్నిచ్చిన రోజులైతే కాకపోవచ్చు. అప్పట్లో భయంకర సమయాలూ ఉండేవి. అయినాసరే వెనక్కు తిరిగి చూస్తున్నప్పుడు ఆ రోజుల్లో పడ్డ కష్టాలను మర్చిపోతుంటాం. పుస్తకాల్లోని సిలబస్‌తో పాటు బడి అనేక జీవిత పాఠాలు నేర్పిస్తుంది. అన్నిటికన్నా ఉత్తమ జీవితపాఠం... "తప్పులు చేస్తే చేశావు గానీ, ప్రయత్నం మాత్రం ఆపకు. ఎన్నటికీ ప్రయత్నించకుండా ఉండే కన్నా ప్రయత్నించి విఫలం చెందడం మంచిది కదా..'' అనే పాఠం.

పాఠశాల రోజులు నిజంగానే ఒకరి జీవితంలో అత్యుత్తమమైన రోజులా? ఇది నిజమే. అయితే కొన్నిసార్లు బాధగానూ ఉంటుంది. నా విషయానికి వస్తే 16 ఏళ్ల వయసులో డూన్ స్కూల్‌ని వదిలిపెట్టిన తర్వాత నా జీవితం కోలుకోలేనంతగా దిగజారిపోయింది. మరోవైపున గులాబీ రంగులోని జ్ఞాపకాల ద్వారా మనం వెనక్కు తిరిగి చూస్తాము. మనం ఎంత పెద్దవారమైతే ఆ జ్ఞాపకాలు అంత పవిత్రంగా ఉంటాయి.

పాత పాఠశాల చిత్రాల ఆల్బమ్‌ని చూస్తున్నప్పుడు నిన్న నా మనస్సులో చోటుచేసుకున్న ప్రశ్న ఇది. ప్రతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, డాస్కోస్ (డూన్ స్కూల్) పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను తిరిగి సందర్శించినప్పుడు వేల మంది ఈ ప్రశ్నకు గట్టిగా అవును అని జవాబు చెబుతారు.

అయితే నిజం ఏమిటంటే... మనలో ఎవరికీ పాఠశాల కేవలం సంతోషకరమైన ఉల్లాస క్షణాల సేకరణగా ఉండలేదన్నదే. అప్పట్లో భయంకరమైన సమయాలు కూడా ఉండేవి. అవి కూడా మనం ఎదగడంలో సహాయం చేసి ఉన్నప్పటికీ, వాటిని మననం చేసుకుంటున్నప్పుడు ఇప్పటికీ బాధాకరంగానే ఉంటాయి. అయినా సరే మనం వెనక్కు తిరిగి చూస్తున్నప్పుడు మనం ఆరోజుల్లో పడ్డ కష్టాలు, బాధలను మర్చిపోతుంటాము. ఆటపట్టించడం, ఆనాటి నవ్వులు, విజయాలను మాత్రమే మనం మననం చేసుకుంటుంటాము. ఆనాటి శిక్షలను, జరిమానాలను మనం గుర్తు తెచ్చుకున్నట్లయితే, వాటిని ఎదుర్కొని కూడా మనగలగడం గర్వించదగిన విషయమే.

కాబట్టి నలభైలు, యాభైలు, అరవైలలో తమను పెద్దలను చేసిన... అలాగే ఇరవైలలోని కుర్రాళ్లను మృదువుగా మార్చిన డూన్ స్కూల్ మాట ఏమిటి?

న్యాయంగా చెప్పాలంటే, సమాధానంలో కొంత భాగం తప్పకుండా తననూ, ప్రపంచాన్నీ ఒక టీనేజర్ చూస్తున్నంత అమాయకత్వంతో, నమ్మకంతో ఉంటుంది. అతను తన పరిమితులను తెలుసుకోలేనంత చాలా చిన్నవాడు, పైగా తన ఆకాంక్షలను వమ్ము చేయగల అవరోధాల గురించి తనకు ఇప్పటికీ తెలీదు. కలలు ఫలిస్తున్నట్లు, కష్టాలను అధిగమిస్తున్నట్లు, ప్రపంచం ఒక న్యాయమైన చోటుగాను కనిపిస్తుంటుంది. ఈ అర్థంలో... పాఠశాల రోజులు నిజంగానే రమణీయంగానే ఉంటాయి.



సుప్రసిద్ధ డూన్ స్కూల్

డూన్‌ని అంత ప్రత్యేకంగా చేసింది ఏమిటంటే, మాలో ప్రతి ఒక్కరినీ ఒక విశిష్ట వ్యక్తిగా ట్రీట్ చేయడమే! అనేకమందిలో ఒకడిగా నేను ఎన్నడూ భావించలేదు. నా ఉనికి, ప్రాధాన్యం, ఆసక్తుల గురించి నేను జాగరూకతతో ఉండేవాడిని. నేను క్రీడలంటే ద్వేషించేవాడిని. అది చూసి అందరూ నన్ను ఆటపట్టించేవారు కానీ ఎవరూ నన్ను ఆడాలని బలవంత పెట్టలేదు. చర్చలు, నటనను నేను ఆస్వాదించేవాడిని, వాటిలో పాల్గొనాలని నన్ను ప్రోత్సహించే వారు. నేను రాసేవాడిని, చదువుకునేవాడిని. దాన్నీ అందరూ ఆమోదించారు.

ఈరోజు డూన్ స్కూల్ స్కాలర్స్ బ్లేజర్ కథను నేను ప్రస్తావిస్తాను. అది నా ఉద్దేశాన్ని నిరూపిస్తుంది. దశాబ్దాలపాటు క్రీడాకారులు మందపాటి నీలి బ్రౌజర్‌తో గుర్తింపు పొందేవారు. అది వారికి ఎంతో ప్రత్యేకత కలిగించేది. విద్యాపరంగా మొగ్గు చూపేవారికి అలాంటిదేమీ ఉండదు. అందరినీ సమాన దృష్టితో చూడాల్సిన అవసరాన్ని పాఠశాల చేత అంగీకరింప చేయడానికి నేను చాలా సంవత్సరాలు పోరాడాల్సి వచ్చింది.

అది 1971లో సాధ్యమైంది. ఆ సంవత్సరం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హెడ్‌మాస్టర్ కల్నల్ సిమోన్ మొట్టమొదటి స్కాలర్స్ బ్లేజర్‌ని నాకు బహూకరించారు. దాన్ని గెలుచుకున్నందుకు నేను చాలా థ్రిల్ ఫీలయ్యాను కానీ ఆ తర్వాత అది మరింత చిరస్మరణీయంగా రుజువైంది. 'ఈ బ్లేజర్ ఎలా ఉండాలి;' అని హెడ్‌మాస్టర్ ప్రశ్నించారు. నేను చీకాకు పడలేదు. స్పోర్ట్స్ బ్లేజర్‌ని అనుకరించడం గురించే నేను ఆలోచించగలిగాను. అయినా, నేను కోరుకుంటూ వచ్చింది ఇదే కదా!

''రండి యంగ్ మ్యాన్'' అంటూ కల్నల్ సిమోన్ పలకరించాడు. ''మీరే మొట్టమొదటి వ్యక్తి. డూన్ స్కూల్ మొత్తం పాటించేటటువంటి డిజైన్‌ని మీరు రూపొందించారు. అయితే మీరు కాపీ క్యాట్‌గా ఉండాలనుకుంటున్నారా?'' అన్నారు!

స్కాలర్స్ బ్లేజర్‌ని డిజైన్ చేయడానికి ఒక టీనేజర్‌కి స్కూల్ హెడ్మాస్టర్ అనుమతించడాన్ని 50 సంవత్సరాల తర్వాత... ఈనాటికీ నేను నమ్మలేకున్నాను. నలుపు రంగులో సాంప్రదాయికమైన డబుల్ బ్రెస్టెడ్ స్టయిల్‌ని నేను ఎంచుకున్నాను. అందుకే ఆనాటి నుంచి అదే కొనసాగుతూ వచ్చింది.

డూన్ గర్వించదగిన ఒక కారణం ఏమంటే, కల్నల్ సిమోన్ వంటి వ్యక్తులు మాత్రమే అక్కడ ప్రత్యేకమైన వారు కారు. నా హౌస్ మాస్టర్ గురుదయాళ్ సింగ్, నా మ్యాథ్స్ మాస్టర్ షీల్ వోహ్రా, నా జాగ్రఫీ ట్యూటర్ చార్లీ కండ్యాట, హిస్టరీ హెడ్ జీక్స్ సిన్హా.. ఇంకా అనేకమంది ఇతరుల ముఖాలు నాకు ఇప్పటికీ గుర్తే. ఇకపోతే నేను ఎన్నటికీ మర్చిపోలేని ఈ గొంతులు నా జీవితాన్ని తీర్చిదిద్దాయి. నేనేం చేయాలి అని వీరు నాకు చెప్పడమే కాదు, నా పద్ధతిలో నేను చేయడాన్ని వీరు ప్రోత్సహిస్తూ వచ్చారు. నేను తప్పు చేసినప్పుడు (తరచుగా నేను తప్పులు చేశాను) కూడా తప్పు చేయడం అనేది నేరం కాదని వారు నాకు వివరించారు. ఎన్నటికీ ప్రయత్నించకుండా ఉండే కన్నా ప్రయత్నించి విఫలం చెందడం మంచిది కదా! డూన్ స్కూల్ నాకు నేర్పిన ఉత్తమ పాఠం అదే మరి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వాస్తవంలోకి రండి



నిద్ర లేచి కాఫీ వాసన చూడండి. ఆర్టికల్ 370 ఇప్పుడు గతించిన చరిత్ర. డాక్టర్ ఎస్. జై శంకర్ వర్తమాన భారతదేశపు అత్యంత నిజాయితీ పరుడైన ధీశాలి, శక్తిమంతమైన విదేశాంగ మంత్రి.

– డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ అహ్మద్, పొలిటికల్ ఎనలిస్ట్

తగ్గితే ఏమైంది?!



జెలెన్‌స్కీ ప్రపంచ పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారా లేక కీవ్‌కి తిరిగి వెళ్లడానికి భయాందోళన చెందుతున్నారా? ఆయనది బొత్తిగా రెచ్చగొట్టే ప్రవర్తన. అగ్రరాజ్యాలకు అహంకారం ఇష్టం ఉండదు. యుద్ధం అంటే ఆట కాదు, ప్రాణ నష్టం.

– మేజర్ జనరల్ బక్షీ, (రిటైర్డ్)

భలే మనిషి!



నేను మొదటిసారి 2011లో అతనిని కలుసుకున్నప్పుడు ఆ తెలివితేటలు, ఆశయం, హాస్యస్ఫూర్తి చూసి ఆశ్చర్య పోయాను. అతని తాజా పుస్తకం నిజంగా సమ్మిళిత ప్రపంచాన్ని సృష్టించాలనుకుని సహాయం కోసం ఎదురు చూస్తుండే వారు ఎవరైనా తప్పక చదవాలి. ('రాడికల్ ఇంక్లూజన్' అనే పుస్తకం రాసిన డేవిడ్ మొయినినా గురించి).

– బిల్ గేట్స్, బిజినెస్ మేగ్నెట్

హింస జ్వాలలు



మణిపూర్‌లో చెలరేగిన హింస ఎవరినీ వదిలిపెట్టలేదు. సి.ఆర్.పి.ఎఫ్. జవాను చనిపోయారు. అధికార బీజేపీ ఎమ్మెల్యేకి గాయాలయ్యాయి. రాష్ట్ర డీజీపీపై దాడి జరిగింది. ఒక దిగువ స్థాయి ప్రభుత్వ అధికారి కనిపించకుండా పోయారు. ఆ అధికారి కుమారుడు చనిపోయాడు.

– సుప్రియా శర్మ, జర్నలిస్ట్

అవిధేయ ఉద్యోగులు



భారతీయ ఉద్యోగులలో నేను సాంస్కృతిక మార్పును గమనించాను. గతంలో తమను ఉద్యోగాల్లోకి తీసుకున్నందుకు యజమానుల పట్ల కృతజ్ఞతా భావం ఉండేది. ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో కంపెనీలు తమకు విధేయంగా లేవని ఉద్యోగులు నమ్ముతున్నారు. అందుకే వారు కూడా తమ యజమానులకు విధేయతను చూపడం మానేశారు.

– జాహ్నవి, బ్లాగర్

అతనిలో సగం!



నా స్నేహితురాలికి ఈ రాత్రి డేట్ ఉంది. హైహీల్స్, సిల్క్ డ్రెస్, పొడవాటి కోటు, దానికి సరిపోయే చిన్న బ్యాగ్ ధరించి సిద్ధమయ్యాక... "బిల్లు సగం ... సగం అనుకున్నాం కనుక వాలెట్ తీసుకురావడం మర్చిపోవద్దు" అని ఆమె బాయ్‌ఫ్రెండ్ 'రిమైండర్' మెసేజ్ పంపాడు. వెంటనే ఆమె స్నీకర్స్, జీన్స్, స్వెట్టర్‌లోకి మారిపోయింది. నేనింకా నవ్వుతూనే ఉన్నాను.

– జిన్‌హీ, ట్రావెలర్

వలపుల వల



గూఢచర్యం ఆరోపణలపై పుణెకు చెందిన డి.ఆర్.డి.ఓ. శాస్త్రవేత్త కరుల్కర్‌ను మహారాష్ట్ర ఏటీఎస్ అరెస్టు చేసింది. ఈ 'హనీ ట్రాప్డ్' సీనియర్ సైంటిస్ట్ పాక్‌లోని ఐ.ఎస్.ఐ.కి దేశ రహస్యాలను అందించారని కేసు నమోదు అయింది. మన అధికారులను హనీ ట్రాప్ చేయడం అంత తేలికా!

– అన్షుల్ సక్సేనా, పొలిటికల్ యాక్టివిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ముందుంది ముసళ్ళ పండగ

సంవత్సరం క్రితం ఎండలు మండిపోయిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్, మే మాసాలలో కూడా వర్షాలు కురిసి ఎండలను గురించి అందరూ మరిచిపోయే పరిస్థితి వచ్చింది. కానీ మునుముందు మనకోసం ముసళ్ళ పండుగ వేచి చూస్తున్నది అన్న సంగతి గుర్తు ఉంచుకోవాలి. ఎండల కారణంగా దేశంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. చాలా ప్రాంతాలలో పంటలు దిగుబడి మూడవ వంతు పడిపోయింది. ఢిల్లీలో ఒకచోట ల్యాండ్ ఫిల్ (పెంట కుప్ప) తగలబడి పొగలు కమ్ముకున్నాయి. చుట్టుపక్కల వారంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉష్ణోగ్రతలు 115 డిగ్రీల ఫారెన్ హీట్ చేరుకున్నాయి. కనీసం 300 చోట్ల అడవులు తగలబడ్డాయి.

ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ వారు వాతావరణపరంగా వచ్చే ప్రమాదాలను గురించి అంచనా వేశారు. కానీ అంతర్జాతీయ పరిశోధనలు మాత్రం వారి అంచనాలు సరిగా లేవు అంటున్నాయి. అభివృద్ధి గురించి నిర్దేశించిన గమ్యాలను చేరలేకపోవడానికి ఈ అంచనాలలో తేడాయే కారణమవుతుందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

ఇటీవల మహారాష్ట్రలో ఎర్రటి ఎండలో ఆరుబయట జరిగిన ఒక కార్యక్రమం కారణంగా పదముగ్గురి ప్రాణాలు పోయాయి. మరికొందరు అనారోగ్యానికి గురయ్యారు. ఇది పెరగనున్న ఎండల ప్రమాదానికి ఒక హెచ్చరికగా పరిగణించాలి. ఎండల తీవ్రత వల్ల గుండె ఆగి మరణించే ప్రమాదమూ ఉందనేది గమనార్హం. గడచిన 30 ఏళ్లలో భారతదేశంలో వడదెబ్బ కారణంగా 24 వేల మంది చనిపోయారని లెక్క తేలింది. పక్క దేశాలలో కూడా పరిస్థితి ఇదే రకంగా ఉంది. వాతావరణం వేడెక్కుతున్న కారణంగా ప్రతి మూడు సంవత్సరాలకు వేడి గుర్తించదగినంతగా పెరుగుతోంది అంటున్నారు పరిశోధకులు. ఒక కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ పరిశోధన నివేదిక 2050 సంవత్సరం నాటికి నీడలో ఉన్నవారికి కూడా భరించరానంత వేడి మొదలవుతుందని పేర్కొంది. వాతావరణంలో వేడి పెరగకుండా స్థిరంగా ఉన్నట్లయితే మరో మూడు వందల ఏళ్ల వరకు ఈ పరిస్థితి రాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ, ప్రపంచ దేశాలు విచక్షణారహితంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ఉండటంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

ప్రభుత్వపరంగా జరుగుతున్న ప్రణాళికలలో మాత్రం ఈ విషయం గురించి అంతగా పట్టించుకోవడం లేదని కూడా నివేదికలో రాశారు. గుజరాత్‌లోని 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్' అధికారి దిలీప్ మవలంకర్ కూడా ప్రభుత్వం దీన్ని పట్టించుకుంటున్నట్టు లేదని పేర్కొన్నారు. కాబట్టి ప్రభుత్వం అభివృద్ధి కార్యకలాపాలపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

– కె.బి. గోపాలం; అనువాదకుడు, రచయిత ı 98490 62055

పాలు... పాములపాలు!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

ఇయ్యాల ఆనగొట్టింది. రేపు ఎండగొట్టొచ్చు. ఎల్లుండి సలి బెట్టొచ్చు. దినాలెప్పుడు ఒక్క తీర్గ ఉండయి. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు ఎప్పటి లెక్కనే మోటర్ల బొందల గడ్డ బోయిండు. బేతాలుని రొండంత్రాల బంగ్ల ముంగట హారన్ గొట్టిండు. బేతాలుడు ఇవుతల కొచ్చి ఎన్క సీట్ల ఎక్కి గూసుండు. ''ఆనగొడ్తున్నా, సలి బెడ్తున్నా, ఎత్తుగడ్డలు గుంతలని సూడకుంట మోటర్ నడ్పుతవు. నీకు యాస్ట రాకుంట ఉండెతందుకు ముచ్చట్లు జెప్త ఇను. దళితబందు ఎమ్మెల్యేల బందు అయ్యిందని గీ నడ్మ కుద్దు ముఖ్యమంత్రే అన్నడు. దళిత బందు కింద పది లచ్చల రూపాయల శాంక్షన్ అయినోల్ల కాడ కొంతమంది ఎమ్మెల్యేలు మూడు లచ్చల రూపాయల కమీషన్ దీసుకుంద్రని ముఖ్య మంత్రి అన్నడు.''

''గా ఎమ్మెల్యేల మీద యాక్షన్ ఏమన్న దీస్కున్నడా?''

''తీస్కోలేదు. ఎన్నో లచ్చలు కర్సు బెట్టుకొని ఎమ్మెల్యేలమైనం. మా పైసలు మాకు రావొద్దా? అని గా ఎమ్మెల్యేలు అడిగింద్రు.''

''గీ నడ్మ కేసీఆర్ కొత్త సెక్రెటేరియట్లకు బోయిండట గదా.''

''వాస్తు బాగలేదని నాలుగైదు యాడాదులు సెక్రెటేరియట్లకు బోకుంట ముఖ్యమంత్రి రికార్డ్ బిటాయించిండు. పాతది కూలగొట్టిపిచ్చిండు. పన్నెండు నూర్ల కోట్లతోని కొత్తది గట్టిపిచ్చిండు. యాగాలు జేపిచ్చిండు. మంచి మూర్తంల బోయిండు. గిప్పుడన్న దినాం గాయిన సెక్రెటేరియట్‌కు బోతడా? మల్ల ఎవడన్న వాస్తు బాగలేదంటే ఫాంహౌస్లనే పంటడా?''

''మొన్న పడ్డ వానకు సెక్రెటేరియట్ లీకైందట గదా?''

''అవ్. సెక్రెటేరియటేంది యాద్గిరి గుట్ట గుడి గూడ ఉరిసింది.''

''పేరు గొప్ప. జెనంకు చిప్ప అంటె గిదేనేమో. గందుకేనే విలేకర్లను సెక్రెటేరియట్లకు రానియ్యలేదు.''

''విలేకర్లనే గాకుంట రేవంత్ రెడ్డిని గూడ బోనియ్యలేదు.''

''మొన్న పవన్ కల్యాణ్, చెంద్రబాబు నాయున్ని కలిసిండట గదా.''

''అవ్ గంటసేపు గాల్లు ముచ్చట బెట్టింద్రు. సైకిల్ల గాలి బోయింది. ఏం జేస్తె బాగుంటదని చెంద్రబాబు అడిగితె మీరేం ఫికర్ జెయ్యకుంద్రి. గాలి గొట్టితందుక్కు సైకిల్ పంపులు తెచ్చిన. ఒగాల్ల పంపుచరైతె జుడాయిస్త. మీరు సైకిలెన్క గూసోంద్రి. నేను తొక్కుత. నాకు లెక్కున్నది. తిక్కున్నది. నాగ్గిన తిక్కలేస్తె మీ సైకిల్‌ను జుమ్మెరాత్ బజార్ల అమ్మేస్త. తామర పువ్వును చెవుల బెట్టుకుంట అని పవన్ కల్యాణ్ అని ఉంటడు.''

''పవన్ గట్లంటె చెంద్రబాబు ఏమని ఉంటడు?''

''గంత పని జెయ్యకు. మన సర్కారొస్తది. మూడేండ్లు ముఖ్యమంత్రి కుర్సీమీద నేను గూసుంట, కడ్మ రొండేండ్లు నువ్వే ముఖ్యమంత్రివి అని ఉంటడు.''

''అంటడు గని అటెంకల వెన్ను పోటు పొడుస్తడు... మేడే నాడు తెలంగాన కార్మిక శాక మంత్రి మల్లారెడ్డి రవీంద్ర బారతిల డప్పు గొట్టుకుంట ఏం సాటిచ్చిండు?''

''ఇందు మూలంగ సమస్త జెనులకు ఎర్కజేసేది ఏందంటె నేను బర్లు గాసిన. పాలు పిండిన. పిండిన పాలను క్యాన్లల్ల బోసిన. గా క్యాన్లను సైకిల్‌కు గట్టుకొన్న. సైకిల్ మీద తిరుక్కుంట అమ్మిన. ఆంద్రప్రదేస్ల కులాలున్నయి. కుల రాజకీయాలున్నయి. తెలంగానల కులాలు లేవు. ఉన్నది ఒక్కటే కులం. గదే బీఆర్ఎస్ కులం. బీఆర్ఎస్ అంటె బిరండి, రమ్ము, సార అని కొందరు అంటున్నరు. గాల్ల మాటలను నమ్మకుంద్రి. నేనైతె పాలు దప్పిడ్సి ఏం తాగ. కేసీఆర్ సిన్మ యాక్టర్ గాడు. గాయిన సిన్మ యాక్టర్ గాకున్నా గాయిన మీటింగ్‌కు మహారాష్ట్రల లచ్చలమంది వొచ్చింద్రు అని మల్లారెడ్డి అన్నడు. కర్నాటకల మా సర్కారొస్తె యాడాదికి మూడు గ్యాస్ సిలిండర్లే గాకుంట దినాం అర్ద లీటర్ పాలు ఇస్తమని బీజేపీ జెప్పింది. సిలిండర్లు ఇచ్చుడు బాగున్నది గని దినాం అర్ద లీటర్ పాలు ఎందుకు బోస్త నన్నది. గీ సవాల్‌కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ మోటర్ గుంతల బడ్తది'' అని బేతాలుడు అన్నడు.



''మోదీ పాముసుంటోడని ఎఐసిసి ప్రెసిడెంట్ ఖర్గే అన్నడు. గాయిన గట్లంటె జెనం దేవుల్ల మెడల పాముసుంటోన్ని నేను అని మోదీ అన్నడు. ఇగ దాంతోని మేము గూడ పాములసుంటోల్లమని బిజెపి లీడర్లు అన్నరు. గా పాములకు బోసెతందుకే దినాం అర్ద లీటర్ పాలిస్తమని బిజెపి అన్నది'' అని విక్రమార్కుడు జెప్పంగనే మోటర్ దిగి బేతాలుడు బొందలగడ్డ దిక్కు బోయిండు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ ı 99591 50491

ప్రకృతి సీత

రామాయణాన్ని 'రమా'యణమనీ అంటారు. అంటే 'రమ' కథ. సీత కథ. సీత ఆదర్శమూర్తి. రామాయణంలో రావణ వధ కోసమే సీత పుట్టిందనే కథనాలున్నాయి. సీత శక్తిత్రయ ప్రతీక అని వాల్మీకి ఉవాచ. కేవలం భావన ద్వారానే సాధించగల శక్తి సీత తత్వంలో ఉంది. రాముడు చంపలేని శతకంఠ రావణుని సీతే సంహరించిందని 'శతకంఠ రామాయణం' చెబుతుందన్నారు ఆరుద్ర. ప్రకృతి ఎప్పుడూ పురుషుని కన్నా గొప్పది. అందుకే శాక్తేయులు సీతను రాముడి కన్నా మిన్నను చేశారు. లక్ష్మణుడు ఒంటరిగా సీతను వదలిన క్షణం నుంచి కుశలవులను రామునికి అప్పగించటం వరకు సీతలోని స్థితప్రజ్ఞత ప్రదర్శితమవుతుంది.

ఓ సారి దేవతలంతా ప్రజాపతి దగ్గరకు వెళ్లి 'కా సీతా? కిం రూపమితి' అని ప్రశ్నించారు. అందుకాయన 'మూల ప్రకృతి రూపం కలిగి ఉండే పురుషునికి వ్యతిరేకమైన ప్రకృతియే సీత' అని సమాధానమిచ్చారుట. వాల్మీకి ఈ అంశ వివరణలో చాలా లోతైన అర్థాలను చెప్పారు. సీతకు మూడు రూపాలున్నాయి. ఆమె శబ్ద బ్రహ్మ స్వరూపం, జ్ఞాన బ్రహ్మ స్వరూపం, అవ్యక్త స్వరూపం. సీత వ్యక్తిత్వం గొప్పదనటానికి రామాయణంలో ఎన్నైనా సన్నివేశాలను ఉదాహరించవచ్చు. ఆశ్రమంలో సీతను చూసిన మొదటి ప్రయత్నంలో అనసూయ ప్రసన్నురాలై 'నా తపస్సునంతా నీకిచ్చేస్తానని' అంటే 'వద్దు నేనే తపస్సు చేసి సాధిస్తానంటుంది' సీత. తనకు రామునికి జరిగిన స్వయంవర ఘట్టాలను అనసూయకు 'చూపిస్తుంది'. విల్లు విరిగిన వేళ 'నేనిప్పుడు వివాహం చేసుకోలేనని' రాముడంటే మనసులో సన్నగా నవ్వుకుంటుంది. పురుషుని హృదయాన్ని, సహృదయతను గ్రహించిన ఇల్లాలామె.



సీతకెన్నో పేర్లున్నాయి. అవన్నీ ప్రకృతికి దగ్గరగా ఉన్నవే! 'సీతాసస్యే'– పండిన పంటను సీత అంటారు. 'సీతానభా'– ఆకాశానికీ సీత అనే పేరుంది. 'సీతానద్యాం'– నదికి మరో పేరు సీత. 'సీత' అనే మూలాక్షరాల వెనుక జీవునికి అమృతత్వాన్ని అందించే లక్షణాలు కలిగిన అర్థాలున్నాయి. 'సీత'కు 'క్షమ' కూడా ఎక్కువే. మరి భూదేవి తనయ కదా! మొత్తంగా సీతాపాత్రలోని బాహ్య, అంతర్గత గుణాలను, సుగుణాలను గమనించి విశ్లేషిస్తే వర్తమాన మహిళలంతా 'సీత' లక్షణాలు కలిగినవారేననిపిస్తుంది. వారిని గౌరవించుకోవాలి.

– భమిడిపాటి గౌరీశంకర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.తదియ రా.7.24 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.8.22 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.4.01 నుండి 5.33 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.20 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.52 నుండి 1.23 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.17.

ఆస్తిస్తేనే అమ్మ శవాన్ని తీసుకెళ్తాం

- అనారోగ్యంతో జిల్లా ఆస్పత్రిలో తల్లి మృతి
- ఆస్తివ్వలేదని శవాన్ని పట్టుకెళ్లని కూతుళ్లు

కామారెడ్డి టౌన్: 'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు'.. అన్న కవి అందెశ్రీ వేదనకు అద్దం పట్టే అమానవీయ సంఘటన ఇది. తల్లి బ్యాంకు ఖాతాలోని డబ్బుల కోసం వాదులాడుకుంటున్న కూతుళ్లు.. ఆస్పత్రిలో ఆమె కన్ను మూస్తే మృతదేహాన్ని తీసుకెళ్లకుండా వదిలేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన కిష్టవ్వ (70) అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు గత నెల 21న కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న కిష్టవ్వ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలు కిష్టవ్వకు ముగ్గురు కూతుళ్లు ఉండగా, ఒక కూతురు గతంలోనే మరణించింది. భర్త గతంలోనే మృతి చెందాడు. ఉన్న ఇద్దరు కూతుళ్లు ఎల్లవ్వ, పెంటవ్వ తల్లి బాగోగులు చూసుకున్నారు. తల్లి అనారోగ్యంతో ఆస్పత్రి పాలవడంతో ఆర్‌బీనగర్‌లో ఉన్న ఇల్లు, కిష్టవ్వ పేరున బ్యాంక్‌లో ఉన్న రూ.లక్షా 70 వేల కోసం ఇద్దరు కూతుళ్లు గొడవ పడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో డబ్బులు ఇవ్వాలని తల్లిపై కూడా చేయి చేసుకున్నట్లు తెలిసింది. మృతురాలికి వారసునిగా ఆమె బంధువుల్లో ఒకరు ఉన్నారు. ఇదే అక్కసుతో మొదటి నుంచి తల్లిని డబ్బుల కోసం ఇబ్బంది పెడుతున్నారు. ఇదే క్రమంలో ఆస్పత్రిలో ఉన్న తల్లిని రెండు రోజుల క్రితం ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయారు. శనివారం తల్లి మృతి చెందినట్టు ఆస్పత్రి వర్గాలు సమాచారం ఇచ్చినా కూతుళ్లు స్పందించలేదు. వృద్ధురాలి పేరున బ్యాంక్‌లో ఉన్న డబ్బు, ఇల్లు తమకు పంచి ఇచ్చే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లబోమని ఇద్దరూ తెగేసి చెప్పారు. దీంతో ఆస్పత్రి అధికారులు, పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.


జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీలో కిష్టవ్వ మృతదేహం. (ఇన్‌సెట్‌లో) కిష్టవ్వ(ఫైల్)

కన్న బిడ్డలకు భారం కాలేక...

- వృద్ధ దంపతుల బలవన్మరణం
- పురుగుల మందు తాగి భర్త.. ఉరేసుకుని భార్య అఘాయిత్యం
- నల్లగొండ జిల్లాలో విషాదం

శాలిగౌరారం: అసలే వృద్ధాప్యం.. ఆపై అనారోగ్యం. దీంతో కన్నబిడ్డలకు భారం కాలేక వృద్ధ దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల పరిధిలో శనివారం జరిగిన ఈ విషాదకర ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. అడ్లూరు గ్రామానికి చెందిన చిలుకూరి నర్సయ్య(85), లక్ష్మమ్మ (74) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరు కల్లుగీత వృత్తి, వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించారు. పిల్లలకు పెళ్లిళ్లు చేశారు. కొడుకు యాదయ్య జీవనోపాధి, పిల్లల చదువుల కోసం పదేళ్ల క్రితమే హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. కారు ట్యాక్సీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

భర్తకు పక్షవాతం.. భార్యకు క్యాన్సర్..

అడ్లూరులో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నర్సయ్య–లక్ష్మమ్మ దంపతులను ఐదేళ్లనుంచి అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మొదటగా నర్సయ్యకు పక్షవాతం వచ్చింది. ఇంతలోనే లక్ష్మమ్మకు క్యాన్సర్ సోకింది. తల్లిదండ్రులను కాపాడుకునేందుకు కొడుకు, కూతుళ్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రుల వైద్యం కోసం సుమారు రూ. 15 లక్షలు ఖర్చు చేశారు. దీంతో పిల్లల వద్ద ఉండలేక ఆ దంపతులు అడ్లూరులోనే ఉంటున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న కొడుకు యాదయ్య వారంలో రెండు, మూడు రోజులు తల్లిదండ్రులకు సపర్యలు చేసి వెళ్తున్నాడు.

కలిసే చనిపోదామని..

ఓ పక్క కుమారుడి ఆర్థిక ఇబ్బందులు, మరో పక్క క్షీణిస్తున్న ఆరోగ్యంతో వృద్ధ దంపతులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. నర్సయ్య శనివారం రాత్రి మద్యంలో పురుగులమందు కలుపుకొని తాగగా, లక్ష్మమ్మ ఆ వెంటనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం వారి అలికిడి లేకపోవడంతో సమీప బంధువు భూపతి శ్రీకాంత్ వెళ్లి పరిశీలించాడు. అప్పటికే వారు విగతజీవులయ్యారు. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబీకులు, బంధువులు. (ఇన్‌సెట్‌లో) దంపతులు చిలుకూరి నర్సయ్య-లక్ష్మమ్మ (ఫైల్)

క్లుప్తంగా...

ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన


ధాన్యానికి నిప్పు పెడుతున్న రైతులు

రాజాపేట: కొనుగోలు చేసిన ధాన్యాన్ని తేమ పేరుతో రైస్ మిల్లర్ వెనక్కి పంపించడంతో ఆగ్రహించిన రైతులు ధాన్యానికి నిప్పుపెట్టి నిరసన తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పారుపల్లిలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన రైతులు మోత్కుపల్లి కుమార్, గుజ్జుల జయమ్మల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం కొనుగోలు చేసింది. కాగా ధాన్యాన్ని లారీలో రైస్ మిల్లర్‌కు పంపించగా.. తేమ పేరుతో తిరస్కరించి వెనక్కి పంపించాడు. దీంతో ఆగ్రహించిన రైతులు ధాన్యానికి నిప్పు పెట్టి.. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక ప్రభుత్వం



భూపాలపల్లి అర్బన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మే డే ముగింపు వారోత్సవాల సభలో ఆయన మాట్లాడారు. ఎల్ఐసీ, సింగరేణి రైల్వే తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు.

పిచ్చి కుక్క దాడి.. 30 మందికి గాయాలు

జోగిపేట(ఆందోల్): పిచ్చి కుక్క దాడిలో 30 మంది గాయపడిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో జరిగింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కుక్కకాటుకు గురైన బాధితులంతా ఏరియా ఆస్పత్రికి క్యూ కట్టారు. నల్లగా ఉన్న ఓ కుక్క దాడి చేసి గాయపరిచినట్టుగా బాధితులు చెబుతున్నారు. జోగిపేటలోని ఎస్సీ కాలనీ, మార్కెట్, గౌని, ముదిరాజ్ సంఘం, హనుమాన్ థియేటర్, పోచమ్మ దేవాలయం ఏరియాల్లో సంచరిస్తూ ఎదురువచ్చిన వారందరిపై దాడి చేసింది. ఆస్పత్రికి వచ్చిన వారందరికీ ప్రథమ చికిత్స చేసి డాగ్‌బైట్ వ్యాక్సిన్ ఇస్తున్నారు. కుక్క దాడి చేసి గాయపరిచిన 30 మందికి వ్యాక్సిన్ ఇచ్చినట్టు డాక్టర్లు వరలక్ష్మి, తుల్జాభవానీలు తెలిపారు. అయితే.. జోగిపేటలోని ఒక్క 14వ వార్డులోనే సుమారు 18 మంది వరకు కుక్కకాటుకు గురయ్యారు. బయట తిరగాలంటేనే భయమవుతోందని, మున్సిపల్ అధికారులు కొన్ని కుక్కలను మాత్రమే పట్టుకుని తరలించారని కౌన్సిలర్ దుర్గేష్ తెలిపారు.

అనారోగ్యంతో మావోయిస్టు నేత మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టు పార్టీ బీఎస్‌పీసీ సభ్యుడు బసంత్ అలియాస్ సోమ్లు, అలియాస్ రవి అనారోగ్యంతో మావోయిస్టుల వైద్య శిబిరంలో మృతి చెందినట్లు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్పోలి గ్రామానికి చెందిన బసంత్ 26 ఏళ్ల క్రితం మావోయిస్టు పార్టీలో చేరారు. తాడిమెట్ల, ఉర్పల్‌మెట్ట, టోంగ్‌గూడ, బట్టిగూడ తదితర ప్రాంతాల్లో జరిగిన విధ్వంసకర ఘటనలలో ఆయన పాల్గొన్నట్టు లేఖలో పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ఆయుధ కర్మాగారానికి బసంత్ నేతృత్వం వహించారని, వందలాది ఆయుధాలు, పేలుడు సామగ్రి తయారు చేయడం ద్వారా పీఎల్‌జీఏను బలోపేతం చేశాడని వివరించారు. ఈ క్రమంలో బసంత్ అనారోగ్యంతో ఈనెల 3న తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలోనే ప్రాణాలు విడిచారని పేర్కొన్నారు.

ఏమార్చేందుకే విగ్రహాలు

మొదటి పేజీ తరువాయి

కాపీకొట్టి ఎన్నికల హామీగా ఇచ్చారని మాయావతి చెప్పారు. కానీ కేసీఆర్ దళితులకు భూమి పంపిణీ చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఎస్పీ బలోపేతం అవడంతో కేసీఆర్‌కు భయం పట్టుకుందన్నారు.

కేసీఆర్ పాలనలో అన్నివర్గాలకు ఇబ్బంది

కేసీఆర్ సర్కార్ తీరుతో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, ముస్లిం తదితర అణగారిన వర్గాలన్నీ ఇబ్బంది పడుతున్నాయని మాయావతి ఆరోపించారు. బిహార్‌లో తెలంగాణకు చెందిన దళిత ఐపీఎస్‌ను చంపిన హంతకుడిని అక్కడి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేస్తే.. సీఎం కేసీఆర్ కనీసం ప్రశ్నించలేదేమని నిలదీశారు. అంబేడ్కర్, కాన్షీరాం స్ఫూర్తితో బీఎస్పీ అణగారిన వర్గాలకు అండగా నిలిచిందని.. భవిష్యత్తులో తెలంగాణలో అధికారంలోకి వస్తే యూపీలో అమలుచేసిన సంక్షేమ పథకాలను ఇక్కడా అమలు చేస్తామని మాయావతి ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోని పేదలు, రైతులు, కూలీలు, నిరుద్యోగులు, మైనారిటీవర్గాలతో పాటు ఉన్నత వర్గాల్లోని పేదలకు కూడా బీఎస్పీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్తున్నాయని.. కానీ నిరుద్యోగులకు ఇవ్వాల్సింది భృతి కాదని, ఉద్యోగాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

ఇక్కడ అధికారంలోకి వస్తే ప్రవీణ్‌కుమారే సీఎం

తెలంగాణలో బీఎస్పీ అధికారంలోకి వస్తే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమారే ముఖ్యమంత్రి అని మాయావతి ప్రకటించారు. ఆయన ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి, పేదలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చారని.. అలాంటి వ్యక్తి సీఎం అయితే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం, లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన బీఎస్పీని బలోపేతం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీఎస్పీ పాత్ర కీలకమని, పార్లమెంటులో తెలంగాణ బిల్లుకు తాము సంపూర్ణ మద్దతు తెలిపామని మాయావతి గుర్తు చేశారు.


'తెలంగాణ భరోసా సభ'కు హాజరైన ప్రజలు


మాయావతికి పాదాభివందనం చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుంటోంది : ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుంట్ల కుటుంబం తెలంగాణను దోచుకుంటోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ప్రగతిభవన్ మీద నీలి జెండా ఎగరవేయడం ఖాయమని, తెలంగాణను దోపిడీ దొరల నుంచి విముక్తి చేయడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఏనాడూ అంబేడ్కర్ ఫొటోకు, విగ్రహానికి దండ వేయని కేసీఆర్.. బీఎస్పీకి భయపడే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టారని పేర్కొన్నారు. తాను బీఎస్పీలో చేరిన తర్వాతే దళిత బంధు పథకాన్ని తెచ్చారన్నారు. 'దళితబంధు'లో ఎమ్మెల్యేలు మూడు లక్షల రూపాయల చొప్పున కమీషన్లు తీసుకుంటున్నట్టు స్వయంగా చెప్పిన కేసీఆర్.. దమ్ముంటే ఆ ఎమ్మెల్యేల పేర్లను ఏసీబీకి ఇవ్వాలని సవాల్ చేశారు. రైతులు పంట నష్టపోయి కష్టాలు పడుతుంటే.. కేసీఆర్ ప్రగతిభవన్‌లో మహారాష్ట్ర వాళ్లను పార్టీలో చేర్చుకునే పనిలో ఉన్నారని, తెలంగాణ ప్రజాధనాన్ని మహారాష్ట్ర వ్యక్తులకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీతో ఒక్కో ఉద్యోగాన్ని రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతం తీసుకునే కేసీఆర్.. ఉద్యోగులకు మాత్రం 10వ తేదీన జీతాలు ఇస్తున్నాడని ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. పేద ఆర్టిజన్ కార్మికుల మీద ఎస్మా కింద కేసులు పెట్టారని, నెలకు 4 లక్షలకు పైగా జీతం తీసుకుంటున్న కేసీఆర్‌పై ఎస్మా ప్రయోగించాలని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం నాడు తాము గజ్జె కట్టామని.. ఇప్పుడు అన్యాయం జరిగితే గల్లా పడతామని హెచ్చరించారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే 10 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని.. భూమి లేని వారికి ఎకరం భూమి ఇస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో బీఎస్పీ తెలంగాణ కోఆర్డినేటర్ రాంజీ గౌతమ్, ఏపీ అధ్యక్షుడు పరంజ్యోతి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్ చౌహాన్, అరుణ, సంజయ్ కుమార్, దాసరి ఉష తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న పుప్పాలగూడ 'రోడ్డు వార్'

- ఆదివారం రాత్రి పనులు ప్రారంభించిన హెచ్ఆర్‌డీసీఎల్
- అడ్డుకున్న ఇండియన్ సర్వీసెస్ విశ్రాంత అధికారులు
- కోర్టు ఆదేశాలు పాటించాలంటున్న న్యాయవాదులు

మణికొండ: ప్రజావసరాల నిమిత్తం రోడ్డు వేయాలని హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్ఆర్‌డీసీఎల్) పనులు చేపట్టింది. తమ హౌసింగ్ సొసైటీ స్థలంలోనుంచి సదరు పనులను అనుమతించేది లేదని ఇండియన్ సర్వీసెస్ విశ్రాంత అధికారులు అడ్డుకుంటున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య రోడ్డు వార్ కొనసాగుతోంది. హైదరాబాద్ నగర శివారు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ రెవెన్యూలో సర్వే నెంబర్ 454లో 2007 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల 'ఆదర్శ్‌నగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ'కి 57 ఎకరాలను కేటాయించింది. హౌసింగ్ సొసైటీలకు భూమి కేటాయింపు కేసు ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉంది. కాగా, మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభా అవసరాల నిమిత్తం ల్యాంకోహిల్స్ సర్కిల్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు 2.35 కిలోమీటర్ల వంద అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాలని రెండేళ్లకిందట రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా టెండర్లు పిలిచింది. కొంత మేర పనులు పూర్తి చేశారు. మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు శనివారం పునఃప్రారంభించారు. దీంతో.. తమ స్థలంలో పనులు చేపట్టనివ్వబోమని ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ భీష్మించింది. అయినా పనులను కొనసాగించారు.


పనులను అడ్డుకుంటున్న విశ్రాంత అధికారులు

ఆదివారం రాత్రి తిరిగి పనులు...

మరునాడు ఆదివారం సొసైటీవాసులు పనులను అడ్డుకుంటారని భావించి రోజంతా పనులను చేయలేదు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో హెచ్ఆర్‌డీసీఎల్ సీఈ సరోజ ఆధ్వర్యంలో అధికారుల బృందం అక్కడకు చేరుకుని పనులు ప్రారంభించారు. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన ఇండియన్ సర్వీసెస్ విశ్రాంత అధికారులు తమ న్యాయవాదులు, సిబ్బందితో పాటు అక్కడే ఉండి పనులను అడ్డుకున్నారు. తమ స్థలంలోకి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తమకు హైకోర్టు నుంచి స్టే ఉందని, శనివారం కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను సైతం వేశామని అధికారులతో వాదనలకు దిగారు. తమ పిటిషన్‌కు కోర్టులో సమాధానం చెప్పకుండా అడ్డగోలుగా పనులు చేపట్టడం ఏమిటని రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు రాంనారాయణ్‌రెడ్డి, రాయుడు, వెంకట్‌రాంరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎన్‌జీ మురళి, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి ఎంజీ అక్బర్‌లు ప్రశ్నించారు. తమ స్థలంలో పనులు చేస్తే అడ్డుకుంటామని అధికారులు, ఎలాగైనా పనులు చేస్తామని హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులు భీష్మించడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అర్ధరాత్రి వరకు సొసైటీ స్థలంలో కాకుండా వేరేచోట పనులను కొనసాగించారు. కోర్టు నుంచి సోమవారం వచ్చే ఆదేశాలకోసం అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ఆర్టీసీకి 'ముహూర్త' బలం



తొలిసారి లాభాల్లో 45 డిపోలు.. 74 శాతానికి చేరుకున్న ఆక్యుపెన్సీ రేషియో


రోజువారీ ఆదాయం రూ.11.50 కోట్ల నుంచి రూ.15.50 కోట్లకు..	ఏప్రిల్ నష్టాల నుంచి గట్టెక్కించిన శుభముహూర్తాలు

శుభ ముహూర్తాలు ఆర్టీసీని లాభాల బాటపట్టించాయి. ఏప్రిల్‌లో రోజువారీ సగటు ఆదాయం రూ.11.50 కోట్లకు పడిపోయి జీతాలిచ్చేందుకు సంస్థ ఇబ్బందిపడ్డ పరిస్థితి మారి.. ప్రస్తుతం రోజువారీ సగటు ఆదాయం రూ.15.50 కోట్లుగా నమోదవుతోంది. దీంతో తెలంగాణ ఆర్టీసీ చరిత్రలో తొలిసారి 45 డిపోలు లాభాల్లోకి చేరాయి. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 74 శాతంగా నమోదవుతోంది. శుభముహూర్తాలు కొనసాగినన్ని రోజులు పరిస్థితి మెరుగ్గా ఉండనుంది. అలాగే, రానున్న వానాకాలంలోనూ ఓఆర్ పడిపోకుండా చూడాలని ఆర్టీసీ భావిస్తోంది.

\- సాక్షి, హైదరాబాద్

రికార్డు స్థాయి లాభాలతో..

తెలంగాణ ఆర్టీసీ ఏర్పడిన స్వల్ప కాలానికే ఏకంగా 44 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరిగింది. దీంతో ఆర్టీసీపై సాలీనా రూ.850 కోట్ల భారం పడింది. అనంతరం పర్యవేక్షణ లోపించడంతో ఆర్టీసీ పనితీరు దిగజారింది. ఫలితంగా ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన నష్టాల కంటే తెలంగాణ ఆర్టీసీ నష్టాలు పెరిగిపోయాయి. డిపోలన్నీ నష్టాల్లో కూరుకుపోయాయి. ఇన్నాళ్లకు తొలిసారి 96 డిపోలకు 45 డిపోలు లాభాల్లోకి వచ్చాయి. ఏప్రిల్‌లో శుభకార్యాలు లేకపోవడంతో ఓఆర్ 58 శాతానికి పడిపోయి, రోజు వారీ ఆదాయం సగటున రూ.11.50 కోట్లకు పరిమితమైంది. మేలో ముహూర్తాల కాలం ప్రారంభం కావటంతో ఒకటో తేదీ నుంచి ఆర్టీసీ పుంజుకుంది. ఆదాయం రూ.16 కోట్లను మించి నమోదుకాగా, సగటున వారం రోజులుగా రూ.15.50 కోట్ల మేర వస్తోంది.



లాభాల్లో ఉన్న డిపోలు ఇవే..

షాద్‌నగర్, తొర్రూరు, ఆదిలాబాద్, అచ్చంపేట, తాండూరు, జనగామ, వేములవాడ, బీహెచ్ఈఎల్, మహేశ్వరం, మెట్‌పల్లి, మధిర, నాగర్‌కర్నూలు, కొల్లాపూర్, కల్వకుర్తి, నార్కెట్‌పల్లి, సూర్యాపేట, జహీరాబాద్, ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, పరిగి, నారాయణపేట, సిరిసిల్ల, కొత్తగూడెం, జగిత్యాల, మణుగూరు, గద్వాల, కరీంనగర్–1, భద్రాచలం, నల్లగొండ, సత్తుపల్లి, కోదాడ, దేవరకొండ, వరంగల్–1, పికెట్, యాదగిరిగుట్ట, హైదరాబాద్–2, మిర్యాలగూడ, మహబూబ్‌నగర్, ఖమ్మం, వనపర్తి, హైదరాబాద్–1, మియాపూర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, నారాయణ్‌ఖేడ్.

అవసరమైతేనే పై ఆస్పత్రులకు రిఫర్ చేయాలి

- జిల్లా ప్రజల ఆరోగ్య సంరక్షణ పూర్తిగా డీఎంహెచ్‌వోలదే
- ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లను పరిశీలించాలి: హరీశ్

సాక్షి, హైదరాబాద్: జిల్లా పరిధిలో వైద్య కళాశాలలు అందుబాటులోకి వచ్చినందున అక్కడే వైద్యం అందించాలని, అవసరమైతేనే ఉస్మానియా, నిమ్స్, గాంధీకి రిఫర్ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలపై హరీశ్‌రావు ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేత మహంతి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, డీహెచ్ శ్రీనివాసరావు, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 24 గంటల్లోగా తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా పరీక్ష ఫలితాలు అందించి, చికిత్స అందేలా చూడాలన్నారు. వైద్యాధికారులు ప్రతి మంగళవారం క్లినిక్స్ సందర్శించాలని చెప్పారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ప్రారంభించిన టెలి మానస్ –14416 టోల్ ఫ్రీ నంబర్ గురించి ప్రచారం చేయాలన్నారు. అన్ని ఆరోగ్య సూచీల్లో రాష్ట్రాన్ని మొదటి స్థానానికి చేర్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజల ఆరోగ్య సంరక్షణ విషయంలో డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలదే కీలక పాత్రని, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ డెలివరీలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రూ. 260 కోట్ల వక్ఫ్ భూమికి ఎసరు!

మొదటి పేజీ తరువాయి

దర్గా సయ్యద్ శారాజ్ ఖత్తాల్ హుస్సేనీ ఖిబ్లా పేరు కొనసాగుతూ వస్తోంది. కాగా 2010లో రోడ్డు కోసం సేకరించిన భూమికి గాను ప్రభుత్వం చెట్యార్కి కుటుంబాలకు పరిహారం అవార్డు ప్రకటించింది. అయితే కోర్టు వివాదం కారణంగా తుది తీర్పును బట్టి పరిహారం చెల్లింపు వర్తించే విధంగా నిబంధన చేర్చింది.

సందట్లో సడేమియా..

హైకోర్టులో వివాదం కొనసాగుతుండగానే ఒక రియల్ ఎస్టేట్ సంస్థ రంగ ప్రవేశం చేసింది. గ్రామంలో లేని ఇద్దరు రైతుల పేరిట సుమారు 52.25 ఎకరాలకు సంబంధించి పాత తేదీలతో తప్పుడు పత్రాలు సృష్టించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒక రైతు పేరిట సర్వే నంబర్ 86, 87లోని 24.15 ఎకరాలు, మరొకరి పేరిట సర్వే నంబర్ 88, 89లోని 28.10 ఎకరాలకు సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించారు. అప్పటి తూర్పు డివిజన్ (గోషామహల్) రెవెన్యూ అధికారి జారీ చేసినట్లుగా.. ఓఆర్‌సీ (ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్) ప్రొసీడింగ్, తప్పుడు పట్టాదారు పాస్ బుక్, టైటిల్ నంబర్, ఖాతా నంబర్, వారసత్వం, భూ మార్పిడి పత్రాలు సృష్టించినట్లు తెలుస్తోంది. మరోవైపు మండల రెవెన్యూ శాఖ అధీనంలో ఉండే కచ్చా పహాణీలో రైతుల పేర్లు చేర్చారు. అయితే ధరణికి ముందు ల్యాండ్ రెవెన్యూ రికార్డుల్లో (ఆన్‌లైన్) కానీ, తాజా ధరణి రికార్డులో కానీ ఈ వివరాలు లేకపోవడం ఇవి తప్పుడు పత్రాలేనన్న అనుమానాలకు బలం చేకూర్చుతోంది. పాస్‌బుక్ ఖాతా నంబర్లను పరిశీలిస్తే సర్వే నంబర్ల వాస్తవ పరిస్థితికి భిన్నంగా కనిపిస్తోంది. కాగా సదరు రియల్ ఎస్టేట్ సంస్థ ఆ భూమిపై జీపీఏ తీసుకుంది. దీని ఆధారంగా వెంచర్ వేసి భూమి రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించగా నిషేధిత జాబితాలో ఈ భూమి వివరాలు ఉండటంతో చుక్కెదురయ్యింది. దీంతో రిజిస్ట్రేషన్‌కు అనుమతి కోరుతూ రియల్ సంస్థ కోర్టును ఆశ్రయించి తమకు అనుకూలంగా తాత్కాలిక ఆదేశాలు పొందింది. అయితే ఇది తుది తీర్పుపై ఆధారపడి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పోలీసుల సహకారంతో సదరు రియల్ ఎస్టేట్ సంస్థ భూములను తమ ఆధీనంలోకి తీసుకుంది. విషయం తెలిసిన చెట్యార్కి వంశీయులు ఈ కేసులో తమను ఇంప్లీడ్ చేయాలని కోర్టును కోరారు. దీనిపై విచారణ పెండింగ్‌లో ఉంది.

కోర్టు ఆదేశాల సాకుతో..

దర్గాకు సంబంధించి సర్వే నంబర్ 82లోని ఆరు ఎకరాలకు గతంలో లేఅవుట్ పర్మిషన్ (ఎల్పీ) జారీ చేసిన హెచ్ఎండీఏ..రియల్ సంస్థ దరఖాస్తు మేరకు తాజాగా ఈ 52.25 ఎకరాలకు ఎల్పీ జారీ చేసింది. సదరు రియల్ ఎస్టేట్ సంస్థ ఎల్పీ కోసం దరఖాస్తు చేసుకున్న సమాచారం తెలిసి ధరణిలో పట్టాదారుగా నమోదైన రైతులు.. ఎల్పీ జారీ చేయవద్దని, ఆ భూములపై 12 కేసులు ఉన్నాయంటూ, హెచ్ఎండీఏ వద్ద పలు ఆధారాలతో సహా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ భూములపై కోర్టు తుది తీర్పు షరతును సాకుగా తీసుకుని, భూముల వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించకుండానే హెచ్ఎండీఏ ఎల్పీ జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖ కూడా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. కాగా వక్ఫ్ బోర్డు మౌనంగా ఉండటంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఒకవేళ కోర్టు తుది తీర్పు ప్రతికూలంగా వస్తే ప్లాట్ల కొనుగోలుదారుల పరిస్థితేంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిపై వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా హెచ్ఎండీఏ అధికారులు, వక్ఫ్ బోర్డు చైర్మన్ స్పందించక పోవడం గమనార్హం. 'సర్వే నంబర్లు నిషేధిత జాబితాలో ఉన్నమాట వాస్తవమే. అయితే కోర్టు ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం..'అని మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ మహేందర్ స్పష్టం చేశారు.

క్లుప్తంగా

కేరళలో బోటు మునక.. 18 మంది మృతి

మలప్పురం: కేరళలోని మలప్పురంలో పర్యాటకులతో వెళ్తున్న పడవ బోల్తా పడి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో తానూర్‌లోని పర్యాటక ప్రాంతం తూర్వాల్ తీరమ్ వద్ద ఘటన చోటుచేసుకుంది. ప్రమాద ఘటన సమయంలో 30 మందికి పైగానే బోటులో ఉన్నట్లు చెబుతున్నారు. ఆరుగురి కాపాడామని యంత్రాంగం తెలిపింది.

అమెరికా మాల్‌లో కాల్పులు.. 8 మంది దుర్మరణం

హూస్టన్: అమెరికాలో కాల్పుల పరంపర కొనసాగుతూనే ఉంది. శనివారం మధ్యాహ్నం టెక్సాస్ రాష్ట్రం అలెన్ పట్టణంలో ఓ మాల్‌లో జరిగిన కాల్పుల్లో 8 మంది చనిపోయారు. కారులో వచ్చిన దుండగుడు జనంపైకి ఇష్టారాజ్యంగా కాల్పులకు తెగబడ్డాడు. దాంతో అక్కడి వారంతా భయంతో కేకలు వేస్తూ రక్షణ కోసం పరుగులు తీశారు. కాల్పుల శబ్దాలు, జనం కేకలతో అక్కడ విధుల్లో ఉన్న ఓ పోలీసు అప్రమత్తమై సాయుధున్ని కాల్చి చంపాడు. అప్పటికే దుండగుని కాల్పుల్లో ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. ముగ్గురు ఆస్పత్రిలో కన్నుమూశారు. అమెరికాలో ఈ ఏడాదిలో నాలుగు నెలల్లోనే ఇప్పటిదాకా 198 మాస్ షూటింగులు జరిగాయి. నలుగురు, అంతకంటే ఎక్కువమంది చనిపోతే మాస్ షూటింగ్‌గా చెబుతారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు...

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మెక్సికో సరిహద్దులోని బ్రౌన్స్‌విల్లే నగర సమీపంలో బస్టాప్ వద్ద ఓ కారు రోడ్డుపై నిల్చున్న జనంపై దూసుకొచ్చింది. ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఏడుగురు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

బంగారు గనిలో ప్రమాదం.. 27 మంది మృతి

లిమా: దక్షిణ అమెరికా దేశం పెరూలోని ఓ బంగారు గనిలో సంభవించిన అగ్నిప్రమాదంలో 27 మంది మృతి చెందారు. ఇద్దరిని మాత్రమే రక్షించగలిగామని అధికారులు తెలిపారు. అరెక్విపా ప్రాంతంలోని ఎస్పెరాంజా గనిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ఘటన చోటుచేసుకుంది. గనిలో సుమారు 100 మీటర్ల లోతులో సిబ్బంది పనిచేస్తున్న చోట మంటలు చెలరేగినట్లు సమాచారం. ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు గనులు పెరూలో ఉన్నాయి. ఏటా వీటి నుంచి 100 టన్నుల బంగారాన్ని వెలికితీస్తుంటుంది. ప్రపంచంలోని బంగారం ఉత్పత్తిలో ఇది 4%.

కింగ్ చార్లెస్ చుట్టూ నిబంధనాలు



బ్రిటన్ రాజుగా చార్లెస్ 3 పట్టాభిషిక్తుడయ్యాడు. ఒక దేశానికి రాజుగా కిరీటధారణ జరిగితే ఇక ప్రతి రోజూ రాజభోగాలు అనుభవించడమే అనుకుంటే పొరపాటే. విందు వినోదాలు, చుట్టూ వందిమాగధులు, ఏ చిన్న పనికైనా జీ హుజూర్ అనే సేవకులు ఇవన్నీ ఉన్నప్పటికీ మరిన్ని ఆంక్షల చట్రంలో బతకాల్సి ఉంటుంది. రాజు ప్రాణం ప్రజలకు ఎంతో విలువైనది. అందుకే భద్రతా కారణాలు, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలతో కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఒక రకంగా బంగారు పంజరంలో బంధించినట్టుగా స్వేచ్ఛను కోల్పోవలసి ఉంటుంది. 70 ఏళ్ల క్రితం రాణి ఎలిజబెత్ నాటి నిబంధనలే ఇప్పటికీ అమల్లో ఉన్నాయి. కింగ్ చార్లెస్ అవి ఇష్టం ఉన్నా లేకపోయినా పాటించి తీరవలసిందే.

– సాక్షి, నేషనల్ డెస్క్

కానుకల స్వీకరణ తప్పనిసరి

బ్రిటన్ రాజ సంప్రదాయం ప్రకారం వారికొచ్చే కానుకల్ని తప్పనిసరిగా స్వీకరించాలి. దేశంలో వివిధ ప్రాంతాలు సందర్శించినప్పుడు ఇతర దేశాల పర్యటనలకి వెళ్లినప్పుడు రాజుపై గౌరవంతో చాలా మంది రకరకాల కానుకలు ఇస్తారు. వాటిని రాజు తప్పకుండా తీసుకోవాలి. ఒకవేళ ఆ కానుకలు ఏదైనా ప్రత్యుపకారం పొందడం కోసం ఇస్తూ ఉంటే మాత్రం రాజకుటుంబం వారు కానుకల్ని తిరస్కరించే అవకాశం కూడా ఉంది. ఆ సమయంలో వారి మనోభావాలు దెబ్బ తినకుండా చూసుకోవాలి.

విలియంతో ప్రయాణించలేరు

బ్రిటన్ రాజుతో పాటు వారసుడు కూడా ముఖ్యమే. కింగ్ చార్లెస్ తర్వాత సింహాసనం అధిష్ఠించే వారసత్వపు హక్కు కలిగిన ప్రిన్స్ విలియమ్‌తో కలిసి ఆయన ఎక్కడికీ ప్రయాణించకూడదు. ఇద్దరూ వేర్వేరు విమానాలు, వాహనాల్లోనే వెళ్లాలి. ఎందుకంటే ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఇద్దరి ప్రాణాలకు ముప్పు ఉండకూడదన్న భావనతో ఈ నిబంధన తీసుకువచ్చారు.

వస్త్రధారణ

రాజు ధరించే వస్త్రధారణకి కూడా కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయి. దౌత్యపరంగా అనుకూలంగా ఉండే డ్రెస్సింగ్ స్టైల్ ఉంటుంది. రాజు ఏ దేశానికి వెళితే ఆ దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే దుస్తులే ధరిస్తారు. ఇక రాజు తనతో పాటు ఎప్పుడూ నలుపు రంగు వస్త్రాలు తీసుకువెళతారు. ఎక్కడికైనా వెళ్లినప్పుడు అనుకోని పరిస్థితుల్లో అంత్యక్రియలకి హాజరుకావాల్సి వస్తే అప్పుడు వేసుకోవడం కోసం నల్ల బట్టలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి.

ఓటుకి దూరం

బ్రిటన్ రాజు ఎప్పుడూ రాజకీయాల్లో తటస్థ వైఖరి అవలంబించాలి. ఏ పార్టీకి అనుకూలంగా కానీ, వ్యతిరేకంగా కానీ మాట్లాడకూడదు. అయితే పలు సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించవచ్చు. రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కు ఉన్నప్పటికీ రాచ కుటుంబ సంప్రదాయాల ప్రకారం ఓటింగ్‌కి కూడా దూరంగా ఉంటారు.

షెల్ ఫిష్ తినలేరు

రాజుతో సహా బ్రిటన్ రాచకుటుంబీలు అందరూ షెల్‌ఫిష్‌కు దూరంగా ఉండాలి. ఫుడ్ పాయిజనింగ్‌కి అవకాశం ఉన్న తినకూడదన్న నిబంధనలైతే ఉన్నాయి. ఇక రాజు భద్రతే అత్యంత కీలకం కాబట్టి అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తినకూడదు.

డ్రైవింగ్ లైసెన్స్ అక్కర్లేదు

ఎన్ని రకాల ఆంక్షలున్నా బ్రిటన్ రాజు ఒక్కరికే ఉన్న సదుపాయం ఒకటుంది. అదే లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం. కారు డ్రైవ్ చేయాలని అనుకుంటే ఆయనకు లైసెన్స్ అక్కర్లేదు. పాస్‌పోర్ట్ లేకుండా ఏ దేశానికైనా ప్రయాణించవచ్చు.

సెల్ఫీలు ఆటోగ్రాఫ్‌లు ఉండవు

ప్రజలెవరైనా రాజుతో కలిసి సెల్ఫీ దిగాలని ముచ్చట పడితే అది కుదిరేపని కాదు. ఎవరికీ ఆటోగ్రాఫ్‌లు ఇవ్వకూడదు. అలా ఇస్తే రాజు సంతకం ఫోర్జరీ చేస్తారన్న భయం ఉంది. సెల్ఫీలు దిగకూడదు. రాజు కుటుంబ సభ్యులందరికీ ఇదే వర్తిస్తుంది. అయితే ప్రోటోకాల్స్‌లో ఈ నిబంధనని అధికారికంగా ఇంకా చేర్చలేదు.

నారీ శక్తితో గణతంత్రం

వచ్చే ఏడాది మహిళలతోనే రిపబ్లిక్ డే పరేడ్

మహిళా శక్తి సత్తా చాటడానికి కేంద్రం సన్నాహాలు



న్యూఢిల్లీ: భారత గణతంత్ర దినోత్సవ పరేడ్ అంటే మన దేశ త్రివిధ బలగాల శక్తిని ప్రపంచానికి చాటడమే. యుద్ధ శకటాలు, విమానాల విన్యాసాలు, కొత్త ఆయుధాల ప్రదర్శన ఇలా పరేడ్ అంటే కదనరంగంలో మన సత్తా ఎంతో ప్రదర్శించడమే. అలాంటి పరేడ్‌ను వచ్చే ఏడాది మహిళా శక్తితో నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నింగి నేలా నీరు అంతా మాదే అంటూ నినదిస్తున్న మహిళల భాగస్వామ్యం ఇటీవల కాలంలో త్రివిధ బలగాల్లో పెరుగుతోంది. యుద్ధ భూమిలోకి అడుగు పెట్టడానికి కూడా మహిళలు సై అంటున్నారు. కేంద్ర బలగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడం కోసం 2024 జనవరి 26న కర్తవ్యపథ్‌లో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌ను కేవలం మహిళలతో నిర్వహించాలని రక్షణ శాఖ ఫిబ్రవరిలో ప్రతిపాదించింది. దీనిపై ఫిబ్రవరిలో రక్షణ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో త్రివిధ బలగాల అధిపతులతో ఒక సమావేశం కూడా జరిగిందని ఆదివారం రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. త్రివిధ బలగాల్లోని మహిళా అధికారులే రిపబ్లిక్ డే కవాతుని నడిపిస్తారని ఆ సమావేశం నిర్ణయించింది. ఈ విషయాన్ని వివిధ ప్రభుత్వ శాఖలకి కూడా సమాచారం అందించారు. రక్షణ , హోం సంస్కృతి పట్టణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా దీనిని ఎలా అమలు చేయాలో చర్చిస్తున్నట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది రిపబ్లిక్ డేలో నారీ శక్తి థీమ్‌ను ప్రధానంగా చేశారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, త్రిపుర రాష్ట్రాలు నారీశక్తి థీమ్‌తో శకటాలు రూపొందించాయి. ఇక వచ్చే ఏడాది అందరూ మహిళలతోనే పరేడ్ సాగనుంది.

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌ను 21లోగా అరెస్ట్ చేయాలి

లేకుంటే ముఖ్యమైన నిర్ణయం ప్రకటిస్తాం

- ప్రభుత్వానికి రైతు సంఘాల అల్టిమేటం
- పోరాటం ఉధృతం చేస్తామన్న వినేశ్ ఫొగాట్
- తప్పు రుజువైతే చెప్పులతో కొట్టి చంపండి
- వీడియో విడుదల చేసిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్



జంతర్ మంతర్ వద్ద కొవ్వొత్తులతో రెజ్లర్ల నిరసన


న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ బాధిత మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన నిరసన కీలక మలుపు తిరిగింది. ఆదివారం నిరసన దీక్షా శిబిరం వద్దకు భారతీయ కిసాన్ సంఘ్(బీకేయూ) నేత రాకేశ్ తికాయత్, ఖాప్ మహమ్ 24 నేత మెహర్ సింగ్, సంయుక్త కిసాన్ మోర్చాకు చెందిన దేవ్ సింగ్ సిర్సా తదితరులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సంఘీభావం తెలిపారు. 'ఇకపై ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసనల్లో పాల్గొంటాం. రెజ్లర్లకు వెలుపలి నుంచి మద్దతు తెలుపుతామన్నారు. వారికేదైనా సమస్య వస్తే తోడుంటాం'అని రైతు సంఘాల నేతలు చెప్పారు. బాధిత రెజ్లర్ల డిమాండ్ల కోసం ఈ నెల 11–18 తేదీల మధ్య దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేసి, సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 21న సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇవి రాజకీయ నిరసనలు కావు.. తమది రాజకీయేతర సంస్థ అని చెప్పారు. ఇలా ఉండగా, తమ నిరసనలు యథావిధిగా కొనసాగుతాయని రెజ్లర్ వినేశ్ ఫొగాట్ తెలిపారు. ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో ఆదివారం జంతర్ మంతర్ వద్ద భారీగా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్)ను మోహరించారు. ఇలాఉండగా, నిరసనకు దిగిన రెజ్లర్లకు రైతు సంఘాలు మద్దతు తెలపడంపై డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ స్పందించారు. ఢిల్లీ పోలీసుల దర్యాప్తు పూర్తయ్యేదాకా వేచి చూడాలని కోరారు. ఒక్క ఆరోపణ రుజువైనా ఉరి వేసుకుంటానన్నానంటూ ఒక వీడియో పోస్ట్ చేశారు. ఆరోపణలు రుజువైతే శిక్ష విధించండి. దోషిగా తేలితే నన్ను కొట్టి చంపండి'అని పేర్కొన్నారు.

సౌర కుటుంబం అంచున జలరాశి!

యురేనస్ నాలుగు ఉపగ్రహాలపై సముద్రాలు • నూతన కంప్యూటర్ మోడల్‌తో గుర్తించిన నాసా సైంటిస్టులు

జీవుల మనుగడకు ఆధారం జలం. భూగోళంపై తొలుత నీరు, ఆ తర్వాత మనుషులతో సహా రకరకాల జీవులు పుట్టుకొచ్చినట్లు అనేక పరిశోధనల్లో తేటతెల్లమయ్యింది. మొట్టమొదటి జీవి నీటిలోనే పుట్టిందట. విశ్వంలో భూమిపైనే కాకుండా ఇంకెక్కడైనా జలరాశి ఉందా? అనేదానిపై సైంటిస్టులు శతాబ్దాలుగా అన్వేషణ కొనసాగిస్తున్నారు. ఇతర గ్రహాలు లేదా వాటి ఉపగ్రహాలపై నీటి జాడ ఉన్నట్లు తేలితే అక్కడ జీవులు సైతం ఉండేందుకు ఆస్కారం లేకపోలేదు. సూర్యుడి ప్రభావం పెద్దగా ఉండని సౌర వ్యవస్థ అంచుల్లోనూ జల అన్వేషణ సాగుతోంది. ఈ విషయంలో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' సైంటిస్టులు పురోగతి సాధించారు. మన సౌర కుటుంబం కొసభాగాన యురేనస్ గ్రహానికి చెందిన ఉపగ్రహాలపై మహా సముద్రాలు ఉన్నాయని చెప్పడానికి ఆధారాలు కనిపెట్టారు.

- యురేనస్ గ్రహానికి దాదాపు 27 ఉపగ్రహాలు ఉన్నాయి. అవి యురేనస్ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. వీటిలో ఏరియల్, అంబ్రియెల్, టైటానియా, ఒబెరాన్, మిరండా అనేవి ప్రధానమైనవి. ఇందులో టైటానియా అన్నింటికంటే పెద్దది.
- యురేనస్‌పై పరిశోధనల కోసం 1980వ దశకంలో ప్రయోగించిన వొయేజర్–2 అంతరిక్ష నౌక అందించిన సమాచారాన్ని, నాసా ప్రయోగించిన గెలీలియో, కాసినీ, డాన్, న్యూహోరిజాన్స్ స్పేస్‌క్రాఫ్ట్‌లు పంపించిన సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించారు. ఇందుకోసం నూతన కంప్యూటర్ మోడల్‌ను ఉపయోగించారు.
- యురేనస్ ఉపగ్రహాల అంతర్గత నిర్మాణం, వాటి ఉపరితలం స్వభావాన్ని సూక్ష్మస్థాయిలో పరిశీలించారు.



- ప్రధానమైన ఐదు ఉపగ్రహాల్లో నాలుగు ఉపగ్రహాల ఉపరితల పొర అంతర్గత వేడిని రక్షిస్తున్నట్లు గుర్తించారు. అంటే ఉపగ్రహ అంతర్భాగంలోని వేడి బయటకు వెళ్లకుండా ఆ పొర నిరోధిస్తున్నట్లు కనిపెట్టారు.
- ఏదైనా గ్రహంపై సముద్రం ఏర్పడాలంటే దాని అంతర్భాగంలో తగిన ఉష్ణోగ్రత ఎల్లప్పుడూ ఉండాలి.
- సాధారణంగా గ్రహాల లోపలి భాగంలో సలసల కాగే శిలాద్రవం(లావా) ఉష్ణోగ్రతను విడుదల చేస్తూ ఉంటుంది. సముద్రాల ఉనికికి ఈ లావా నుంచి వెలువడే ఉష్ణం తోడ్పడుతుంది. యురేనస్ ఉప గ్రహాల్లో ఇలాంటి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు వెల్లడయ్యింది.
- సౌర వ్యవస్థ అంచున మిరండా సహా నాలుగు ఉపగ్రహాలపై సముద్రాలు కచ్చితంగా ఉన్నట్లు అంచనా వేస్తున్నామని పరిశోధకులు వెల్లడించారు.
- యురేనస్ ఉపగ్రహాలపై ఉన్న సముద్రాల్లో క్లోరైడ్, అమోనియా వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.
- యురేనస్ గ్రహం సూర్యుడి నుంచి ఏడో గ్రహం. ఇది వాయువులతో నిండిన భారీ మంచు గ్రహం. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్‌తో యురేనస్‌ను ఇటీవల పరిశీలించారు. అది చిన్నపాటి సౌర వ్యవస్థతో కూడుకొని ఉన్న గ్రహమని చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతం

చర్ల: తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ చర్ల లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్ కమాండర్ మడకం ఎర్రయ్య అలియాస్ రాజేష్ ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పుట్టపాడు అటవీ ప్రాంతంలో కూంబింగ్ జరుపుతున్న పోలీసులపైకి మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు.

రాజస్తాన్‌లో భారీగా లిథియం నిల్వలు

జైపూర్: అత్యంత ఖరీదైన లిథియం ఖనిజ నిల్వలు రాజస్తాన్‌లో భారీ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రంలో డేగానా(నాగౌర్)లోని రెన్వాత్ కొండ ప్రాంతంలో ఈ నిల్వలు నిక్షిప్తమైనట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ), మైనింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో గుర్తించిన లిథియం నిల్వల కంటే రాజస్తాన్‌లో అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. మన దేశ అవసరాల్లో 80 శాతం అవసరాలను రాజస్తాన్‌లోని నిల్వలు తీర్చగలవని అన్నారు. భారత్ లిథియం కోసం ప్రధానంగా చైనాపై ఆధారపడుతోంది. తాజాగా బయటపడిన నిల్వలతో చైనా గుత్తాధిపత్యానికి తెరపడడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాల్లోనే ఈ ఖనిజం ఉంది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, విద్యుత్ వాహనాలు, బ్యాటరీల తయారీలో లిథియం ఉపయోగిస్తున్నారు.

రేపు దేశవ్యాప్త హనుమాన్ చాలీసా పఠనం

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నిర్ణయం

బెంగళూరు: దేశవ్యాప్తంగా ఈ నెల 9న హనుమాన్ చాలీసా పఠించాలని విశ్వహిందూ పరిషత్, ఆ సంస్థ యువజన విభాగం బజరంగ్‌దళ్ నిర్ణయించాయి. కులం, మతం ఆధారంగా సమాజంలో మత విద్వేషాలను ప్రేరేపించే వ్యక్తులు, సంస్థలపై తీవ్ర చర్యలు తీసుకుంటామంటూ వారం క్రితం కాంగ్రెస్ పార్టీ వెలువరించిన కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విషయం తెలిసిందే.

మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు

పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ సడలింపు

ఇంఫాల్/న్యూఢిల్లీ: గిరిజన, గిరిజనేతరుల నడుమ భీకర ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో క్రమంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ నిబంధనలు సడలించారు. జనం ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. ఆహారం, నిత్యావసరాలు కొనుగోలు చేస్తున్నారు. మణిపూర్‌లో పరిణామాలపై దర్యాప్తునకు ఆదేశించాలని పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గిరిజనేతరులైన మైతీలకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ మణిపూర్ హైకోర్టుజారీ చేసిన ఉత్తర్వును నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ సమర్పించారు. హింసాకాండపై సమగ్ర దర్యాప్తును కోరుతూ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ 'మణిపూర్ ట్రైబల్ ఫోరం' సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై న్యాయస్థానం సోమవారం విచారణ చేపట్టనుంది.



బ్రిటన్ రాజు చార్లెస్ పట్టాభిషేకం సందర్భంగా నిర్వహించే బిగ్ లంచ్ కార్యక్రమంలో భాగంగా లండన్‌లో అతిథులకు వడ్డిస్తున్న ప్రధాని రిషి

ఏ 'ఇంజిన్'కు ఎంత కమీషన్?


ప్రధాని మోదీని ప్రశ్నించిన రాహుల్‌గాంధీ

బనశంకరి: కర్ణాటక ప్రభుత్వ అవినీతిపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఆదివారం బెంగళూరు నగర జిల్లాలోని ఆనేకల్‌లో ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. 'మూడేళ్లుగా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగుతోంది. ఇక్కడ అవినీతి విషయం ప్రధాని మోదీకి కూడా తెలుసు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని కూడా చెప్పుకుంటున్నారు. కానీ, ఈసారి డబుల్ ఇంజిన్ మాయమైంది. 40 శాతం కమీషన్‌లో ఏ ఇంజిన్‌కు ఎంత అందిందో కర్ణాటక ప్రజలకు మోదీజీ చెప్పాలి'అని అన్నారు.

అవినీతి, నిరుద్యోగమే అసలు ఉగ్రవాదం: ప్రియాంక

అవినీతి, దోపిడీ, అధిక ధరలు, నిరుద్యోగమే కర్ణాటకలో అసలు తీవ్రవాదమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా పేర్కొన్నారు. అధికార బీజేపీ ప్రజల వాస్తవ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఆదివారం దక్షిణ కన్నడ జిల్లా మూడబిదిరెలో కాంగ్రెస్ ప్రచారసభలో ఆమె ప్రసంగించారు.

స్కూటర్‌పై రాహుల్ చక్కర్లు



ఫుడ్ డెలివరీ బాయ్‌తో స్కూటర్ మీద రాహుల్ బెంగళూరులో సవారీ చేశారు. దారిలో ఒక హోటల్‌లో టిఫిన్ చేశారు. ఎస్‌సీజీ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీని పరామర్శించారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్స్, డెలివరీ బాయ్స్‌తో మాట్లాడారు. అధికారంలోకి వస్తే రూ.3 వేల కోట్ల కార్పస్ ఫండ్‌తో గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, అండగా నిలుస్తామన్నారు.

కర్ణాటకను వేరు చేసే కుట్ర

- కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ ఆగ్రహం
- కర్ణాటక సార్వభౌమత్వం అంటే ఏమిటో ఆ పార్టీ చెప్పాలి
- భారత్ వ్యతిరేకులతో కాంగ్రెస్ రహస్య భేటీలు
- అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని

శివమొగ్గ/బనశంకరి: భారతదేశం నుంచి కర్ణాటకను వేరు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతోందని, అందుకోసం బహిరంగంగానే పిలుపునిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. 'తుక్డే తుక్డే గ్యాంగ్' వ్యాధి ఆ పార్టీలో టాప్ లెవల్‌కు చేరిందని అన్నారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేసే విషయంలో కాంగ్రెస్ 'రాజ కుటుంబం' ముందంజలో ఉంటుందని ఆరోపించారు. తన మనసులో చాలా బాధ ఉందని అన్నారు. ఆ రాజ కుటుంబం మన దేశంలో విదేశీ శక్తుల జోక్యాన్ని ప్రోత్సహిస్తోందని పరోక్షంగా సోనియా గాంధీ కుటుంబంపై మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు ఆటలను దేశం ఎప్పటికీ క్షమించబోదని తేల్చిచెప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం మైసూరు జిల్లాలోని నంజనగూడులో బహిరంగ సభలో మాట్లాడారు. భారత్‌ను ద్వేషించే విదేశీ ప్రతినిధులతో కాంగ్రెస్ పార్టీ రహస్యంగా సమావేశమవుతోందని, మన దేశ సార్వభౌమత్వాన్ని కించపర్చే చర్యలకు తరచుగా పాల్పడుతోందని, అందుకు ఆ పార్టీ ఏమాత్రం సిగ్గుపడడం లేదని దుయ్యబట్టారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పరివారం అన్ని పరిమితులు దాటేసిందని, కర్ణాటక సార్వభౌమత్వాన్ని కాపాడతామని చెబుతోందని, తద్వారా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. అసలు కర్ణాటక సార్వభౌమత్వం అంటే ఏమిటో చెప్పాలని నిలదీశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతామని రాజ్యాంగంపై ప్రమాణం చేసి, ఇలాంటి మాటలు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.



శివమొగ్గ జిల్లాలో ప్రచారసభలో మోదీకి జ్ఞాపిక

కర్ణాటక భారతదేశంలో లేదని కాంగ్రెస్ భావిస్తోందా? అని అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో కర్ణాటక అంతర్భాగమని మోదీ ఉద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలని, బీజేపీ భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. నంజనగూడులో ప్రచారం తర్వాత ప్రధానమంత్రి శ్రీకంఠేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. నంజుండేశ్వర స్వామి వెండి ప్రతిమను బీజేపీ నేతలు ప్రధానికి బహూకరించారు.

ప్రజల మద్దతు మాకే..

కర్ణాటకలో తాము ఎక్కడికి వెళ్లినా ప్రజల మద్దతు సంపూర్ణంగా లభిస్తోందని, వారు తమను ఆశీర్వదిస్తున్నారని, రాష్ట్రంలో తాము మరోసారి అధికారంలోకి వస్తామన్న పూర్తి విశ్వాసం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆదివారం శివమొగ్గ సమీపంలోని ఆయనూరులో భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సుమారు 30 లక్షల ఉద్యోగాలను కల్పించిందని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరిగిందని అన్నారు. అధికారం కోసం ఎదురు చూస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు తప్పుడు హామీలు ఇస్తోందని, అబద్ధాలను చెబుతోందని దుయ్యబట్టారు. కర్ణాటకలో కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాలను ప్రజలు నమ్మడం లేదని, ఆ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ప్రచారం కోసం సోనియా గాంధీని రప్పించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అబద్ధాల గాలి బుడగను ప్రజలు పగులగొట్టడం ఖాయమని తేల్చిచెప్పారు.

బెంగళూరులో మూడో రోజు రోడ్ షో

ప్రధాని మోదీ వరుసగా మూడో రోజు ఆదివారం కూడా బెంగళూరులో రోడ్ షోలో పాల్గొన్నారు. 6 కిలోమీటర్ల మేర రోడ్ షో కొనసాగింది. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మోదీపై పూలవర్షం కురిపించారు. మోదీ మోదీ, జై బజరంగబలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వేద పండితులు హనుమాన్ చాలీసా పఠించారు.



ట్రాఫిక్ జామ్

నూతన సచివాలయం వద్ద ఆదివారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సెలవుదినం కావడం.. నూతన సచివాలయాన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపడంతో ఈ పాంతంలో భారీ రద్దీ ఏర్పడింది.



డైమండ్స్ ఆర్ ఫరెవర్..

ప్రముఖ వజ్రాల వ్యాపారి గోవింద్ ధోలాకియా ఆత్మకథ 'డైమండ్స్ ఆర్ ఫరెవర్, సో ఆర్ మోరల్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం నగరంలో జరిగింది. -8లో

అల్లం-వెల్లుల్లి పేస్ట్ నుంచి...



కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, శీతల పానీయాలు, మసాలాలను తయారు చేస్తున్న కార్ఖానాపై ఆదివారం రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. 500 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, మ్యాంగో డ్రింక్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. -8లో

న్యూస్‌రీల్

శభాష్ 'ఫిట్ కాప్స్'!



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసుల్లోని అధికారులు, సిబ్బంది ఆరోగ్యం మెరుగుపరచడం కోసం నగర కొత్వాల్ సీవీ ఆనంద్ అమలులోకి తీసుకువచ్చిన యాప్ ఫిట్ కాప్. దీని ద్వారా హై రిస్క్‌లో తమ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, మెరుగుపరుచుకున్న 60 మందికి ఆయన ఆదివారం రివార్డులు అందించారు. సిటీ పోలీసు సిబ్బంది, అధికారుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించడానికి స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్‌హెచ్ఎఫ్) సహాయంతో ఫిట్ కాప్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చారు. వీళ్ల గడిచిన ఆరు నెలల్లో 16 వేల మంది పోలీసులకు ఆరోగ్య పరీక్షలను పూర్తి చేసి ఆ వివరాలను యాప్‌లో పొందుపరిచారు. దీని ద్వారానే వారికి వ్యాయామం, ఆహారపు అలవాట్లపై సలహాలు సూచనలు అందించారు. యాప్‌లో ఉన్న వివరాల ఆధారంగా తమ జీవన విధానంలో మార్పులు తీసుకువచ్చిన 60 మంది పోలీసులు హై రిస్క్ కేటగిరీ నుంచి బయటపడ్డారు. వీరిని బంజారాహిల్స్‌లోని ఐసీసీసీకి పిలిపించిన కొత్వాల్ ఆనంద్ ఆదివారం రివార్డులు అందించారు. కార్యక్రమంలో సంయుక్త సీపీ డాక్టర్ గజరావ్ భూపాల్, డీసీపీ డి.సునీత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హైలైఫ్ ఎగ్జిబిషన్



హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నటి వర్ష తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం జబర్దస్త్ ఫేం వర్ష, నటి శుభశ్రీ రాయగురు, కృతికరాయ్‌లతో పలువురు మోడల్స్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి వర్ష మాట్లాడుతూ దేశంలోని 350 మంది ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు ఇక్కడి స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. నగరవాసులను ఆకట్టుకునే విధంగా వీటిని తీర్చిదిద్దడం బావుందన్నారు. సమ్మర్ స్పెషల్ వస్త్రాలు ప్రత్యేక డిజైన్‌లతో అందుబాటులో ఉన్నాయన్నారు. నిర్వాహకుడు డొమినిక్ మాట్లాడుతూ సమ్మర్‌స్పెషల్, ఫ్యాషన్‌వేర్, ట్రెండ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఉత్తమ ప్రతిభకు 'ఇండియన్ ఎమినెంట్ అవార్డ్స్'



సాక్షి, సిటీబ్యూరో: హైటెక్స్‌లోని నోవాటెల్ వేదికగా ఇన్నోవేషన్, స్టార్టప్స్, పరిశ్రమలు, సామాజిక సేవ తదితర రంగాల్లో విశేష సేవలందించిన సంస్థలు, వ్యక్తులను 'ఇండియన్ ఎమినెంట్ అవార్డ్స్ -23'లతో ఘనంగా సత్కరించారు. ఇనోవెక్సియా ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మిస్ ఆసియా ఇంటర్నేషనల్ రష్మీ ఠాకూర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ., వినూత్న ఆలోచనా విధానంతో ముందుకు వచ్చిన అంకుర సంస్థలతో పాటు సామాజిక సేవకులకు ఇలాంటి అవార్డులు అందించడం అభినందనీయమని అన్నారు. మార్గదర్శకంగా నిలిచే వ్యక్తులకు ఈ అవార్డులు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. ఇనోవెక్సియా ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతాంజలి అన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ స్పీడ్ బ్రేకర్లపై ఆలోచించండి

- నగరవాసి ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ స్పందన

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పలుచోట్ల రోడ్లపైన ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్‌ల (గుంపుగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్స్) వల్ల వాహనదారులు నడుము, వెన్నెముక వంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని శరత్ కుమార్ అనే వ్యక్తి ట్విట్టర్‌లో జీహెచ్ఎంసీ, మంత్రి కేటీఆర్, అజయ్ పువ్వాడలను ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందించి ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన మార్పులు చేయాల్సిందిగా జీహెచ్ఎంసీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులకు సూచిస్తూ రీట్వీట్ చేశారు.







సైకిల్ సవారీ

సైకిల్ ప్రయాణం ఆరోగ్యకరం..ఆనందకరం అంటూ సైక్లింగ్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఔత్సాహికులను ప్రోత్సహించారు 'హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్' సభ్యులు. ఈ మేరకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన మెగా ఈవెంట్‌లో 20 సైక్లిస్ట్ గ్రూపులకు చెందిన వందలాది మంది సైక్లిస్ట్‌లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు సైక్లింగ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు.

– రసూల్‌పురా

కలెక్టరేట్ తరలింపునకు బ్రేక్!

లక్డీకాపూల్ భవన మరమ్మతులకు రూ.3 కోట్లపైనే..

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ఇంజనీరింగ్ శాఖ
- బడ్జెట్ లేదని పెండింగ్‌లో పెట్టిన ఆర్థిక శాఖ
- మరమ్మతుల తర్వాతనే తరలింపుపై మొగ్గు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్ తరలింపు ప్రతిపాదన మళ్లీ పెండింగ్‌లో పడింది. అబిడ్స్ (ప్రస్తుత హైదరాబాద్ కలెక్టరేట్) నుంచి లక్డీకాపూల్ (పాత రంగారెడ్డి కలెక్టరేట్)కు తరలింపునకు గ్రీన్ సిగ్నల్ లభించినా..ఆ భవన సముదాయం మరమ్మతులకు నిధుల సమస్య ఎదురైంది. హైదరాబాద్ జిల్లా యంత్రాంగం ఇంజనీరింగ్ శాఖ ద్వారా మరమ్మతు పనుల కోసం సుమారు రూ.3 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపించగా.. బడ్జెట్ లేదని ఆర్థిక శాఖ పెండింగ్‌లో పెట్టింది. దీంతో కలెక్టరేట్‌కు ప్రత్యేక నిధులు లేక..నిధులు మంజూరయ్యే వరకు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ జిల్లాకు రెగ్యులర్ కలెక్టర్ లేకపోవడంతో ఆర్థిక శాఖపై కనీసం ఒత్తిడి లేకుండా పోయింది. ఫలితంగా ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోగా, మరోవైపు సాధారణ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో నిధుల అంశం ప్రశ్నార్థకంగా తయారైంది. ఒక వేళ పరిస్థితులను బట్టి ఇతర శాఖలకు భవన సముదాయం కేటాయిస్తే ఈ అవకాశం కూడా చేజారే అవకాశం ఉంది.



రంగారెడ్డి పాత కలెక్టరేట్ భవనం (ఫైల్)

మెరుగులు దిద్దినా..

నగర శివారులోని కొంగరకలాన్‌లో నిర్మించిన సమీకృత భవన సముదాయంలోకి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ మారడంతో హైదరాబాద్ కలెక్టరేట్ తరలింపునకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. వాస్తవంగా ఏడాది క్రితం రంగారెడ్డి కలెక్టరేట్ తరలిపోగా ఆ భవన సముదాయంలోకి హైదరాబాద్ కలెక్టరేట్ తరలింపుపై మొదట్లో అడ్డంకులతో పాటు పోలీసు శాఖ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గత ఆరు నెలల క్రితం అవి తొలిగిపోవడంతో లక్డీకాపూల్ లోని భవన సముదాయానికి తుది మెరుగులు దిద్దారు. అయితే జిల్లా యంత్రాంగం పనిలో పనిగా భవన సముదాయానికి పూర్తి స్థాయి మరమ్మతులు చేయిస్తే బాగుంటుందని భావించి ప్రతిపాదనలు పంపించింది. కానీ ఆర్థిక శాఖ ఆ ప్రతిపాదనలను పెండింగ్‌లో పెట్టింది.

ఒకే ప్రాంగణం కోసం..

సరిగ్గా పదహారేళ్ల క్రితం ఒకే ప్రాంగణంలో అన్ని ఆఫీసులతోపాటు ప్రజలకు అన్ని సేవలను అందించేందుకు కొత్త భవన సముదాయం ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అప్పట్లో ప్రభుత్వం కొత్త కాంప్లెక్స్ కోసం 2007 ఏప్రిల్‌లో రూ.10 కోట్లు మంజూరు చేసినా...నిధులు ఏ మూలకు సరిపోని పరిస్థితి. బడ్జెట్ పరిమితుల కారణంగా తిరిగి సవరించిన ప్రణాళికలు, అంచనాలను తిరిగి ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించారు. అయితే కలెక్టరేట్ కాంప్లెక్స్ భూమిని వేలం వేసి వచ్చిన మొత్తాన్ని ప్రతిపాదిత కొత్త కాంప్లెక్స్ కోసం ఉపయోగించాలని అప్పటి ప్రభుత్వం సూచించడంతో నిర్మాణ అంశం మూలకు చేరింది.

కొత్త నిర్మాణానికి అవకాశం లేక..

హైదరాబాద్ కలెక్టరేట్ శిథిలావస్థకు చేరడంతో పాతభవనాలు కూల్చి సమీకృత భవన సముదాయ నిర్మాణం చేపడితే బాగుంటుందని మొదట్లో అధికార యంత్రాంగం భావించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అన్ని జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు కొత్త భవన నిర్మాణానికి అవకాశం లభించలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి అవకాశం లభించినా...పలు ఆటంకాలు తలెత్తాయి. భవన నిర్మాణానికి విడుదలైన నిధులు సైతం వెనక్కి వెళ్లిపోయాయి. ఒకసారి నిధులు మంజూరై వెనక్కి మళ్లిపోగా, మరోసారి ఏ కారణం లేకుండానే..విడుదల చేసిన నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం గమనార్హం.

మూడు దశాబ్దాల క్రితం

నాంపల్లి-అబిడ్స్ రోడ్డులో నిజాం కాలంలో నిర్మించిన కలెక్టరేట్ పాత భవన సముదాయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో 1990లో నాలుగు అంతస్తులతో ఒకే ఒక కొత్త భవనం నిర్మించారు. అందులో ప్రస్తుతం కలెక్టరేట్ విభాగాలు కొనసాగుతున్నాయి.

అభివాదం చేస్తూ.. సమస్యలు ఆలకిస్తూ..



వనస్థలిపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క

రెండో రోజు సాగిన భట్టి 'పీపుల్స్ మార్చ్' యాత్ర

- అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి వనస్థలిపురం వరకు..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర రెండో రోజు ఆదివారం కూడా సాగింది. శనివారం రాత్రి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం వద్ద జిల్లాలోకి ప్రవేశించిన ఈ యాత్ర ఆదివారం ఉదయం 10 గంటలకు గుంతపల్లి నుంచి బయలుదేరి లష్కర్‌గూడ, అబ్దుల్లాపూర్‌మెట్, రామోజీ ఫిలింసిటీ, ఓఆర్ఆర్ మీదుగా పెద్ద అంబర్‌పేటకు చేరుకుంది. మధ్యాహ్నం అక్కడే భోజనం చేశారు. అనంతరం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు మళ్లీ పాదయాత్రగా బయలు దేరి.. సాయంత్రం హయత్‌నగర్ మీదుగా వనస్థలిపురం చేరుకున్నారు. జిల్లాలో పదిహేను కిలో మీటర్లకు పైగా కొనసాగిన పాదయాత్రలో స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తూ, కార్నర్ మీటింగ్‌ల్లో వారి సమస్యలను ఆలకిస్తూ ముందుకు కదిలారు.

గోడు చెప్పుకున్న భూ బాధితులు

బండరావిరాల గ్రామ సర్వే నంబర్ 268లోని 209 మంది రైతుల నుంచి మైనింగ్ కోసం భూములు సేకరించి, ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని ఆ గ్రామ నేతలు భట్టి దృష్టికి తీసుకెళ్లారు. పరిహారం కోసం 18 ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. మండలంలో 3,700 మంది దళితులు ఉంటే 17 మందికి మాత్రమే దళిత బంధు ఇచ్చారని తెలిపారు. 2020లో కురిసిన అకాల వర్షాలకు 1,500పైగా ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఇప్పటికీ పరిహారం చెల్లించలేదని పలువురు బాధితులు భట్టికి తెలియజేశారు. పరిశ్రమల పేరుతో కేసీఆర్ సర్కారు లాక్కున్న భూములను తాము అధికారంలోకి రాగానే పేదలకు తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పీసీసీ కార్యదర్శి దండెం రామిరెడ్డి, జెడ్పీటీసీ దాసుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్, ఎంపీపీ బీ రేఖ, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న భట్టి





సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలంగాణ భరోసా సభ'కు హాజరైన జనం. వేదికపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతికి జ్ఞాపికను బహూకరిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.

మొబైల్ డేటానే ముద్దు!



చక్రధర్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: నిరుద్యోగులు, ప్రధానంగా మహిళలను టార్గెట్‌గా చేసుకుని డేటా ఎంట్రీ సహా అనేక పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో ఎర వేసి, బోగస్ ఇంటర్వ్యూలూ చేసి, ఒక్కొక్కరి నుంచి చిన్న మొత్తాల చొప్పున రూ.కోట్లు కొల్లగొట్టిన చక్రధర్ గౌడ్ ఏ దశలోనూ తమ ఉనికి బయటపడకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నాడు. ఇతడితో సహా ఈ కేసులో అరెస్టు అయిన నలుగురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కోర్టు అనుమతితో గురువారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ విచారణలో వీరి వ్యవహారాలకు సంబంధించి అనేక కీలకాంశాలు గుర్తించారు. కస్టడీ గడువు ఆదివారంతో ముగిసింది.

ఐపీ దొరక్కూడదనే వైఫై కనెక్షన్ తీసుకోలేదు...

పంజగుట్ట ప్రాంతంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసిన చక్రధర్ అందులో అనేక మందిని ఇన్‌ఫ్లూయన్సర్స్‌గా పిలిచే టెలీకాలర్లను నియమించుకున్నాడు. వీరికి ఫోన్లు అందించిన ఇతగాడు వాటికి ఉండే 4జీ డేటానే వినియోగించేలా ఆదేశించాడు. చివరకు కార్యాలయంలో ఉన్న ల్యాప్‌టాప్, కంప్యూటర్లకు కూడా హాట్‌స్పాట్ ద్వారా ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇచ్చాడు. తమ ఉనికి బయటపడకుండా ఉండేందుకు వైఫైకి దూరంగా ఉన్నాడని దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎలాంటి నెట్‌వర్క్‌కు అయినా ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్ ఉంటుంది. దీని ఆధారంగా ఆ కనెక్షన్ ఎక్కడ ఉందనేది దర్యాప్తు అధికారులు గుర్తిస్తారు. వైఫై నెట్‌వర్క్‌కు స్టాటిక్ ఐపీ అడ్రస్, 4జీకి డైనమిక్ అడ్రస్ ఉంటాయి. స్టాటిక్ నిర్దిష్టంగా ఉండగా.. డైనమిక్ అడ్రస్ మారుతూ ఉంటుంది. ఈ కారణంగానే మొబైల్ డేటా వాడితే ఆచూకీ కనిపెట్టడం కష్టసాధ్యమవుతుంది.

ప్రీ యాక్టివేటెడ్ సరఫరా సైతం నేరమే...

తన కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న టెలీకాలర్స్‌కు అందించడానికి చక్రధర్ ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు సమీకరించాడు. వీటిని ఇతగాడు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంతో పాటు తమిళనాడులోని కొందరు దళారుల నుంచి ఖరీదు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఒక్కో సిమ్‌కార్డును రూ.1000 చొప్పున చెల్లించి ఖరీదు చేస్తున్నట్లు తేల్చారు. టెలికం నిబంధనల ప్రకారం ఇలా ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు అందించడం నేరం. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి సిమ్‌కార్డు ఖరీదు చేసిన తర్వాత అతడి గుర్తింపు పత్రాలు, ప్రత్యామ్నాయ నెంబర్‌కు వచ్చే పిన్ నెంబర్ తదితరాల ఆధారంగా అది యాక్టివేట్ కావాలి. సిమ్ కార్డులు దుర్వినియోగం కాకుండా ఏ సిమ్‌కార్డు ఎవరు వాడుతున్నారనేది గుర్తించడానికే ఈ జాగ్రత్తలు తీసుకుంటాయి. అయితే కొందరు డిస్ట్రిబ్యూటర్లు, దళారులు ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులను విక్రయిస్తున్నారు. తమ వద్దకు వచ్చి కస్టమర్ల గుర్తింపులు వారికి తెలియకుండా జిరాక్సు తీసుకోవడం ద్వారా వారి పేర్లు, డమ్మీ నెంబర్లతో ఇవి యాక్టివేట్ చేస్తున్నారు.

పోలీసు నిఘాకు చిక్కకుండా చక్రధర్ వ్యవహారాలు

- స్టాటిక్ ఐపీలు కావడంతో వైఫై నెట్‌వర్క్‌కు దూరం
- డైనమిక్ కారణంగానే 4జీ డేటా మాత్రమే వినియోగం
- బంకులు, సిమ్‌కార్డు డిస్ట్రిబ్యూటర్లపై చర్యలకు యోచన
- నలుగురు నిందితుల పోలీసు కస్టడీ ఆదివారంతో పూర్తి

వాళ్లూ నిందితులుగా మారే చాన్స్..



చక్రధర్ మోసాల్లో ఇలా ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు అందించిన వారితో పాటు వ్యాలెట్స్‌లోని డబ్బును నగదుగా మార్చి ఇచ్చిన వారి పాత్ర ఉన్నట్లేనని అధికారులు చెప్తున్నారు. బాధితుల నుంచి కాజేసిన డబ్బును చక్రధర్ నేరుగా తీసుకోవడం, తన లేదా తన కాల్ సెంటర్ బ్యాంకు ఖాతాల్లో వేయించుకునే ప్రయత్నం చేయలేదు. వ్యాలెట్స్‌లో వేయించి, వాటి నుంచి ఏడు పెట్రోల్ బంకుల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించాడు. వారికి కమీషన్ చెల్లించి ఆ మొత్తాలు తీసుకున్నాడు. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న దర్యాప్తు అధికారులు ఈ స్కామ్‌లో సిమ్‌కార్డులు అందించిన వాళ్లు, పెట్రోల్ బంకులకు చెందిన వాళ్లూ నిందితులుగా మారుతారని చెప్తున్నారు. వాళ్ల ఆచూకీ కనిపెట్టిన తర్వాత నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. వారిచ్చే సమాధానంతో పాటు దర్యాప్తులో లభించే ఆధారాలను బట్టి వారిపై న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలతో పాటు ఇతర చర్యలు తీసుకోనున్నారు.

కేంద్రానికి పేరు వస్తుందనే..

- ఆయుష్మాన్ భారత్ అమలుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

బౌద్ధనగర్: భారత ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం తెలంగాణలో అమలు కాకపోవటం బాధాకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ పథకంతో కేంద్రానికి పేరువస్తుందనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయటం లేదన్నారు. ఆదివారం రాత్రి ఆయన వారాసీగూడ చౌరస్తాలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి మెడికల్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ అందుబాటులో తక్కువ ధరలకే జనరిక్ మెడిసిన్ అందించాలనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం దేశంలో 9 వేల జనరిక్ మెడికల్ షాపులను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సుమారు 30 శాతం మందులకు ఖర్చు చేస్తున్నారన్నారు. బ్రాండెడ్ ధరలకంటే 50 నుంచి 90 శాతం తక్కువ ధరలో జనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనరిక్ మెడికల్ షాపులను ప్రజలు ఆదరించాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ పథకం అన్ని రాష్ట్రాలలో అమలవుతోందని, ఈ పథకంతో రూ.5లక్షల విలువైన వైద్యాన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా పొందవచ్చునన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయకుండా అడ్డుపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్యాంమ్‌సుందర్, కందాడి నాగేశ్వర్ రెడ్డి, బండ చంద్రారెడ్డి,మద్దెల శ్యామ్ సుందర్, అదం విజయ్‌కుమార్, ప్రధాన మంత్రి భారతీయ జనఔషాధీ కేంద్ర మేనేజింగ్ డైరెక్టర్ గోపు రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనరిక్ మెడికల్ షాప్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

'మత్తు' వలలో మహిళలు

- పార్టీలో సరదాగా మొదలై వ్యసనంగా మారి పెడ్లర్లుగా మారుతున్న మహిళలు
- ఐటీ ఉద్యోగులు, సెలబ్రిటీలే లక్ష్యంగా డ్రగ్స్ సరఫరా

సాక్షి, సిటీబ్యూరో: మాదక ద్రవ్యాల సరఫరాలో ఇప్పటివరకు మగవారి ఆధిపత్యమే కనిపించేది. కానీ, ఇటీవలి కాలంలో ట్రై కమిషనరేట్ల పరిధిలో మహిళా పెడ్లర్లు కూడా పట్టుబడుతున్నారు. గత ఏడాది సిటీ పోలీసులు డ్రగ్ చాక్లెట్ బార్స్ ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో బార్స్ ను కొనుగోలు చేసిన 120 మందిలో 50 శాతం మంది యువతులే కావడం విశేషం. వీరంతా 18–24 ఏళ్ల లోపు అమ్మాయిలే కావటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందిది.

ఏడాదిలో 1,200 మందికి పైగానే...

ఏడాది కాలంలో నగరంలో సుమారు 1,200 మంది డ్రగ్స్ వినియోగదారులను పోలీసులు గుర్తించగా... వీరిలో 100–150 మంది మహిళలే ఉన్నారు. తాజాగా సైబరాబాద్ పోలీసులు ఛేదించిన హైటెక్ వ్యభిచారం కేసులో నిందితులు అమ్మాయిలకు డ్రగ్స్ సరఫరా చేసి, వ్యభిచారం రొంపిలోకి దింపుతున్నట్లు గుర్తించారు. మరో డ్రగ్ కేసులో హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన జతిన్, జావేద్ కూడా అమ్మాయిలకు డ్రగ్స్ అలవాటు చేసి లైంగిక అవసరాలు తీర్చుకుంటున్నట్లు తేలింది.

పబ్బుల్లో మత్తు లోకం...

మెట్రో నగరాల్లో వీకెండ్ వస్తే చాలు ఐటీ ఉద్యోగులు, యువతీ యువకులు పబ్బుల్లో పార్టీ చేయడం కామన్. దీనిని ఆసరాగా చేసుకుని డ్రగ్ పెడ్లర్లు పబ్బుల్లో కొకైన్, హెరాయిన్, ఎండీఎంఏ, ఎక్కటసి పిల్స్, హాష్ సిగరెట్లను సరఫరా చేస్తూ యువతకు డ్రగ్స్ అలవాటు చేస్తున్నారు. తాజాగా డ్రగ్ కేసులో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన నైజీరియన్ విక్టర్ నగరంలో వ్యక్తిగత కస్టమర్లకు డ్రగ్స్ సరఫరా చేయడంతో పాటు డ్రగ్స్ పార్టీలు సైతం నిర్వహించేవాడని సైబరాబాద్ పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. శివారు ప్రాంతాల్లోని ఫామ్ హౌస్‌లు, రిసార్టుల్లో పెద్ద సంఖ్యలో యువతతో మత్తు పార్టీలు నిర్వహించేవాడు. సరదాగా మొదలైన డ్రగ్స్ వ్యసనంగా మారడంతో మత్తులోకంలోనుంచి బయటకు రాలేక కొందరు యువత నేరాలకు సైతం పాల్పడుతున్నారు. వీరి పరిస్థితిని ఆసరా చేసుకుని డ్రగ్ కింగ్ పిన్స్ యువతను పెడ్లర్లుగా వాడుకుంటున్నారు. వీరితో సెలబ్రిటీలు, ఐటీ ఉద్యోగులకు డ్రగ్స్ సరఫరా చేయిస్తున్నారు.

అల్లం, వెల్లుల్లి పేస్ట్ నుంచి కూల్ డ్రింక్స్ దాకా..



స్వాధీనం చేసుకున్న అల్లం,వెల్లుల్లి పేస్ట్

- రసాయనాలతో అల్లం, వెల్లుల్లి పేస్ట్ శీతల పానీయాల తయారీ
- పరిశ్రమపై ఎస్‌ఓటీ దాడులు
- ఇద్దరు నిర్వాహకుల అరెస్ట్



పరిశ్రమలో భారీ యంత్రాలు

రాజేంద్రనగర్: ఎలాంటి అనుమతులు లేకుండా పరిశ్రమను నిర్వహించడమేగాక రసాయనాలతో అల్లం వెల్లుల్లి పేస్ట్, శీతల పానీయాలు(కూల్‌డ్రింక్స్) తయారు చేస్తున్న కర్మాగారంపై ఆదివారం రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 500 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, మ్యాంగో డ్రింక్, 210 లీటర్ల అసిటిక్ యాసిడ్, 550 కిలోల మసాలా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇద్దరు నిర్వాహకులను అరెస్టు చేసి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాటేదాన్ శాంతినగర్‌లో ఫిరోజ్, అజిత్ గత రెండేళ్లగా ఎలాంటి అనుమతులు లేకుండా ఉమ్మాని ఫుడ్ కంపెనీ పేరుతో పరిశ్రమను నిర్వహిస్తున్నారు.

సదరు పరిశ్రమలో అల్లం, వెల్లుల్లి పేస్ట్‌తో పాటు మ్యాంగో, ఆరెంజ్ జ్యూస్‌తో పాటు ఫుడ్ మసాలాలను తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అల్లం, వెల్లుల్లి పేస్ట్‌లో కేవలం వెల్లుల్లి పొట్టును మాత్రమే వినియోగిస్తుండటం గమనార్హం. అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో రెండు సంవత్సరాలుగా అల్లమే వాడకుండా తయారు చేస్తున్నారు. ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసిన సమయంలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న పదార్థాలే కనిపించాయి. శీతల పానీయాలను తయారు చేసేందుకు మురుగునీటిని వాడుతున్నారని, ఫ్లేవర్ల కోసం రసాయనాలను వినియోగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. రెండేళ్లుగా నిందితులు ఎలాంటి అనుమానం రాకుండా పరిశ్రమను నిర్వహించడం గమనార్హం. భారీ యంత్రాలతో పెద్ద ఎత్తున ఉత్పత్తులు చేస్తున్న వీరు రాష్ట్ర వ్యాప్తంగా వాటిని సరఫరా చేసినట్లు వెల్లడైంది. నిందితులను అదుపులోకి తీసుకుని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఫుడ్ మసాలాలు

అధునాతన యంత్రాల వినియోగం...

అల్లం, వెల్లుల్లి పేస్ట్‌తో పాటు గరంమసాలాలు, శీతల పానీయాల మిక్సింగ్, ప్యాక్ చేసేందుకు నిందితులు అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు. పదుల సంఖ్యలో ఉన్న ఈ యంత్రాల ద్వారా ప్రతి రోజు రూ. లక్షల విలువైన మసాలాలు, అల్లం పేస్ట్, శీతల పానీయాలను తయారు చేస్తున్నారు. ఈ ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశామని, స్వాధీనం చేసుకున్న పదార్థాలను ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

రామానుజ విగ్రహ ఊరేగింపును అడ్డుకోవడం దారుణం

పంజగుట్ట: రామానుజ జయంతి ఉత్సవాల్లో భాగంగా రామానుజ ఉత్సవ విగ్రహాన్ని తిరుచానూరు మాడవీధుల్లో ఊరేగిస్తుండగా టీటీడీ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడ్డుకోవడం దారుణమని ఆల్ ఇండియా చాత్తాద శ్రీ వైష్ణవ కాన్ఫెడరేషన్ అధ్యక్షులు తిరుక్కొవళ్లూరి రామానుజం అన్నారు. అప్రతిష్టను తొలగించేందుకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భగవత్ రామానుజ స్వామి విగ్రహానికి సంప్రోక్షణ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కర్పూరం రాజేందర్, తెలంగాణ ప్రతినిధి రఘు సతీష్‌కుమార్ మాట్లాడుతూ .. ఎన్నో ఏళ్లుగా రామానుజ విగ్రహాన్ని మాడవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అయితే ఈ ఏడాది పోలీసులు శోభాయాత్రను అడ్డుకోవడం బాధాకరమన్నారు. దీనిపై టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మరో మారు ఇలాంటి ఘటనలు జరక్కుండా చర్యలు తీసుకుంటామని చెప్పినా, లిఖితపూర్వకంగా హామీ ఇవ్వలేదన్నారు. ఇకపై ఏటా ఎలాంటి అభ్యంతరాలు లేకుండా మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని లేని పక్షంలో అలిపిరి నుంచి తిరుచానూరు వరకు లక్ష మందితో నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. తమ సంఘం దేశంలోని 12 రాష్ట్రాల్లో విస్తరించిందని, సుమారు 10 లక్షల మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిల భారత చాత్తాద శ్రీ వైష్ణవ సమాఖ్య సెంట్రల్ కార్యాలయం కోసం ఎకరం స్థలం, రూ. కోటి విరాళం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి తమకు సమయం ఇస్తే 12 రాష్ట్రాల ప్రతినిధులతో వెళ్లి ఆయనను కలుస్తామన్నారు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు మాచవనం వెంకటేశ్వర్లు, కిషన్, రాజేశం, మధుసుధన స్వామి, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



రామానుజ విగ్రహానికి సంప్రోక్షణ చేస్తున్న చాత్తాద వైష్ణవ సమాఖ్య ప్రతినిధులు

క్లుప్తంగా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

అమీర్‌పేట: తలనొప్పి భరించలేక ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా, కొత్తపల్లికి చెందిన శివప్రసాద్‌రెడ్డి (22) మెదడు సంబంధిత సమస్య కారణంగా గత కొంత కాలంగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నాడు. గతంలో ఓ సారి శస్త్ర చికిత్స చేయించుకున్నా నొప్పి తగ్గలేదు. నెల రోజుల క్రితం అతను ఎల్లారెడ్డిగూడ్‌లోని ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. వారు ఇటీవల బంధువుల ఇంట్లో శుభకార్యంలో పాల్గొనేందుకు అనంతపురం వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శివప్రసాద్‌రెడ్డి తలనొప్పి భరించలేక శనివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 'నాలుగు రోజులుగా తలనొప్పి భరించలేకపోతున్నానని, అమ్మా, నాన్న తనను క్షమించాలని, మీరందరూ బాగుండాలని' సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

భార్య డబ్బులు ఇవ్వలేదని..

భర్త ఆత్మహత్య

బంజారాహిల్స్: భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... యూసుఫ్‌గూడ సమీపంలోని కార్మికనగర్‌లో నివసించే మల్లయ్య(42) ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతడి భార్య రత్న కుమార్తెతో సహా వేసవి సెలవులకు పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 5న మల్లయ్య ఆమెకు ఫోన్ చేసి డబ్బులు కావాలని అడిగాడు. డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఈ నెల 6న కూడా రెండుసార్లు ఫోన్ చేసి డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. అందుకు ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి లోనైన మల్లయ్య శనివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం లేకుండానే గోల్డ్‌లోన్

అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ నిర్వాకం

బంజారాహిల్స్: బంగారం లేకుండానే గోల్డ్‌లోన్ తీసుకోవడమే కాకుండా తనిఖీల్లో బయటపడకుండా మరో ఖాతాదారుడి ఫిక్స్‌డ్ డిపాజిట్ క్లోజ్ చేసి డబ్బులు చెల్లించి చీటింగ్‌కు పాల్పడిన అసిస్టెంట్ మేనేజర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో నివసించే దారంసోత్ రవికుమార్ ప్రశాసన్‌నగర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసైన అతను పెద్ద మొత్తంలో నష్టపోయాడు. ఈ నేపథ్యంలో తాను పని చేస్తున్న బ్యాంకులో బంగారు కుదవ పెట్టకుండానే పెట్టకుండానే తన భార్య, బంధుమిత్రుల పేర్లపై గోల్డ్ లోన్ తీసుకున్నాడు. ఇటీవల గోల్డ్‌లోన్‌కు సంబంధించిన ఆడిట్ సిబ్బంది అకౌంట్‌ను పరిశీలించేందుకు రాగా తన బండారం బయటపడకుండా అప్పటికప్పుడే అదే బ్యాంకులో ఖాతాదారుడికి చెందిన రూ. 50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ అకౌంట్‌ను రద్దు చేసి ఆ మొత్తాన్ని బ్యాంక్‌లో జమ చేసి గోల్డ్ లోన్ అకౌంట్ క్లోజ్ చేసుకున్నాడు. తనకు తెలియకుండానే ఎఫ్‌డీ క్లోజ్ చేసిన విషయాన్ని గుర్తించిన ఖాతాదారుడు బ్యాంకు సీనియర్ మేనేజర్ శివకుమార్ దృష్టికి తీసుకొచ్చాడు. ఆరా తీయగా రవి కుమార్ చేసిన గోల్డ్‌లోన్ గుట్టురట్టయింది. గతంలోనూ అతను బ్యాంకు నుంచి రూ.26.82 లక్షలు గోల్డ్‌లోన్ పేరుతో తీసుకుని మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మేనేజర్ శివకుమార్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ పీఎస్‌లో రేవంత్ రెడ్డి ఫిర్యాదు



బంజారాహిల్స్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తో పాటు ఆయన కుటుంబ సభ్యులను హత్య చేస్తా మ ని బెదిరించిన మణికంఠ నరేంద్ర రాథోడ్‌పై చర్య లు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు ఆదివారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. తక్షణం రాథోడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిని కిడ్నాప్‌నకు విఫలయత్నం

ఐదుగురిపై కేసు నమోదు..

సనత్‌నగర్: ఆర్టీసీ బస్సులో నుంచి దిగుతున్న ఓ విద్యార్థినిని ఆటోలో కిడ్నాప్ చేసేందుకు యత్నించిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. అప్రమత్తమైన ప్రయాణికులు నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట ప్రాంతానికి చెందిన విద్యార్థిని (19) ఖైరతాబాద్‌లోని ఓ కళాశాలలో చదువుకుంటోంది. రోజూ మాదిరిగానే కళాశాలకు వెళ్లిన ఆమె శనివారం సాయంత్రం ఖైరతాబాద్ బస్టాపులో బస్సు కోసం ఎదురుచూస్తూ తన స్నేహితురాలితో మాట్లాడుతుంది. అదే సమయంలో గుర్తుతెలియని ఓ యువకుడు ఆమెను వీడియోలో చిత్రీకరించాడు. అక్కడి నుంచి 49ఏ బస్సు ఎక్కి బేగంపేటలోని హెచ్‌పీఎస్ బస్టాప్‌లో దిగుతుండగా ఆటోలో వచ్చిన ఐదుగురు వ్యక్తులు బస్సు ముందు ఆటోను అడ్డుగా పెట్టి విద్యార్థినిని బలవంతంగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన బస్సు కండక్టర్, ప్రయాణికులు, స్థానికులు వారిని పట్టుకుని 100 కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీమా బాసిత్ అహ్మద్, సోఫియా తాజ్ , హలీమా బజబర్, మహ్మద్ అలీ సోమాలీ, మహ్మద్ ఫహద్ అలీ లను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెషిన్‌లో చెయ్యి ఇరుక్కుని బాలికకు తీవ్ర గాయాలు



బాధితురాలు మెహ్‌విష్ లుబ్నా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని సిటీ సెంటర్ మాల్‌లోని ప్లేజోన్‌లో ఆడుకుంటున్న ఓ చిన్నారి (03) మెషిన్‌లో చెయ్యి ఇరుక్కుని చేతి వేళ్లు తెగిపోయిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఇబ్రహీంనగర్‌కు చెందిన సయ్యద్ మక్సూద్ అలీ ఆదివారం మధ్యాహ్నం తన భార్య, కుమార్తె మెహ్‌విష్ లుబ్నా (3)తో కలిసి సిటీ సెంటర్ మాల్‌కు వెళ్లాడు. నాల్గో అంతస్తులో ఉన్న ప్లేజోన్‌లో ఆడుకుంటుండగా చిన్నారి చేతి వేళ్లు మెషిన్‌లోకి వెళ్ళాయి. క్షణాల్లోనే ఆమె చేతి వేళ్లు తెగిపోయి తీవ్ర రక్తస్రావం జరిగింది. ఈ మెషిన్ నడుస్తున్న విషయం తెలియకపోవడంతో చిన్నారి అక్కడికి వెళ్ళగా ఈ ఘటన చోటు చేసుకుంది. సిటీ సెంటర్ మాల్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ బాధితురాలి తండ్రి మక్సూద్ అలీ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నారిని చికిత్స నిమిత్తం యశోదా ఆస్పత్రికి తరలించారు. అక్కడ సీసీ ఫుటేజీలు పరిశీలించగా ఈ ఘటనకు సంబంధించి ఫుటేజీలు పూర్తిగా తొలగించారని ఆరోపించారు. బంజారాహిల్స్ పోలీసులు మాల్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్జరీ పత్రాలతో ఎన్‌ఆర్‌ఐ స్థలం స్వాహా




పోలీసుల అదుపులో నిందితులు

ఆరుగురు వ్యక్తుల అరెస్ట్

మల్కాజిగిరి: ఫోర్జరీ పత్రాలతో ఎన్‌ఆర్‌ఐకి చెందిన స్థలాన్ని కాజేసిన ఆరుగురు వ్యక్తులను మల్కాజిగిరి పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐ హరి ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మౌలాలి తిరుమల్‌నగర్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ ఉషకు మౌలాలి వసంతవిహార్ కాలనీలో 276 గజాల స్థలం ఉంది. 2011లో దానికి ప్రహరీ నిర్మించి గేట్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరిలో ఆమె ఇండియాకు తిరిగి వచ్చింది. గత నెల 20న ఆమె పక్కింట్లో ఉంటున్న రాజు ఓ స్థలం విక్రయానికి ఉన్నట్లు తెలుసుకొని ఆమెకు సమాచారం అందించాడు. అదే నెల 23న ఈసీ తీసుకోగా అందులో తన వివరాలు కనిపించాయి. 28న స్థలం వద్దకు వెళ్లి చూడగా గేట్‌కు వేసిన తాళాలు మార్చినట్లుగా గుర్తించింది. 29న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి చూడగా అదే నెల 24న సదరు స్థలం ఉప్పల్‌కు చెందిన రాజు పేరిట రిజిష్టర్ అయినట్లుగా గుర్తించి మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాజుతో పాటు హబ్సిగూడకు చెందిన జావేద్, ఉప్పల్‌కు చెందిన యాదగిరి, కానాజిగూడకు చెందిన హరిప్రసాద్, హబ్సిగూడకు చెందిన నసీరుల్లా, మౌలాలికి చెందిన షానవాజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'డైమండ్స్ ఆర్ ఫర్ ఎవర్, సో ఆర్ మోరల్స్' పుస్తకావిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే ప్రముఖ వజ్రాల వ్యాపారి గోవింద్ ధోలాకియా ఆత్మకథ, 'డైమండ్స్ ఆర్ ఫరెవర్, సో ఆర్ మోరల్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం నగరంలోని లోయర్ ట్యాంక్‌బండ్ సమీపంలోని మారియట్ గోల్డ్ హోటల్‌లో జరిగింది, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ - ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ)హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు చెందిన శ్రీ పటీదార్ సమాజ్ (ఎస్‌పీఎస్‌హెచ్) లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ (ఎల్‌సిఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తం రూపాలా, ముఖ్య అతిథిగా హాజరై ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత, గతంలో డాక్టర్ అబ్దుల్ కలాం 'వింగ్స్ ఆఫ్ ఫైర్' కూడా రాసిన శాస్త్రవేత్త అరుణ్ తివారీ మాట్లాడుతూ పుస్తక రచనకు తనకు స్ఫూర్తినిచ్చిన అంశాలను వివరించారు. తన ఆత్మకథ పాఠకులకు మంచి సందేశాత్మకం కాగలదని ఆశాభావం వ్యక్తం చేసిన గోవింద్ ధోలాకియా పుస్తకాన్ని ఇప్పటికే లండన్, సూరత్, ఢిల్లీ, కొచ్చిలలో ఆవిష్కరించామని, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రోబోటిక్ సర్జన్ డా.చిన్నబాబు, ఎల్‌సిఎఫ్ చైర్మన్ జస్మత్ పటేల్, పటిదార్ సమాజ్ ఉపాధ్యక్షుడు మహేష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా...

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

లిబర్టీ: సాహిత్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన గొప్ప రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ అని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ అన్నారు. ప్రపంచంలోనే రవీంద్రనాథ్ ఠాగూర్ రచయితగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి పురస్కరించుకుని లిబర్టీ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర ఉద్యమం ఉవ్వెత్తుగా సాగుతున్న క్రమంలో జనగణ గీతాన్ని రచించి దేశ ప్రజల హృదయాలను ఉత్తేజాన్ని నింపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, అరుణరెడ్డి, నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సేవలు మరువలేనివి

లిబర్టీ: బ్రిటిష్ సామ్రాజ్య వాదులను తరిమికొట్టడంలో అల్లూరి సీతారామరాజు కీలకపాత్ర పోషించారని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. దోపిడీ, అణచివేతకు గురవుతున్న ప్రజలను సమైక్యం చేసి పోరాటం చేసిన గొప్ప యోధుడని కొనియాడారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి గడగడలాడించిన యోధుడని తెల్లదొరల పాలన నుంచి ప్రజలు, దేశాన్ని విముక్తి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లీలావతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ స్టేడియానికి తరలిన బీఎస్పీ నేతలు

బంజారాహిల్స్: సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం జరిగిన చలో హైదరాబాద్ తెలంగాణ భరోసా సభకు తెలంగాణ ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. దారిపొడవునా బీఎస్పీ జిందాబాద్ నినాదాలతో దద్దరిల్లింది. బంజారాహిల్స్ డివిజన్ బీఎస్పీ అధ్యక్షుడు గద్దెల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి బైండ్ల శ్రీనివాస్, జానకిరాం, ప్రతాప్, ప్రశాంత్, టి.స్వామి ఆధ్వర్యంలో బీఎస్పీ జెండాలు ఎగురవేస్తూ ర్యాలీగా వెళ్లారు.

ప్రజా సమస్యలపై పోరాడతా



స్థానికులతో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

వెంగళరావునగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని టీ–హోప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. జాగో జూబ్లీహిల్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహానగర్, ప్రగతినగర్, నవోదయకాలనీ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారంపై దృష్టి సారిస్తున్నామన్నారు. స్థానికంగా డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట భాస్కర్‌రెడ్డి, కొండపల్లి రమేష్, చంద్రమౌళి, యాదగిరి, వడ్డెర వెంకటేష్, మురళీకృష్ణ, మాణిక్యం ఉన్నారు.

అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కాలేజీలు, గురుకుల విద్యా సంస్థల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు నెలసరి వేతనాలు చెల్లించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య సంస్థల్లో పేద విద్యార్థులకు బోధిస్తున్న అతిథి అధ్యాపకులకు కేవలం 72 గంటల వేతనం చెల్లించడం దారుణమన్నారు. అధ్యాపకులకు చెల్లించే వేతనాలు కుటుంబ అవసరాలు తీరక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ అతిథి అధ్యాపకుల వేతనాల చెల్లింపు పై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

సన్మానం



సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తోట మణిమాలను హాథ్ సే హాథ్ యాత్ర సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటంరెడ్డి వినయ్‌రెడ్డి సన్మానించారు. అమీర్‌పేట జిజ్ఞాస స్టూడియోలో జరిగిన నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో ఆమెను శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి తెలుపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలన్నారు.

కొత్త ఠాణాలు రెడీ

- నూతనంగా ఫిలింనగర్, మధురానగర్, మాసబ్‌ట్యాంక్, బోరబండ పోలీస్ స్టేషన్లు
- ముమ్మరంగా సదుపాయాలు
- త్వరలోనే కమిషనర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- రెండు, మూడ్రోజుల్లో కొత్త సీఐలు, డీఐలు, ఎస్‌ఐలు



రూపుదిద్దుకుంటున్న ఫిలింనగర్ పోలీస్ స్టేషన్

బంజారాహిల్స్: దశాబ్దాల క్రితం ఏర్పాటైన పోలీస్ స్టేషన్లతో పెరిగిన కాలనీలు, బస్తీలు, జనాభాతో బాధితులు, ఫిర్యాదుదారులు దూరాభారంతో ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న ఠాణా మెట్లు ఎక్కాలంటే చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్‌ఆర్‌నగర్, పంజగుట్ట పోలీస్ స్టేషన్ల పరిధి విపరీతంగా ఉండటం ఏదైనా సమస్య వస్తే ఫిర్యాదు చేయడానికి ఠాణాకు రావాలంటే కొంత మంది 10–12 కిలోమీటర్లు రావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే కొత్త ఠాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నుంచి కొంత భాగాన్ని విడగొట్టి కొత్తగా ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి కొంత భాగాన్ని విభజించి మధురానగర్, బోరబండ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్లు ఆయా ప్రాంతాల పరిధిలోనే ఉండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే వీటిని ప్రారంభిస్తారని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

ఠాణాల ప్రాంతాలివే..

- ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌ను ఫిలింనగర్ కాలనీలోని సాయిబాబా గుడిని ఆనుకొని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.
- మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ కోసం కొన్ని ప్రాంతాలు ఎంపిక చేశారు. అయితే మినిస్టర్ క్వార్టర్స్ ఆవరణలో ఉన్న బంజారాహిల్స్ పోలీస్ అవుట్‌పోస్ట్‌లో తాత్కాలికంగా కొనసాగించాలని నిర్ణయించారు.
- మధురానగర్ పోలీస్ స్టేషన్‌ను ప్రస్తుతం కొనసాగుతున్న రహ్మత్‌నగర్ అవుట్‌పోస్ట్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మౌలిక సదుపాయాల కల్పన వేగవంతంగా జరుగుతుంది.
- బోరబండ పోలీస్ స్టేషన్‌ను ప్రస్తుతం కొనసాగుతున్న బోరబండ అవుట్‌పోస్ట్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ కూడా పనులు చురుగ్గా సాగుతున్నాయి.

కొత్త సీఐలు..

కొత్తగా ఏర్పాటు కాబోతున్న ఫిలింనగర్, మాసబ్ ట్యాంక్, మధురానగర్, బోరబండ పోలీస్ స్టేషన్లకు నలుగురు కొత్త సీఐలు, నలుగురు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు నియామకం కానున్నారు. అలాగే ఎస్‌ఐల సర్దుబాటు కూడా ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. కొత్త పోలీస్ స్టేషన్లకు కొంత ఎక్కువ మంది ఎస్‌ఐల అవసరం ఉండటంతో వారిని కూడా కేటాయిస్తున్నట్లు సమాచారం.ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా ఎస్‌ఐలు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఓట్లేసి తప్పుచేశాం!

- మురుగు సమస్యపై స్పందించని ప్రజాప్రతినిధులు, అధికారులు
- స్థానికులే వ్యర్థాలను తొలగించిన వైనం
- ఓట్లు వేసి తప్పుచేశామంటూ సోషల్ మీడియాలో పోస్టులు, ఫొటోలు వైరల్



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డినగర్ అభయాంజనేయ స్వామి గుడి ముందు రెండు వారాలు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు లీకవుతూ రోడ్లన్నీ మురుగుతో దుర్గంధంగా మారాయి. ఆలయం వెనుక రోడ్డు నుంచి కూడా డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండిపోయి రోడ్డు కింద నుంచి గుడిలోకి మురుగు నీరు వస్తుంది. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో బస్తీవాసులే మ్యాన్‌హోళ్లలోకి దిగి వ్యర్థాలను తొలగించారు. ఆదివారం స్థానిక మహిళలు కర్రలతో మ్యాన్‌హోళ్లలో తట్టుకున్న వ్యర్థాలు, రాళ్లు, బురద, మట్టిని తొలగించి మురుగు సాఫీగా పారేలా చేశారు. 'ఓట్లు వేసి గెలిపించుకున్న ప్రజాప్రతినిధులకు ఫోన్‌చేస్తే ఒక్కరు కూడా స్పందించడం లేదని ఓట్లు వేసి తప్పు చేశామంటూ' బస్తీకి చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానికులే డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలోకి దిగి వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యాలు సోషల్ సోషల్ మీడియాలో పెట్టారు.



డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలను తొలగిస్తున్న బస్తీవాసులు

'గౌడ కులస్తులను విస్మరించడం తగదు'



అభివాదం చేస్తున్న గౌడ సంఘాల ప్రతినిధులు

పంజగుట్ట: కల్లు పరిశ్రమను నాశనం చేసి నీరా పరిశ్రమ తీసుకువచ్చానని ప్రచారం చేసుకోవడం తల్లిని చంపి బిడ్డను బతికించినట్లు ఉందని జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావు గౌడ్ అన్నారు. కల్లు పరిశ్రమ లేకుండా నీరా పరిశ్రమ ఎక్కడిదని, ఒక గ్రామంలో వందమంది కల్లుతాగే వారుంటే 10 మంది కల్లు గీసే వారు ఉంటారని.. వందమంది కల్లు తాగేవారిని విస్మరించి 10 మంది కల్లుగీసే గౌడ్‌లను నీరావైపు తీసుకువస్తే ఈ వంద మందిని లిక్కర్‌కు అలవాటు చేయాలనే కుట్ర ప్రభుత్వానిదని దుయ్యబట్టారు. జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో కల్లు నీరా తెలంగాణ ప్రభుత్వ పథకాలపై అఖిలపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు గౌడ్ మాట్లాడుతూ.. 9 ఏళ్ల తర్వాత కార్పొరేషన్ ఏర్పాటు చేశారని దానికి నిధులు లేవు ఇప్పుడు ఆయన వచ్చి ఏం చేస్తాడని ప్రశ్నించారు. నలుగురు గౌడ కులస్తులు ఎమ్మెల్సీలుగా పదవులు పూర్తయ్యాయి తిరిగి వారికి పదవులు ఇవ్వలేదని, ఉద్యమంలో కీలకంగా ఉన్న స్వామిగౌడ్, బూర నర్సయ్య గౌడ్, బూడిద భిక్షమయ్య గౌడ్ విస్మరించారన్నారు. అన్ని కులాలకు అభివృద్ధికోసం నిధులు ఇస్తుంటే మాకు మాత్రం చనిపోయిన తర్వాత రూ. 5 లక్షలు ఇస్తామంటున్నారని చనిపోయాక సమాధులు కట్టుకునేందుకు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. గౌడ సహకార సంఘం జాతీయ అధ్యక్షులు ఎం.సత్యం గౌడ్, వైఎస్‌ఆర్‌టీపీ ప్రధాన కార్యదర్శి గట్టు రామచందర్ రావు, మహిళా నాయకురాలు అనురాధా గౌడ్ మాట్లాడుతూ .. చెట్టుపై నుండి పడి చనిపోయిన వారికి పరిహారం ఇస్తే ఇన్సురెన్స్ ఇవ్వం, ఇన్సురెన్స్ ఇస్తే పరిహారం ఇవ్వమనడం దారుణమన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, పల్లె ఉపేందర్ గౌడ్, చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, స్వామి, నరేష్, ప్రసాద్, రఘు పాల్గొన్నారు.

కార్యాలయానికి రాకుండానే జీతాలు

డి.ప్రీతంసింగ్

లిబర్టీ: కార్యాలయానికి రాకుండానే మున్సిపల్ ఉద్యోగులు వేతనాలు పొందుతున్నారని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ఆరోపించారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని సర్కిల్–16 టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉన్నతాధికారులు అండదండలతో ఆ విభాగంలో పని చేసే ఉద్యోగులు కార్యాలయం రాకుండానే జీతాలు పొందుతున్నారని ఈ విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, విజిలెన్స్ ఏసీబీ అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నిరంతరంగా శ్రమిస్తూ అనేక పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సిబ్బందిని అధికారులు పట్టించుకోవడం లేదు కానీ.. పని చేయకుండానే జీతాలు పొందుతున్న వారికి ఉన్నతాధికారులు సహకరించడం దారుణం అన్నారు.

చిన్నారితో అసభ్య ప్రవర్తన

యువకుడిపై కేసు

పంజగుట్ట: ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం.. ఓ బైక్ క్యాబ్ డ్రైవర్ శనివారం రాత్రి సుమారు 10.30 లకు ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్ వద్ద కస్టమర్‌ను పికప్ చేసుకుంటున్న క్రమంలో అక్కడ ఓ యువకుడు చిన్నారిపట్ల అసభ్యంగా ప్రవర్తించడం గమనించాడు. ఏం చేస్తున్నావని ప్రశ్నించగా సదరు బాలిక తన కూతురు అని చెప్పాడు. అనుమానం వచ్చిన బైక్ క్యాబ్ డ్రైవర్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడకు చేరుకున్న పోలీసులు బాలికను ప్రశ్నించగా ప్రైవేట్ భాగాల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని పేరు అఫ్రోజ్‌ఖాన్ (19) పండ్ల వ్యాపారిగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ పోలీసులకు రివార్డులు



రివార్డు అందుకుంటున్న సీఐ నరేందర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు చుట్టూ జీహెచ్ఎంసీ వాక్‌వేలో 152 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినందుకు బంజారాహిల్స్ సీఐ ఎం. నరేందర్‌ను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ రివార్డుతో సత్కరించారు. కేబీఆర్ పార్కు చుట్టూ వివిధ సంస్థల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అలాగే బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ క్రైం విభాగంలో పని చేస్తున్న కానిస్టేబుల్ బైరు నీరజ్‌కుమార్, హోం గార్డు షేక్ జానిమియాలకు కూడా రివార్డులు అందజేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్ చౌరస్తాలో గుర్తు తెలియని మహిళ ఓ ఇంట్లోకి చొరబడి రూ. 5 లక్షల నగదుతో ఉడాయించగా సమాచారం అందుకున్న క్రైం పోలీసులు నీరజ్, జానిమియా ఇద్దరూ సుమారుగా 20 వరకు సీసీ కెమెరాలను పరిశీలించి దొంగతనానికి యత్నించిన మహిళను 24 గంటల్లోనే గుర్తించారు.

'నమో హైదరాబాద్ లోగో' ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: ప్రధాని నరేంద్ర మోదీ పథకాలకు స్ఫూర్తి పొందిన హైదరాబాద్‌కు చెందిన యువత గ్రూప్‌గా ఏర్పాటై నమో హైదరాబాద్‌ను స్థాపించారు. ఈ లోగోతో పాటు వెబ్‌సైట్‌ను ఆదివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో బీజేపీ జాతీయ మహిళా మోర్చా సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని, సంస్థ అధ్యక్షులు ఆజాద్‌బాబు, కన్వీనర్ అశోక్ పట్నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆజాద్‌బాబు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఉన్న యువత దగ్గరకు మోదీ భావజాలాన్ని తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దామని ఇందుకు హైదరాబాద్‌ను వేదికగా చేసుకున్నామన్నారు.

కొనసాగుతున్న పూడికతీత పనులు

రాంగోపాల్‌పేట్: కళాసీగూడ నాలాలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఈ నాలాలో బాలానగర్ బస్టాప్ నుంచి ఆర్పీరోడ్‌లోని బ్రిడ్జి వరకు చేపట్టిన పనులను వారం క్రితమే ప్రారంభం అయ్యాయి. సుమారు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ నాలా పరివాహక ప్రాంతంలో మరింత కుంచించుకుని పోయి ఉండటంతో పూడికతీత చేపట్టడం కష్టంగా మారింది. దీంతో మనుషులతోనే నాలాలోని పూడికను తొలగిస్తుండటంతో కొంత జాప్యం జరుగుతుంది. వర్షాకాలం మొదలయ్యే లోపు నాలాలో పూడికతీత పూర్తి చేయాల్సి ఉండగా మరో వారం రోజుల్లో ఈ పనులు పూర్తి అవుతాయని ఏఈ రవీందర్ తెలిపారు. పూడికతీత పనులు పూర్తయితే లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు సమస్య ఉండదన్నారు.

బోర్ వేస్తే రంగు నీళ్లు వస్తున్నాయ్!

కలుషిత నీటిపై నూర్‌నగర్ వాసుల ఫిర్యాదు



సమస్యను వివరిస్తున్న నూర్‌నగర్ బస్తీవాసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నూర్‌నగర్‌తో పాటు చుట్టూ ఉన్న నందినగర్, వేంకటేశ్వరనగర్, గురుబ్రహ్మనగర్, ఇబ్రహీంనగర్ బస్తీవాసులతో పాటు సమీపంలోని ఇన్‌కంట్యాక్స్ క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్‌లో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. నూర్‌నగర్‌లో ఇష్టానుసారంగా పార్కింగ్ స్థలాలు, మెట్ల కింద స్థలాలు కూడా ఇటీవల అద్దెలకిస్తూ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం వినియోగిస్తున్న రసాయనాలతో భూగర్భ జలాలను కలుషితం అవుతున్నాయి. బోర్లతో పాటు మంచినీటి పైప్‌లైన్లు కూడా ఈ డయింగ్‌లో వాడుతున్న రసాయనాలతో కలుషితం అవుతూ స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులకు నీళ్లు ఎలా కలుషితం అవుతున్నాయో చూపించారు. ఇక్కడి వ్యాపారాలు రసాయనాలు కలిసిన నీళ్లను బోర్లలో పోసిన దృశ్యాలు చూసిన అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ నీటి కలుషితంపై స్థానికులంతా కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. ప్రతిరోజూ కలుషిత నీటిపై స్థానికులు, వ్యాపారులకు మధ్య, గొడవలు సాధారణం అయ్యాయి. కొంత మంది వ్యాపారులు డయింగ్ తర్వాత వచ్చే నీళ్లను రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లలో పోస్తున్నారు. ఫలితంగా రసాయన వాయువులు స్థానికులకు మరో సమస్యగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని బస్తీవాసులు కోరుతున్నారు.

ప్రజలకు అండగా ఉంటా

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రజలకు తాను అన్ని విధాల అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీగణేష్ అన్నారు. రెజిమెంటల్‌బజార్‌లోని మదర్ మేరీ చాపెల్ ప్రాంతంలో ఆయన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజల మౌలిక వసతుల కల్పన, ఆరోగ్యం కోసం, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తా అన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి, క్లాప్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, బస్తీ నాయకులు సన్నీపాల్, సాయి, మారియో, కార్తీక్, రెజీనా, పాల్గొన్నారు.

నెరవేరనున్న కమలానగర్ వాసుల కల

ఈ నెల 18న 'డబుల్' ఇళ్ల కేటాయింపు



కమలానగర్‌లో సిద్ధమైన ఇళ్ల సముదాయం

రహమత్‌నగర్: కమలానగర్ బస్తీ వాసులు డబుల్ బెడ్రూమ్ కల త్వరలో సాకారం కానుంది. ఈ నెల 18న లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించనున్నారు.దాదాపు ఆరేళ్ల క్రితం ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్ బస్తీలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి ఏడాదిలో పూర్తిచేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. అప్పటి నుండి బాధితులు అద్దె నివాసాల్లో ఉంటూ, డబుల్ ఇళ్ల కోసం ఎదురు చూస్తునే ఉన్నారు.తాజాగా ప్రభుత్వం డబుల్ ఇళ్లను కేటాయించాలని నిర్ణయించడంతో అధికారులు ఏర్పాటు ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారుల ఆదేశాల మేరకు బస్తీ నాయకులు అర్హుల వివరాలు సేకరించారు. ప్రస్తుత రెండు భవనాల్లో నిర్మాణాలు పూర్తి కాగా, ఇందులో 210 నివాసాలు సిద్ధంగా ఉన్నాయి. తామందరికి (146 మంది) ఒకేసారి నివాసాలు కేటాయించాలని బస్తీ నాయకులు పల్లె సాయిలు,కొండాపురం నాగరాజు, పోస్టర్ రాజు, అంతారం యాదగిరి విజ్ఞప్తి చేస్తున్నారు.

గౌరీశంకర్ నగర్ బస్తీ అధ్యక్షుడిగా ముత్తు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీశంకర్ కాలనీ బస్తీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్ష పదవికి వీకే ముత్తు, రాములు ప్యానెల్స్ పోటీ పడగా వీకే ముత్తు 250 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా గెలుపొందాడు. త్వరలోనే నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని నూతన అధ్యక్షుడు తెలిపారు. అనంతరం బస్తీవాసులు ముత్తును ఘనంగా సత్కరించారు.



గెలుపొందిన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న బస్తీవాసులు

సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం –9లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చి స్కూల్ ప్రిన్సిపాల్‌గా బందనాథం ప్రేమ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బదిలీ అయిన ప్రిన్సిపాల్ వై. బాలరెడ్డితో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్‌ను చర్చి కమిటీ సభ్యులు శౌరిరాజు, విక్టర్, లారెన్స్, రవి సత్కరించారు.

'మీడియా' సామాజిక దృక్కోణాన్ని ప్రభావితం చేస్తోంది

–హీరో నవదీప్

సాక్షి,సిటీబ్యూరో: సామాజికంగా అంశాలపైన మీడియా ప్రభావం చాలా ఉంటుంది, ఈ రంగంలోని నైతిక విలువలు సామాజిక స్థితిగతులను ప్రతిబింబిస్తాయని సినీ నటుడు నవదీప్ తెలిపారు. ఆహా వేదికగా విడుదల కానున్న 'న్యూ సెన్స్ వెబ్‌సిరీస్ సీజన్–1' ట్రైలర్‌ను బంజారాహిల్స్‌లోని ఆర్‌కే సినీప్లెక్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ.. మీడియాతో ముడిపడి ఉన్న కథాంశంతో సామాజిక దృకోణాన్ని ఆవిష్కరించే ఈ వెబ్ సిరీస్ ఈ నెల 12వ తేదీ ప్రసారమవుతుందన్నారు. ప్రేక్షకులకు అలరించడంతో పాటు సామాజిక భాధ్యతలను గుర్తు చేసేలా ఈ కథాంశం ఉందని కథానాయిక బిందుమాధవి తెలిపింది. ఇలాంటి ప్రయోగాత్మక కథలకు ఆహా వేదిక కావడం మరింత ప్రోత్సాహాన్ని అందించిందని దర్శకుడు శ్రీప్రవీణ్ అన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నవదీప్, బిందుమాధవి

శభాష్.. రమేశ్



గాయపడిన వీధి కుక్కకు చికిత్స చేస్తున్న రమేశ్

రహమత్‌నగర్: గాయపడిన వీధి కుక్కలను వైద్య సేవలు అందిస్తున్న రమేశ్ మూగ జీవప్రేమికుల ప్రశంసలు అందుకుంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే ఎస్పీఆర్ హిల్స్ వినాయకనగర్ బస్తీకి చెందిన రమేశ్‌ను ఓ సంఘటన జంతు ప్రేమికుడిగా మార్చింది. ఆటోలో వస్తుండగా ఓ వీధి కుక్కకు గాయాలై తల్లడిల్లిపోయింది. అది చూసిన రమేశ్ చలించి సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాడు. నాటి నుంచి వీధి కుక్కలకు సేవలు అందించాలని నిర్ణయించుకున్నాడు. తొలుత అక్కినేని అమల సంస్థలో బ్లూక్రాస్‌లో కొన్ని సంవత్సరాలు పనిచేసి వీధి కుక్కల చికిత్స విధానం, పునరావాసంపై అవగాహన లాంటి విషయాలు తెలుసుకున్నారు. ఐదేళ్ల క్రితం బంజారహిల్స్‌లో హ్యాపీ ఫ్రెండ్లీ యానిమల్ పేరుతో సంస్థను స్థాపించి వీధి కుక్కల ఆలనాపాలన చేస్తూ మన్ననలు పొందుతున్నాడు. ఎక్కడైనా వీధికుక్కలు ప్రమాదాలు జరిగితే వెంటనే అక్కడకు వెళ్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తాడు.

క్రీడలతో మానసికోల్లాసం

లాలాపేట: క్రీడలకు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతోందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తార్నాకలోని ఆమె కార్యాలయం వద్ద స్థానిక యువతకు వివిధ రకాల క్రీడా సామగ్రి అందజేసి మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువకులు అభిరుచి మేరకు క్రీడలను నేర్చుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, శివశంకర్, మనోహర్, నాగేశ్వర్‌రావు, శివ పాల్గొన్నారు.



కిట్స్ అందజేస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

ఆర్థిక నేరాలకు మార్గదర్శితో ముగింపు!

రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నడిపిన కేసులో 4 రోజుల పాటు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో రామోజీ

- కోర్టుల్ని తప్పుదారి పట్టించేలా లెక్కలు చూపించారు
- ఫిర్యాదులు రాకున్నా న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- రామోజీరావు కేసు ముగిసిన కథ అనుకున్నాం
- సీఎం జగన్ ఎస్‌ఎల్‌పీ పిటిషన్ వేయడంతో కేసుకు ఊపిరి వచ్చింది
- టీడీపీకి ఆదిరెడ్డి అప్పారావు అవసరం లేదు.. రామోజీనే ముఖ్యం
- రామోజీ – మార్గదర్శి అక్రమాలపై విశాఖలో 'స్వర్ణాంధ్ర వేదిక' సదస్సులో వక్తలు

సాక్షి, విశాఖపట్నం: రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నిర్వహించిన కేసులో మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు గతంలో నాలుగు రోజుల పాటు హైదరాబాద్ అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని, అప్పటి నుంచి ఆయన మోసాలు కొనసాగుతూనే ఉన్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వెల్లడించారు. మార్గదర్శి కేసుతోనైనా దేశంలో ఆర్థిక నేరాలకు ఫుల్‌స్టాప్ పడాలని వ్యాఖ్యానించారు. 17 ఏళ్లుగా కొనసాగుతున్న మార్గదర్శి కేసు ఇక ముగిసిన అధ్యాయం అనుకున్న తరుణంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడుతూ సీఎం వైఎస్ జగన్ వేసిన ఎస్‌ఎల్‌పీ పిటిషన్‌తో కొత్త ఊపిరి వచ్చిందని, లక్షల మంది ఖాతాదారులకు ధైర్యం వచ్చిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఓ హోటల్‌లో ఆదివారం సాయంత్రం స్వర్ణాంధ్రవేదిక ఆధ్వర్యంలో 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు– నిజానిజాలు'అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పలువురు మాట్లాడారు.


సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్. సదస్సుకు హాజరైన ప్రముఖులు



ఎవరికి ఫిర్యాదు చేయాలి?: ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ

17 ఏళ్ల తరువాత డబ్బులు ఎవరికి ఇచ్చారో వెల్లడించాలని మార్గదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఘన విజయం సాధించామని చెప్పుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాం. జూలై 18కి కేసు వాయిదా వేశారు. చాలా ఏళ్ల న్యాయస్థానాల్లో కేసు ఏమిటనేది వినే పరిస్థితి రాలేదు. 2021లో హైకోర్టులో కేసు కొట్టివేసిన తర్వాత ఎస్‌ఎల్‌పీ (స్పెషల్ లీవ్ పిటిషన్)దాఖలు చేశా. ఏడాది తర్వాత ఏపీ ప్రభుత్వం నేరుగా ఎస్‌ఎల్‌పీ వేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరైన టైమ్‌లో స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ వేయడంతో నాకు నమ్మకం వచ్చింది. ఈ కేసు కథ ముగిసిపోతుందనుకున్న తరుణంలో వైఎస్ జగన్ వేసిన ఎస్‌ఎల్‌పీతో మళ్లీ మొదలైంది. దివంగత వైఎస్సార్ అనుకున్నది రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి చేయలేకపోయారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. ఎవరికి డబ్బులు చెల్లించారనే వివరాలు బయటకు వస్తే ఈ కేసు ఈడీకి వెళ్తుందా? మనీ ల్యాండరింగ్‌కు కిందకు వెళ్తుందా? చెల్లించిన డిపాజిటర్లు ఎవరు? అనే విషయాలు బయటకు వస్తాయి. మొత్తం 2.36 లక్షల మంది పేర్లు బయటికి వస్తాయి. దీన్ని వచ్చే ఎన్నికల్లో ఇష్యూ చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యంగా కనిపిస్తోంది. ఎవరూ కంప్లైంట్ ఇవ్వలేదని రామోజీ అంటున్నారు. చిట్ డబ్బులు ఇవ్వకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి? పోలీస్ స్టేషన్‌లో ఇస్తే తీసుకుంటారా? కలెక్టరేట్‌లో తీసుకుంటారా?

అదే బాటలో ధనలక్ష్మి, కార్తికేయ...

రామోజీని చూసి మిగిలిన చిట్స్ కూడా మోసాల బాట పడుతున్నాయి. రామోజీ ఏం చేస్తున్నారో అందరూ అదే చేస్తున్నారు. మూడు నెలల క్రితం కాకినాడలో ధనలక్ష్మి సొసైటీ, నెల క్రితం కార్తికేయ సొసైటీ మూతపడ్డా పోలీసులు ఏమీ చేయలేక పోయారు. ఎర్రన్నాయుడి వియ్యంకుడైన ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడిని ఇదే మోసం కారణంగా అరెస్టు చేశారు. రామోజీని అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు తీర్పు వచ్చింది. మరి అలాంటప్పుడు అప్పారావును ఎందుకు అరెస్టు చేశారని ఆయన్ను పరామర్శించేందుకు వచ్చిన చంద్రబాబు ఎందుకు ప్రశ్నించలేదు? ఇద్దరికీ చెరో నీతా? రామోజీని ఇంటికెళ్లి విచారిస్తారు.. అప్పారావును ఎందుకు అరెస్టు చేస్తారు? అని అడగాలి కదా! ఆదిరెడ్డి అప్పారావు ఏమైనా పర్వాలేదు కానీ రామోజీకి ఏమీ జరగకూడదని టీడీపీ స్టాండ్ తీసుకుంది.

అబిడ్స్ స్టేషన్‌లో రామోజీ..

ఈనాడుకు మొట్టమొదటి ఎడిటర్ ఉన్న ఏబీకే ప్రసాద్‌కు ఫోన్ చేస్తే.. ఏ పర్మిషన్ లేకుండా చిట్ ఫండ్ కంపెనీ నడుపుతున్నారన్న ఆరోపణలపై రామోజీరావు నాలుగు రోజుల పాటు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారన్న కొత్త విషయాన్ని చెప్పారు. ఆ తర్వాతే మార్గదర్శిని రిజిస్టర్ చేశారట. జీవీ రెడ్డి మార్గదర్శిపై చర్చకు వస్తామని ప్రకటించారు. కానీ హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌ని ఈ నెల 14న టీడీపీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ పేరుతో బుక్ చేసుకున్నారు. రామోజీ కోసం ఏమైనా చేస్తామని తద్వారా టీడీపీ నేరుగానే చెబుతోంది.

రెండు దశాబ్దాల నిరంకుశత్వం

రామోజీ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న మార్గదర్శితో ఈ వేదికపై ఉన్నవారెవరికీ వ్యక్తిగత ద్వేషాలు లేవు. ఈనాడైనా.. చిత్తు కాగితాలైనా.. పచ్చళ్లయినా.. పరిశ్రమలైనా.. చిట్స్ అయినా.. తానే చేయాలన్నదే రామోజీరావు కాన్సెప్ట్. చిన్నవాడెవడూ బతకకూడదు. ఆయనకి యాడ్స్ ఇవ్వకపోతే వ్యతిరేకంగా వార్తలు రాయడం నిత్యకృత్యమైంది. అధికార శక్తి, మీడియా శక్తి ఏకమైతే ఎంత భయంకరంగా ఉంటుందో గత రెండు దశాబ్దాలుగా రామోజీ రూపంలో చూస్తున్నాం. మార్గదర్శి అక్రమాలపై త్వరలో తిరుపతిలో సదస్సు నిర్వహిస్తాం.

– కేబీజీ తిలక్, స్వర్ణాంధ్ర దినపత్రిక ఎడిటర్

'చంద్రమతి మాంగల్యం'.. మార్గదర్శి ఆస్తులు!

డిపాజిటర్లు మోసపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించి డిపాజిటర్లను కాపాడింది. కొత్త అప్పులు రెండు లక్షల మందికిపైగా డిపాజిటర్లకు గుదిబండగా మారనున్నాయి. అనుబంధ కంపెనీలకు నిధులు ఎలా బదలాయిస్తారు? 'చంద్రమతి మాంగల్యం' మాదిరిగా ఆస్తులు వారికి మినహా ఇతరులకు కనపడటం లేదు. అగ్రిగోల్డ్, సహారా మోసాలు జరిగిపోయాయి. డిపాజిట్ రసీదుపై రామోజీరావు సంతకం ఉంటుంది. డిశ్చార్జ్ రసీదుపై ప్రొప్రైటర్ సంతకం చేయడం నిబంధనలకు విరుద్ధం.

– శర్మ, ప్రముఖ న్యాయవాది.

బ్రహ్మయ్య కంపెనీలో వందల ఫిర్యాదులు

మార్గదర్శి, డాల్ఫిన్, ప్రియా ఫుడ్స్, ఈనాడుతో 1979 నుంచి నాకు అనుబంధం ఉంది. ఉండవల్లి పోరాటం జరిగిన తర్వాత రామోజీ మోసాలు ప్రతి ఒక్కటీ గుర్తుకొచ్చాయి. 100 టన్నుల న్యూస్ ప్రింట్ పేపర్ దిగుమతి చేసుకుంటే 90 టన్నులు మాత్రమే వినియోగించేవారు. ఇలాంటి ఎన్నో మోసాలు నా కళ్లముందే జరిగాయి. మా మామయ్య కేఎస్ రెడ్డి అన్నదాత ఎడిటర్‌గా ఉండేవారు. రామోజీ ప్రజల డబ్బులతో హోటల్స్.. ప్రింటింగ్ ప్రెస్‌లు, బిల్డింగ్‌లు కడుతున్నారని, చివరకు ఏమవుతుందోనని మామయ్య ఆందోళన చెందేవారు. చట్టాల్లో లొసుగులను అడ్డు పెట్టుకొని తప్పించుకోవడం రామోజీరావుకి వెన్నతో పెట్టిన విద్య. టీడీపీ నుంచి వచ్చిన జీవీ రెడ్డికి, మార్గదర్శికి ఏం సంబంధం? మా గ్రామంలో ఒక వ్యక్తికి చిట్ అయిపోయిన 9 ఏళ్ల తర్వాత డబ్బులిచ్చారు. నేను ఆడిట్ చేసిన సమయంలో బ్రహ్మయ్య అండ్ కంపెనీలో మార్గదర్శిపై కొన్ని వందల కంప్లైంట్స్ ఉన్నాయి.

– నాగార్జునరెడ్డి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్

క్లుప్తంగా...


తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ

తిరుమల యాత్ర ఫ్యాషన్‌తో చేసే పిక్నిక్ కాదు

- భక్తితో శ్రీవారిని దర్శించుకోవాలి
- మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ

తిరుమల: తిరుమల యాత్ర ఫ్యాషన్‌తో చేసే పిక్నిక్ కాదని, భక్తితో శ్రీవారిని దర్శించుకోవాలని మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తిరుమల శ్రీవారిని వ్యాపార దృష్టితో చూడకూడదని చెప్పారు. భక్తితో స్వామివారిని పూజిస్తే అందరి కోరికలు తీరుతాయన్నారు. పవిత్రమైన తిరుమల పరిసరాలను భక్తులు అపవిత్రం చేయకూడదని సూచించారు.

బండిపై పోస్ట్ పెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చనిపోయారని పోస్టు చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రొఫైల్, టీఆర్ఎస్ పేరుతో ఉన్న ఆ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి ఆ పోస్టు వైరల్ అయిందని, ఆ పోస్టు పెట్టిన వ్యక్తిని 24 గంటల్లోగా అరెస్టు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమదేవి ఆదివారం డీజీపీని కోరారు. పార్టీ అధికార ప్రతినిధి సీహెచ్ విఠల్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ...బతికున్న బీజేపీ నేతలనే చనిపోయారని పోస్టులు పెట్టే స్థాయికి బీఆర్ఎస్ నేతలు దిగజారిపోయారని మండిపడ్డారు. కరీంనగర్ ప్రజలు పిచ్చోడిని గెలిపించారని మంత్రి కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని ఇప్పటికైనా ఆయన నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. పదవీ విరమణ పొందకుండా సోమేశ్ కుమార్ రాజకీయాల్లో ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో సోమేశ్ కుమార్‌పై ఫిర్యాదు చేస్తామన్నారు.

అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు

- 11న సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్ : బీజేపీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా పోరాడుతామన్నారు. ఇందులోభాగంగా ఈనెల 11న ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంలోని సంగారెడ్డిలో నిర్వహిస్తున్న 'నిరుద్యోగ మార్చ్'కు నిరుద్యోగులు, ప్రజాస్వామికవాదులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన తీరును 'నిరుద్యోగ మార్చ్'ద్వారా ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. వచ్చే నెలలో హైదరాబాద్ లో ''మిలియన్ మార్చ్''నిర్వహించి ప్రభుత్వానికి కళ్లు తెరిపిస్తామన్నారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేటీఆర్ మంత్రి పదవికి రాజీనామా చేసేదాకా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూపీఎస్సీ తరహాలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని హామీనిచ్చారు.

అల్లూరికి నివాళి..

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు చింతల రామచంద్రారెడ్డి, గౌతమ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రకు చెందిన 'భూమి పుత్ర సంఘటన'బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం నాడు విలీనమైంది. సంఘటన సంస్థాపక అధ్యక్షుడు సంతోష్ వాడేకర్‌తో పాటు సంఘం నేతలు.. కిరణ్ వాబాలే, అవినాశ్ దేశ్‌ముఖ్, అశోక్ అందాలే, రాజన్ రోక్డే, ఆసిఫ్ బాయి షేక్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమాధాన్ అరికొండ, ఆప్‌కి చెందిన దీపక్ కొంపెల్వార్, యోగితా కొంపెల్వార్, రాము చౌహాన్, భారీ త్రిలోక్ జైన్, సంతోష్ కాంబ్లే, అఖిల్ భారతీయ క్రాంతి దళ్ సంఘటనకు చెందిన లక్ష్మీకాంత్ భంగే కూడా బీఆర్ఎస్‌లో చేరారు. నిఖిల్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో.. గోండ్వానా పార్టీ విదర్భ అధ్యక్షుడు ప్రణీత వీకేసీ, యావత్మాల్‌కు చెందిన సామాజిక కార్యకర్త వర్ష కాంబ్లే కూడా బీఆర్ఎస్‌లో చేరారు. విదర్భకు చెందిన మహిళా బచత్ ఘాట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు కల్పన, పూనమ్ అలోర్‌లు.. బీఆర్ఎస్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాల్క సుమన్ పాల్గొన్నారు.

నగర వార్తలు

తారామతి బారాదరిలో టూరిజం చైర్మన్ తనిఖీ



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం ఇబ్రహీంబాగ్‌లోని తారామతి బారాదరిలో తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో లభించే సదుపాయాలను పరిశీలించారు. అలాగే దేశవిదేశాలకు చెందిన పర్యాటకులను ఆకట్టుకొనేవిధంగా హోటల్‌లో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపైన అధికారులతో చర్చించారు. హైదరాబాద్‌ను సందర్శించేందుకు అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తారనీ, గోల్కొండ కోటను సందర్శించే క్రమంలో తప్పనిసరిగా ఇక్కడ విశ్రాంతి తీసుకొనే విధంగా సదుపాయాలను మెరుగుపర్చాలని ఆయన అధికారులకు సూచించారు. సూపర్‌వైజర్లు సురేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కళ్యాణ్ ప్రభు పాల్గొన్నారు.



సైకిల్ రైడ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్‌విన్‌ఓవెన్, టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరుప్రతాప్‌రెడ్డి



ఉల్లాసంగా.....ఉత్సాహంగా

- సందడిగా సాగిన 'పాలపిట్ట సైకిల్‌రైడ్–2023'
- పాల్గొన్న 1000 మంది సైకిల్ రైడర్లు

రాయదుర్గం: కొండాపూర్ లోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో ఆదివారం ఉదయం 'పాలపిట్ట సైకిల్‌రైడ్–2023' ఉత్సాహంగా జరిగింది. ఈ రైడ్‌లో 1000 మంది వరకు సైకిల్ రైడర్లు పాల్గొన్నారు. ఈ రైడ్‌ను బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్‌ఓవెన్, టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, డబ్ల్యూసీఏ మొదటి వైస్ ప్రెసిడెంట్ డి.వి.మనోహర్, ప్రపంచ సైక్లింగ్ అలయన్స్ మొదటి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి సత్యనారాయణరెడ్డి ఊపి ప్రారంభించారు. హెచ్‌బీసీ చైర్మన్ డీవీ మనోహర్ మాట్లాడుతూ పాలపిట్ట సైక్లింగ్ పార్కు నిర్వహణలో హెచ్‌బీసీ ప్రత్యేక హక్కులను పొందిందన్నారు.

నగరంలో ఏకైక సైక్లింగ్ పార్కు 37 ఎకరాల అటవీ భూమిలో సరస్సుతో విస్తరించి ఉందన్నారు. నగరంలో హెచ్‌బీసీ 12 ఏళ్ళుగా సైక్లింగ్ రెవల్యూషన్‌ను నెక్లెస్‌రోడ్డు, గచ్చిబౌలిలో 700 అత్యాధునిక సైకిళ్లతో తన రెండు బైక్ స్టేషన్లతో ప్రారంభించిందన్నారు. అనంతరం బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్‌విన్‌ఓవెన్, టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరుప్రతాప్‌రెడ్డి, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి రైడర్లను అభినందించారు.


సైకిల్ రైడ్‌లో పాల్గొన్న అతిథులు

మేడ్చల్ టు సిటీ

– మేడ్చల్ నుంచే పూలు, పండ్లు సరఫరా

సాక్షి, మేడ్చల్‌జిల్లా: నగరానికి కూత వేటు దూరంలో ఉన్న మేడ్చల్ జిల్లాలో ఉద్యానవన పంటల (పండ్లు, పూలు, కూరగాయలు) సాగుపై రైతులు దృష్టి సారించేందుకు అధికారయంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు తగిన కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఉద్యానవన పంట సాగు కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ వసతి, గిట్టుబాటు ధర పలికేంత వరకు పంట ఉత్పత్తులను నిలువ చేసుకోవటానికి కోల్డ్ స్టోరేజీలు, దీనికి ముందు రైతులకు కావలసిన విత్తనాలు.ఎరువులు, రుణాలు తదితర వాటి కోసం కట్టుదిట్టమైన ప్రణాళికను ఖరారు చేస్తోంది.

వ్యవసాయ భూమి 28,585 ఎకరాలు

జిల్లాలో వ్యవసాయ భూమి 28,585 ఎకరాలు ఉండగా, ఇందులో సాగయ్యే భూమి మాత్రం 20,612 ఎకరాలు మాత్రంగానే ఉంది. ఇందులో వరి పంట 12,530 ఎకరాలలో సాగవుతుండగా, మొక్క జొన్న పంట 2,807 ఎకరాలలో, ఉద్యానవన పంటలు 6,575 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఉద్యానవన పంటల్లో కూరగాయ తోటలు 3,500 ఎకరాలలో సాగవుతుండగా, మామిడి,జామ,దానిమ్మ, ద్రాక్ష తోట పంటలను 3 వేల ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. 75 ఎకరాలలో మాత్రం పాలిహౌజ్ (జర్‌బరా పూలు)పంటను పండిస్తున్నారు. ఈ ఉద్యానవన పంట సాగులో భాగంగా రైతులు కూరగాయల దిగుబడి 28 వేల టన్నులు వస్తుండగా, మామిడి,జామ, దానిమ్మ, ద్రాక్ష పండ్ల ఉత్పత్తుల దిగుబడి 20 వేల టన్నులు వస్తోంది. పూల పంట దిగుబడి మాత్రం వెయ్యి టన్నులకు మించటం లేదు. జర్‌బరా పూల ఉత్పత్తి మాత్రం ఒక హెక్టార్(రెండున్న ఎకరాల)కు ఆరు వేల పూలు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రధానంగా ఉద్యానవన పంటలను శామీర్‌పేట,


మేడ్చల్, కీసర, ఘట్కేషర్,దుండిగల్ గండిమైసమ్మ మండలాల్లో రైతులు అధికంగా సాగు చేస్తున్నారు.

ప్రధాన మార్కెట్ హైదరాబాదే..

మేడ్చల్ జిల్లాలో పండించే ఉద్యానవన ఉత్పత్తులన్నీ హైదరాబాద్ మహానగరానికి రైతులు తరలిస్తున్నారు. నగరంలోని బోయినపల్లి, శామీర్‌పేట సమీపంలోని ఒంటిమామిడి, కరీంనగర్ ప్రాంతాలకు రైతులు కూరగాయలు తరలించి విక్రయిస్తున్నారు. వివిధ రకాల పండ్ల ఉత్పత్తులను మాత్రం గడ్డి అన్నారం, కొత్తపేట పండ్ల మార్కెట్లకు తరలిస్తున్నారు. జర్‌బరా, బంతితో పాటు పలు రకాల పూలను కూడా హైదరాబాద్ నగరానికే తరలించి రైతులు అమ్ముకుంటున్నారు.

సన్న,చిన్నకారు రైతులు అధికం

జిల్లాలో రైతులు 28,325 మంది ఉండగా, ఎకరం నుంచి రెండు ఎకరాల భూమి కలిగిన రైతులు అధికంగా 19,317 మంది ఉన్నారు. మధ్యతరగతి రైతులు 5,216మంది ఉండగా మోస్తరు మధ్యతరగతి రైతులు 979 మంది కాగా, 20 ఎకరాల కంటె ఎక్కువ భూమి కలిగిన రైతులు 123 మంది మాత్రమే ఉన్నారు. ఉద్యాన పంటలు ప్రధానంగా శామీర్‌పేట, మేడ్చల్, కీసర, ఘట్కేషర్,దుండిగల్ గండిమైనమ్మ మండలాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

తెలంగాణ సాధనలో నాయిని పాత్ర కీలకం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధనలో దివంగత నాయిని నర్సింహారెడ్డి పాత్ర మరువలేనిదని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు, కార్మికుల సంక్షేమానికి నాయిని కృషిచేశారన్నారు. ఆదివారం ఎన్‌టీఆర్ స్టేడియంలో నాయిని నర్సింహారెడ్డి జయంతిని పురస్కరించుకొని నాయిని నర్సింహ్మారెడ్డి మెమోరియల్ క్రికెట్ లీగ్–2 పోటీలను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, జడ్జి పి.సౌజన్య, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బండారు దత్తాత్రేయ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించి తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు వి.సమతారెడ్డి, ఉపాధ్యక్షులు నాయిని దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కీర్తన సంగీత అకాడమి సుష్మ నండూరి శిష్య బృందం తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. శరణు శరణు, మాధవకేశవ, చక్కని తల్లికి వంటి కీర్తనలను సాంవై, భగవతి, హేమశ్రీ రష్మీ ఆలపించి మెప్పించారు.



రుక్మిణి ప్రవేశ దరువు, పలుకే బంగారామాయే తదితర అంశాలను దేదీప్య, సుప్రియ, కార్తీక, అక్షర ప్రదర్శించారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి

మాజీ గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే

మేడ్చల్ రూరల్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ బాటలో నడవాల్సిన అవసరం ఉందని మహారాష్ట్ర మాజీ సీఎం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిలోని మినీ ట్యాంక్‌బండ్‌పై మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన 13 మంది మహనీయుల విగ్రహాల ఆవిష్కరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగంలోని రూపొందించిన సూచనలు పాలకులు, ప్రజలు మరవవద్దన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు పేదల కోసం పనిచేయకుండా కులమత బేధాలతో పనిచేస్తున్నాయన్నారు. మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ తనకు ఇంతకు ముందు తెలియదని కానీ తన సొంత నిధులతో మహనీయుల విగ్రహాలు ప్రజల్లో స్ఫూర్తి నింపుతున్నాడని తెలిసి కార్యక్రమానికి వచ్చినట్లు తెలిపారు. ప్రజలను చైతన్య పరిచేలా ఇంతటి గొప్ప కార్యాన్ని తలపెట్టడం సంతోషకం అన్నారు. ఇలాంటి నాయకులకు అండగా నిలవాలని మంత్రి మల్లారెడ్డిని కోరారు.

అంతకుముందుకు సినీనటుడు మోహన్‌బాబు మాట్లాడుతూ.. మహనీయుల విగ్రహావిష్కరణలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ కులమత భేదం లేకుండా అందరు కలిసి ఉండాలని అంబేడ్కర్ ఆశించారని అందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కి, జిల్లా పరిషత్ చైర్మెన్ శరత్‌చంద్రారెడ్డి, జాతీయ మాలమహానాడు అధ్యక్షులు అద్దకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండే, విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి


21న వైటథాన్ రన్



వైటథాన్ రన్ టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న క్రికెటర్ వీవీఎస్.లక్ష్మణ్ తదితరులు

బంజారాహిల్స్: రెటినోబ్లాస్టోమా(కంటి క్యాన్సర్)తో బాధపడుతున్న పిల్లల పట్ల సమాజంలో అవగాహన, నిధుల సేకరణ కోసం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్న వైటథాన్ రన్ టీషర్ట్‌లను ఆదివారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీవీఎస్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కంటి వ్యాధులపట్ల అవగాహన కల్పించడంతో పాటు సరైన వైద్యం అందిస్తే ఎంతో మంది చిన్నారులకు కంటి చూపును పోకుండా కాపాడుకోవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ వైటథాన్ రన్ 3కే, 5కే, 10కే విభాగాల్లో గచిబౌలిలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సభ్యులు డాక్టర్ గుళ్లపల్లి ఎస్.రావు, ప్రతిభారావు, డాక్టర్ రాజీవ్‌రెడ్డి, కల్లం అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్నిధి



మంచితనం; మానవ జాతి మొదలయిన రోజు నుంచి ప్రతిమనిషికి అతిముఖ్యంగా కావాల్సి వచ్చింది ఏదైనా ఉంది అంటే అది మంచితనం. ఒక మనిషి నుంచి మరొక మనిషికి జారి పోకుండా అందాల్సింది ఏది అని అంటే అది మంచితనం. మొత్తం మానవ జాతికి సర్వదా, సర్వథా క్షేమకరం అయిందీ, లాభకరం అయిందీ ఏదైనా ఉందీ అంటే అది మంచితనం.

ఉండాల్సిన లక్షణం

మానవజాతిలో మంచితనానికి ఆది నుంచీ కొరత ఉండడం కాదు అసలు మంచితనం మనలోకి, ప్రపంచంలోకి ఇంకా రానేలేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని మనం తెలుసుకోవాలి. అందువల్ల ఇకపైనైనా మనలో మంచితనం కోసం మంచి ప్రయత్నాలు మెదలు అవచ్చు.

మంచితనం అని మనం అనుకుంటోంది నిజానికి మంచితనం కాదు. మంచితనం అని మనం అనుకుంటోంది మంచితనమే అయి ఉంటే మన ప్రపంచంలో జరుగుతూ వస్తున్న హాని, విధ్వంసం, ప్రాణ, ఆస్తి నష్టాలు, ద్రోహాలు, దొంగతనాలు, కుట్రలు, మనుషుల బతుకులు అల్ల కల్లోలం అవడమూ మనకు తెలుస్తూ ఉన్నంత తెలుస్తూ ఉండేవి కావు; ఇప్పటిలా మనం వాటివల్ల దెబ్బ తినేవాళ్లం కాము.

మంచితనానికి మంచి జరగలేదేమో? అందుకే మనలోకి, ప్రపంచంలోకి రావడానికి మంచితనానికి ఇంకా మంచిరోజు రాలేదేమో? మంచితనానికి మంచి జరిగే ఉంటే ఎంతో బావుండేది. మనకు నెమ్మది, మన బతుకులకు భరోసా ఉండేవి.

ఆది నుంచే లోకంలో మంచితనం లేదు కాబట్టి మాట వచ్చిన నాటి నుంచీ ప్రతిభాషా మంచితనం ఆవశ్యకతను పదేపదే చెబుతూనే ఉంది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోని యోగులు, గురువులు, కవులు, జ్ఞానులు అందరినీ మంచితనంవైపు మళ్లించే మాటలు చెప్పారు. ప్రపంచంలోని ప్రతి మతమూ మంచిగానూ, మంచి తోనూ ఉండమని చక్కగా, చిక్కగా చెప్పింది.

> ఆది నుంచే లోకంలో మంచితనం లేదు కాబట్టే మాట వచ్చిన నాటి నుంచీ ప్రతిభాషా మంచితనం ఆవశ్యకతను పదేపదే చెబుతూనే ఉంది. ప్రపంచంలోని ప్రతి మతమూ మంచిగానూ, మంచి తోనూ ఉండమని చక్కగా, చిక్కగా చెప్పింది.

ఎందుకో చెడు అబ్బినట్టుగా మనిషికి మంచి అబ్బలేదు. ఏమిటో మరి చెడుకు మాలిమి అయినట్టుగా మనిషి మంచికి మాలిమి అవలేదు. ఇందుకు కారణాలు తెలిసిపోతే మంచికి రోజులు వచ్చేస్తాయేమో? చెడుకు రోజులు చెల్లిపోతాయేమో?

మనిషి చెడుతోనే పుడతాడు. చెడు అన్నది ఎవరికైనా పుట్టుకతోనే వచ్చేస్తుంది. మనిషిలో చెడు సహజంగానే ఉంటుంది. మనిషి తనలో ఉన్న చెడును తొలగించుకుంటూ మంచిని అభ్యసిస్తూ ఆపై దాన్ని సాధించాల్సి ఉంటుంది. మనిషికి చెడు అన్నది లక్షణం; మంచి అన్నది లక్ష్యం. మనిషి తన లక్షణాన్ని వదులుకుని ఆ లక్ష్యాన్ని సాధించలేకపోతున్నాడు.

మనకు ప్రశాంతత కావాలి; అందుకు మంచితనం వచ్చి తీరాలి. మంచితనం వేగంగా రావాలి; మంచితనం నిజంగా రావాలి. కొత్తగా పుట్టిన నదిలా అది ఎప్పటికీ ఉండేలా మంచితనం మనలోకి ప్రవహించాలి.

'ఓ మంచితనమా, నువ్వు ఎక్కడ ఉన్నావ్? నువ్వు ఎక్కడ ఉన్నా నీకు ఇదే మా స్వాగతం; ఇంకా నువ్వు వేచి ఉండకు రా మాలోకి. రాయని కవితలా ఎక్కడో ఉండిపోకు; సరైన తరుణం ఇదే రా మాలోకి. మాకు నీ అవసరం చాలా ఉంది;

నువ్వు లేకపోవడం వల్ల మా ఈ లోకం అపాయకరం అయిపోతూ ఉంది. వెంటనే వచ్చేసెయ్ ఓ మంచితనమా, ఎదురు చూస్తూ ఉన్నాం రా మంచితనమా రా' అంటూ మనం అందరమూ మన క్షేమం కోసం మంచితనాన్ని మనసా, వాచా తప్పనిసరిగా ఆవాహన చెయ్యాల్సిన అవసరం ఉంది.

మంచితనం మనలో లేనందువల్ల మనం విరిగిపోయిన వాక్యాలం అయ్యాం; అందువల్ల మనం అనర్థదాయకం అయ్యాం. ఈ స్థితిని అధిగమించి మంచితనాన్ని సాధిద్దాం; మనుగడను సాత్వికం చేసుకుందాం.

– రోచిష్మాన్

గురువాణి

వాటిని ఎందుకు చదవాలి?

మనిషి జీవితంలో సంతరించుకోవలసిన గొప్ప గుణాలను గురించి గురజాడ అప్పారావుగారు ఒకచోట ఇలా అన్నారు... '' ఈవియుదియ్యని మాటయు / భావంబున జేయతగిన పనితెలియుటయున్ / ఠీవియగు ధైర్యభావము/ రావు సుమీ యొకని వలన రావలె తనతోన్''...

ఈవియు .. అంటే త్యాగం. మనిషి తనకుతాను సుఖపడితే తప్పుకాదు. మనిషి త్యాగంతో గొప్పవాడు అవుతాడు. ఇతరుల గురించి ఆలోచించి, వాళ్ళను కష్టాల్లోంచి పైకి తీసుకురావడానికి.. తాను ఎంత శక్తిని వినియోగించుకోగలడో, అంత శక్తినీ, ఏ విధమైన గుర్తింపునీ కోరకుండా అది తన కర్తవ్యం అన్న భావనతో ప్రేమ



భావనతో చేయదగిన వ్యక్తి ఎవరున్నారో ఆయన త్యాగశీలి. అటువంటి మహానుభావులు ఎందరో పుట్టకపోతే అసలీ దేశానికి స్వాతంత్ర్యం ఎలా సిద్ధించి ఉండేది? మన దగ్గర విషయమే తీసుకుంటే... బెజవాడ గోపాలరెడ్డి గారు పుట్టుకతో శ్రీమంతుడయినా దేశంకోసం చాలా శ్రమించాడు, చివరకు జైళ్ళకు కూడా వెళ్ళాడు. ఆయనకేం కర్మ! అలాగే టంగుటూరి ప్రకాశం పంతులు గారు. ఆరోజుల్లో లక్షల సంపాదన ఉన్న న్యాయవాద వృత్తిని వదిలి దేశంకోసం సర్వస్వం ధారపోశారు. స్వాతంత్ర్యోద్యమ విశేషాలను, సందేశాలను ప్రజలకు చేరవేయడానికి తన స్వార్జితంతో 'స్వతంత్ర' పత్రిక నడిపారు. లక్షలు ఖర్చుపెట్టారు... అటువంటి వారిది త్యాగమయ జీవితం. అంటే... త్యాగం మనిషిని శాశ్వతమైన కీర్తికి అర్హుణ్ణి చేస్తుంది.

తియ్యని మాటలు మాట్లాడడం ఒక మంచి సంస్కారం. తిరస్కరించవలసి వచ్చిన సందర్భాల్లోనూ ఎదుటివారిని నొప్పించకుండా మృదువుగా మాట్లాడగల గాలి. హనుమ నూరు యోజనాల సముద్రాన్ని దాటిపోతున్నప్పుడు మార్గమధ్యంలో మైనాకుడు తన ఆతిథ్యం స్వీకరించి వెళ్ళాలని కోరితే... కటువుగా తిరస్కరించలేదు. ''నాయనా! రామకార్యం మీద పోతున్నాను. వేళ మించిపోతోంది. నీవు నాకు ఆతిథ్యం ఇచ్చినట్టే, నేను పుచ్చుకున్నట్లే...'' అంటూ మృదువుగా చేతితో స్పృశించి వెళ్ళాడు తప్ప... ఎక్కడా కటువుగా మాట్లాడలేదు. రామాయణ భారతాది కావ్యాలు ఎందుకు చదవాలంటే... మాట మధురంగా ఉండడం కోసం, సంస్కారవంతమైన వాక్కు తయారవడం కోసం, మాట పదిమందికి పనికొచ్చేదిగా ఉండడం కోసం చదువుకుంటారు. ఎవ్వరికీ ఉపకారం చేయలేకపోవచ్చు. మనం చెప్పే ఓదార్పు మాటలు ఎదుటి వాళ్ళకు స్వాంతన కలిగిస్తాయి. చెడు మార్గంలో ఉన్న వాళ్లను మంచిమార్గం వైపు మళ్ళిస్తాయి.

భావంబున చేయదగిన పనిచేయుటయున్... భావం మనోగతం. తాను ఏ పనిచేయాలో ఆ పనినే మనసు తనకు జ్ఞాపకం చేస్తూ ఉంటే ఆ వ్యక్తి గొప్ప శీలవంతుడవుతాడు. అటువంటి సౌశీల్యం ఉండాలి. ఠీవియగు ధైర్య భావము... ఠీవి అంటే వైభవం.. పిరికితనం చూపకుండా తెగువ, పోరాట పటిమ చూపే సందర్భంలో కాకుండా... ఇక్కడ ధైర్యం అంటే... ఎంత కష్టం కలిగినా ఓర్చుకుని నిలబడి ప్రయత్నాన్ని కొనసాగించి కృతకృత్యులు కావడం.. ఆయన ధైర్యశాలి. ఆ ధైర్యం వైభవోపేతం...

ఇటువంటి గొప్పగుణాలు జన్మతః లేకపోయినా ప్రతివారూ ప్రయత్నపూర్వకంగా అలవాటు చేసుకోవాలి.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

ఇద్దరు గ్రామస్తుల మధ్యన తమలో ఎవరు గొప్ప భక్తుడనే వాదన మొదలయ్యింది. వందలాది పుణ్య క్షేత్రాలు తిరిగి వచ్చిన తను గొప్ప భక్తుడినని ఒక గ్రామస్తుడు వాదించాడు. ఎన్నో ఉపవాసాలు, వ్రతాలు, దీక్షలు చేసిన తానే నిజమైన భక్తుడని మరో గ్రామస్తుడు వాదించసాగాడు. వాదనలు తీవ్ర రూపం దాల్చడంతో గ్రామం గుండా పోతున్న ఓ గురువును వారు ఆశ్రయించారు.

''మా భక్తి నిరూపించుకోడానికి ఏమైనా చేస్తాం, ఎన్ని సాహసకార్యాలైనా చేయగలం'' అని గట్టిగట్టిగా అరిచి చెప్పారు. వారిద్దరి వాదనలూ ఓపికగా విన్నాడు గురువు.

చిన్న నవ్వు నవ్వి ''మీలో ఎవరు నిజమైన భక్తుడో సులభంగా తెలుసుకోవచ్చు. మీరు నాతోపాటు రండి, ఎన్నో మహిమలను చూపే దేవుడు మా ఆశ్రమంలో ఉన్నాడు. ఆ దేవుడికి మీలో ఎవరు తలనీలాలు సమర్పిస్తారో వారే నిజమైన భక్తులు'' అని సెలవిచ్చాడు.

''అదెంత పని?'' అని వారిద్దరూ ముందుకు వచ్చారు.

''అయితే మా దేవుడికి తలనీలాలు ఎవరైతే సమర్పిస్తారో వారికి ఆ తదనంతరం తలపైన ఒక్క వెంట్రుక కూడా మొలకెత్తదు. దానికి సంసిద్ధులైనవారు మాత్రమే నాతో రాగలరు'' అని గురువు చెప్పాడు.

మొక్కుబడి



అంతే... అప్పటిదాకా గొప్ప భక్తులమని చెప్పుకున్న ఇద్దరూ, చల్లగా అక్కడినుంచి జారుకోబోయారు.

వారిని ఆపిన గురువు ''భవిష్యత్తులో వెంట్రుకలు రావని చెప్పేసరికి మీరు తలనీలాలు ఇవ్వడానికే సుముఖత చూపడం లేదు. బాహ్య సౌందర్యంలో చిన్న మార్పుకు సైతం అంగీకరించని మీరు అంతః సౌందర్యంలో మార్పులకు అంగీకరిస్తారా..? నిజమైన భక్తుడు ఎప్పుడూ లాభనష్టాలు బేరీజు వేయడు. సంపూర్ణంగా తనను నమ్మి సర్వస్వ శరణాగతి కోరే వారి వెంటే దేవుడు సర్వకాల సర్వావస్థలలోనూ ఉంటాడు'' అని వివరించాడు.

తప్పు తెలుసుకున్న ఆ ఇద్దరు గ్రామస్తులు గురువును క్షమాపణ కోరారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

అమృత బిందువులు

- ఎవరికీ తల వంచనిది ఆత్మగౌరవం. ఎవరి ముందూ చేయి చాచనిది ఆత్మాభిమానం. ఎవరినీ కాదనలేనిది ఆత్మీయత. ఈ మూడు ఆత్మలు కూడిన మనిషి జీవితం సఫలం.
- వేడినీరు ఒకటే... కాని కోడిగుడ్డును ఉడికిస్తే గట్టిపడుతుంది. అలుగడ్డను ఉడికిస్తే మెత్తబడుతుంది. రాగద్వేషాలు ఒక్కటే కాని ... ఆనందం కలిగినప్పుడు ఆనంద బాష్పాలు అవే. దుఃఖం కలిగినప్పుడు కన్నీటి ఓదార్పులు అవే.

సినిమా


వరుణ్ తేజ్

వైజాగ్ నేపథ్యంలో...

హీరో వరుణ్ తేజ్, దర్శకుడు కరుణకుమార్('పలాస' మూవీ ఫేమ్) కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వరుణ్‌కి ఓ కథను వినిపించారట కరుణకుమార్. స్క్రిప్ట్ నచ్చడంతో ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని సమాచారం. పీరియాడికల్ క్రైమ్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమా వైజాగ్ నేపథ్యంలో ఉంటుందట. ఈ మూవీ కోసం వరుణ్ స్పెషల్ మేకోవర్ కానున్నారని టాక్. సెప్టెంబర్‌లో ఈ చిత్రం షూటింగ్ స్టార్ట్ అవుతుందని భోగట్టా. త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలున్నాయి. మరోవైపు 'గాండీవధారి అర్జున' సినిమా కోసం ప్రస్తుతం వరుణ్ తేజ్ బుడాపెస్ట్‌లో ఉన్నారు. అలాగే హిందీలో శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు వరుణ్ తేజ్.


రజనీకాంత్

మాస్ జైలర్

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'జైలర్'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించారు. ఇందులో శివరాజ్ కుమార్, మోహన్‌లాల్, జాకీశ్రాఫ్, సునీల్, రమ్యకృష్ణ, తమన్నా, మీర్నా మీనన్ కీలక పాత్రలు పోషించారు. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్‌పై రూపొందిన ఈ చిత్రం ఆగస్టు 10న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. కాగా ఆదివారం 'జైలర్' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. స్టైల్‌గా కారులో కూర్చున్న రజనీ మాస్ లుక్ ఆకట్టుకుంటోంది. కాగా రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న 'లాల్‌సలామ్' సినిమా షూటింగ్ కోసం ప్రస్తుతం ముంబైలో ఉన్నారు రజనీకాంత్. అలాగే 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా షూటింగ్ కూడా త్వరలోనే మొదలు కానుంది.


శ్రీనివాసా చిట్టూరి, ప్రియమణి, కృతీశెట్టి, నాగచైతన్య, వెంకట్ ప్రభు, పవన్ కుమార్

అందరూ నా కస్టడీలోకి రావాలి – నాగచైతన్య

''**కస్టడీ**' సినిమా తొలి 20 నిమిషాలు డైరెక్టర్ వెంకట్‌గారిలా కూల్‌గా వెళుతుంది. 40వ నిమిషం నుంచి ఫాస్ట్‌గా వెళుతుంది.. థియేటర్లో బ్లాస్టే. అద్భుతమైన యాక్షన్స్ సీక్వెన్స్ ఉన్నాయి. నిజంగా ఒక కొత్త చైతుని (నాగచైతన్య) చూడబోతున్నారు.. అలా నా పాత్రని తీర్చిదిద్దారు వెంకట్‌గారు. ఈ నెల 12న మీరందరూ (ప్రేక్షకులు, అభిమానులు) నా కస్టడీలోకి రావాలని, నా కస్టడీలోనే ఉండాలని కోరుకుంటున్నాను'' అని నాగచైతన్య అన్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీశెట్టి జంటగా నటించిన చిత్రం 'కస్టడీ'. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాసా చిట్టూరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నాగచైతన్య మాట్లాడుతూ – ''కస్టడీ' కథని వెంకట్‌గారు నాకు చెప్పినప్పుడు తొలిసారి నేను పైకిలేచి వెంటనే ఆయన్ని హత్తుకున్నా.. నాకు అంత ఎగ్జైట్‌మెంట్ ఇచ్చింది ఈ కథ. ఎడిటింగ్ రూంలో చూసినప్పుడు కూడా అదే ఎగ్జైట్‌మెంట్ వచ్చింది. అదే నమ్మకంతో ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నా. అజిత్, సూర్య, కార్తీ, శింబుగార్లతో వెంకట్‌గారు సినిమాలు తీసి తమిళ్‌లో ఎన్నో పెద్ద హిట్స్ ఇచ్చారు. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి వచ్చిన ఆయనకు స్వాగతం. నా కెరీర్‌లో భారీ బడ్జెట్ మూవీ 'కస్టడీ' అని చెప్పగలను. ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతలు శ్రీనివాస్, పవన్‌గార్లకు కృతజ్ఞతలు'' అన్నారు.

వెంకట్ ప్రభు మాట్లాడుతూ– ''ఈ సినిమాలో చైతన్యగారి స్టైల్, యాక్షన్, నటన, ఫ్యామిలీ సెంటిమెంట్, మాస్... ఇలా అన్నీ ఉన్నాయి. ఈ మూవీలో మీకు ఓ పెద్ద సర్‌ప్రైజ్ ఉంటుంది. 'కస్టడీ' రెండో పార్ట్ కూడా ఉంటుంది'' అన్నారు. ''అందరూ థియేటర్స్‌కి వచ్చి 'కస్టడీ' చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు నటి ప్రియమణి. ఈ వేడుకలో కృతీశెట్టి, నటుడు ప్రేమ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

అలాంటి సినిమాలంటే చాలా ఇష్టం – సందీప్ కిషన్


కావ్య థాపర్, సందీప్ కిషన్

''డైరెక్టర్ ఆనంద్, నేను మంచి స్నేహితులం. 'ఊరు పేరు భైరవకోన' లాంటి సినిమాని ఆయన నాతో చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇలాంటి ఫాంటసీ, అడ్వెంచర్ సినిమాలంటే నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా, వర్ష బొల్లమ్మ, కావ్య థాపర్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ–''నా పుట్టినరోజున(ఆదివారం) ఈ మూవీ టీజర్ విడుదల కావడం స్పెషల్ మూమెంట్. తొలిసారి చండీయాగం చేసి టీజర్ రిలీజ్ చేయడం చాలా పాజిటివ్‌గా ఉంది. అనిల్ సుంకరగారు లేకపోతే ఈ సినిమా ఇక్కడి వరకూ వచ్చేది కాదు'' అన్నారు. ''టైగర్' సినిమా నుంచి సందీప్, నాకు స్నేహం మొదలైంది. మరోసారి కలసి సినిమా చేస్తే ఇంకా గ్రాండ్‌గా ఉండాలని 'ఊరు పేరు భైరవకోన' చేశాం'' అన్నారు వీఐ ఆనంద్. ''ఈ సినిమా సందీప్ కెరీర్‌లో మరచిపోలేని బహుమతి అవుతుందని మాట ఇస్తున్నా'' అన్నారు అనిల్ సుంకర. ''మహాచండీ యాగంతో టీజర్‌లాంచ్ చేయడం ఇండస్ట్రీలో ఇదే తొలిసారి. ఈ ఐడియా ఇచ్చిన సందీప్‌గారికి థ్యాంక్స్'' అన్నారు రాజేష్ దండా. హీరోయిన్ కావ్య థాపర్ మాట్లాడారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రాజ్ తోట.

మైనస్ 15 డిగ్రీల చలిలో...


రకుల్

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ ఓ సాహసం చేశారు. మైనస్ 15 డిగ్రీల చలిలో ఐస్‌బాత్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో, ఫోటోలను రకుల్ సోషల్ మీడియాలో షేర్ చేయగా వైరల్ అవుతున్నాయి. అయితే రకుల్ ఇలా చేసింది సినిమా కోసం కాదు. క్రయోథెరపీలో భాగంగా ఐస్‌బాత్ చేశారనే టాక్ వినిపిస్తోంది. కండరాల నొప్పి నివారణ, మెరుగైన చర్మ సౌందర్యం వంటి వాటికోసం క్రయోథెరపీని ఫాలో అవుతారట. ఇక కమల్ హాసన్ 'ఇండియన్ 2', శివ కార్తికేయన్ 'అలయాన్' సినిమాల్లో నటించారు రకుల్. 'అలయాన్' నవంబరులో విడుదల కానుంది. అయితే 'ఇండియన్ 2' రిలీజ్ డేట్‌పై అతి త్వరలో ఓ స్పష్టత రానుంది.

యాత్ర 2 ఉంటుంది – డైరెక్టర్ మహీ వి. రాఘవ్



''యాత్ర' సినిమాని ప్రేక్షకులు బాగా ఆదరించారు. ప్రస్తుతం 'యాత్ర 2' సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అయితే ఆ చిత్రంలోని పాత్రలకు తగ్గ నటీనటులు కుదరడం లేదు. పూర్తి కథ, నటీనటులు ఫైనల్ అయ్యాక 'యాత్ర 2' ని సెట్స్‌పైకి తీసుకెళతాం'' అని డైరెక్టర్ మహీ వి.రాఘవ్ అన్నారు. ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్య కృష్ణ, 'జోర్దార్' సుజాత, దేవయాని, పావని గంగిరెడ్డి, హర్షవర్ధన్ లీడ్ రోల్స్‌లో నటించిన వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్'. మహీ వి.రాఘవ్, ప్రదీప్ అద్వైతం షో రన్నర్స్‌గా తేజ కాకుమాను దర్శకత్వం వహించారు. మహీ వి.రాఘవ్, చిన్నా వాసుదేవరెడ్డి నిర్మించిన ఈ వెబ్ సిరీస్ ఏప్రిల్ 27నుంచి డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా మహీ వి.రాఘవ్ పంచుకున్న విశేషాలు...

- మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని 'సేవ్ ది టైగర్స్' నిరూపించింది. కుటుంబం అంతా కలిసి మా వెబ్ సిరీస్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.. దీంతో ఒక మంచి సిరీస్ తీశామనే తృప్తి ఉంది. ఇలాంటి చక్కని సిరీస్‌ని నిర్మించే అవకాశం మాకు కల్పించిన డిస్నీ హాట్‌స్టార్‌కి థ్యాంక్స్. త్వరలో 'సేవ్ ది టైగర్స్' రెండో సిరీస్ షూటింగ్ ప్రారంభిస్తాం.
- ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఎన్నికల సమయంలో 'యాత్ర 2' ని విడుదల చేయనున్నారని, ఆ సినిమా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నకి సపోర్ట్‌గా ఉంటుందని వినిపిస్తున్న మాటల్లో వాస్తవం లేదు. ఎందుకంటే సినిమా వల్ల ఓట్లు వస్తాయనుకోవడం అపోహ మాత్రమే. అలా అనుకుంటే ఇతర పార్టీల వారు కూడా నాలుగైదు సినిమాలు తీసుకోవచ్చు కదా? ఓటర్లందరూ నా 'యాత్ర' సినిమాని చూసుంటే 'బాహుబలి'లా పెద్ద సినిమా అయ్యేది. ఓటర్లందరూ సినిమాలు చూస్తారని అనుకోవడం లేదు.

జగన్ అన్న పాదయాత్రతో...

'యాత్ర 2' సినిమా జగన్ అన్న పాదయాత్ర నుంచి మొదలై ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వరకూ ఉంటుంది. కథ మొత్తం పూర్తయ్యాక ఆ వివరాలు చెబుతాను. ప్రస్తుతం నేను దర్శకత్వం వహించిన 'సిద్దా లోకం ఎలా ఉంది నాయనా?' అనే సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే 'సైతాన్' అనే కొత్త వెబ్ సిరీస్‌తో జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను.

రంగుల ప్రపంచం


క్రాంతి, శ్రీలు

క్రాంతి హీరోగా, శ్రీలు హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'కొత్త రంగుల ప్రపంచం'. నటుడు థర్టీ ఇయర్స్ పృథ్వీ ఈ సినిమాతో తొలిసారి మెగాఫోన్ పట్టారు. గుంటక శ్రీనివాస్ రెడ్డి, కె.కృష్ణారెడ్డి, పద్మ రేఖ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను నటుడు, నిర్మాత నాగబాబు విడుదల చేశారు. ''కొత్త రంగుల ప్రపంచం' వంటి మంచి కథలో నటించే అవకాశం కల్పించిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు క్రాంతి. ''మా నాన్న(పృథ్వీ) దర్శకత్వం వహించిన తొలి సినిమాతో నేను హీరోయిన్‌గా పరిచయమవడం సంతోషంగా ఉంది''అన్నారు శ్రీలు. ఈ కార్యక్రమంలో నటుడు సుమన్, చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



మాడ్రిడ్ ఓపెన్ విజేత సబలెంకా

మహిళల టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను ఓడించి బెలారస్ స్టార్ సబలెంకా మాడ్రిడ్ ఓపెన్ డబ్ల్యూటీఏ ప్రీమియర్ టోర్నీలో రెండోసారి చాంపియన్‌గా నిలిచింది. 2021లో ఈ టైటిల్‌ను నెగ్గిన రెండో ర్యాంకర్ సబలెంకా ఈ ఏడాది ఫైనల్లో 6-3, 3-6, 6-3తో స్వియాటెక్‌పై గెలిచింది. సబలెంకా కెరీర్‌లో ఇది 12వ సింగిల్స్ టైటిల్. విజేతగా నిలిచిన సబలెంకాకు 11,05,265 యూరోల (రూ. 10 కోట్ల 12 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.

అర్జున్‌కు రెండో విజయం



టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ రెండో విజయం సాధించాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌తో ఆదివారం స్వీడన్‌లో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో అర్జున్ 38 ఎత్తుల్లో గెలుపొందాడు. నాలుగు రౌండ్ల తర్వాత అర్జున్ రెండు పాయింట్లతో ఐదో స్థానంలో, గుకేశ్ 2.5 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో ఉన్నారు.

గుజరాత్ పరుగుల ప్రవాహం



- 56 పరుగులతో లక్నోపై విజయం
- చెలరేగిన గిల్, సాహా

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ తమ జోరు కొనసాగిస్తోంది. అద్భుత బ్యాటింగ్‌తో భారీ విజయం సాధించిన జట్టు ప్లేఆఫ్స్ దశకు చేరువైంది. ఆదివారం జరిగిన పోరులో గుజరాత్ 56 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (51 బంతుల్లో 94 నాటౌట్; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), వృద్ధిమాన్ సాహా (43 బంతుల్లో 81; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 74 బంతుల్లోనే 142 పరుగులు జోడించడం విశేషం. అనంతరం కృనాల్ పాండ్యా సారథ్యంలోని లక్నో 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 171 పరుగులకే పరిమితమైంది. డి కాక్ (41 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), కైల్ మేయర్స్ (32 బంతుల్లో 48; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. సాహా, గిల్ చెలరేగడంతో గుజరాత్ వేగంగా దూసుకుపోయింది. మొహసిన్ ఓవర్లో సాహా 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో చెలరేగడంతో పవర్‌ప్లేలో స్కోరు 78 పరుగులకు చేరింది. సాహా 20 బంతుల్లో, గిల్ 29 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. లక్నో ఎట్టకేలకు 12వ ఓవర్లో తొలి వికెట్ భాగస్వామ్యాన్ని విడదీయగలిగినా... గిల్‌తో పాటు కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 25; 1 ఫోర్, 2 సిక్స్‌లు), మిల్లర్ (12 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) అదే జోరు కొనసాగించి స్కోరును 200 దాటించారు. ఛేదనలో మేయర్స్, ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన డికాక్ కూడా ప్రత్యర్థి తరహాలోనే పోటీ పడి పరుగులు సాధిస్తూ ఘనమైన ఆరంభాన్నందించారు. వీరిద్దరి జోరు చూస్తే హోరాహోరీ పోరు తప్పదనిపించింది. అయితే 9వ ఓవర్లో తొలి వికెట్‌గా మేయర్స్ వెనుదిరగ్గా...ఆ తర్వాత లక్నో పరిస్థితి అంతా ఒక్కసారిగా తలకిందులైంది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	11	6	4	1	13	0.409
లక్నో	11	5	5	1	11	0.294
రాజస్తాన్	11	5	6	0	10	0.388
బెంగళూరు	10	5	5	0	10	-0.209
ముంబై	10	5	5	0	10	-0.454
పంజాబ్	10	5	5	0	10	-0.472
కోల్‌కతా	10	4	6	0	8	-0.103
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	10	4	6	0	8	-0.529

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: వృద్ధిమాన్ సాహా (సి) (సబ్) ప్రేరక్ మన్కడ్ (బి) అవేశ్ ఖాన్ 81; శుబ్‌మన్ గిల్ (నాటౌట్) 94; హార్దిక్ పాండ్యా (సి) కృనాల్ పాండ్యా (బి) మొహసిన్ 25; మిల్లర్ (నాటౌట్) 21; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (20 ఓవర్లలో 2 వికెట్లకు) 227. **వికెట్ల పతనం:** 1-142, 2-184. **బౌలింగ్:** మొహసిన్ 3-0-42-1, అవేశ్ ఖాన్ 4-0-34-1, కృనాల్ పాండ్యా 4-0-38-0, యశ్ ఠాకూర్ 4-0-48-0, రవి బిష్ణోయ్ 2-0-21-0, మేయర్స్ 1-0-16-0, స్వప్నిల్ 1-0-7-0, స్టొయినిస్ 1-0-20-0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) రషీద్ ఖాన్ (బి) మోహిత్ శర్మ 48; డికాక్ (బి) రషీద్ 70; దీపక్ హుడా (సి) రాహుల్ తెవాటియా (బి) షమీ 11; స్టొయినిస్ (సి) షమీ (బి) మోహిత్ శర్మ 4; నికోలస్ పూరన్ (సి) షమీ (బి) నూర్ అహ్మద్ 3; ఆయుశ్ బదోని (సి) నూర్ (బి) మోహిత్ శర్మ 21; స్వప్నిల్ (నాటౌట్) 2; కృనాల్ పాండ్యా (సి) మిల్లర్ (బి) మోహిత్ శర్మ 0; బిష్ణోయ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 171. **వికెట్ల పతనం:** 1-88, 2-114, 3-130, 4-140, 5-153, 6-166, 7-166. **బౌలింగ్:** షమీ 4-0-37-1, హార్దిక్ పాండ్యా 3-0-37-0, రషీద్ ఖాన్ 4-0-34-1, నూర్ అహ్మద్ 4-0-26-1, మోహిత్ శర్మ 4-0-29-4, జోసెఫ్ 1-0-5-0.



మైక్ హస్సీ, డేవిడ్ హస్సీ తర్వాత ఒక టి20 మ్యాచ్‌లో కెప్టెన్ హోదాలో అన్నదమ్ములు (కృనాల్, హార్దిక్ పాండ్యా) ప్రత్యర్థులుగా తలపడటం ఇది రెండోసారి మాత్రమే.

సూపర్ రైజర్స్

- చివరి బంతికి అద్భుత విజయం
- 215 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన హైదరాబాద్
- మలుపు తిప్పిన ఫిలిప్స్
- 4 వికెట్లతో రాజస్తాన్ ఓటమి





జైపూర్: లక్ష్యం 215 పరుగులు... 17 ఓవర్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ స్కోరు 171 పరుగులు. గెలవాలంటే చివరి 3 ఓవర్లలో 44 పరుగులు కావాలి. అయితే 18వ ఓవర్లో కీలక బ్యాటర్లు రాహుల్ త్రిపాఠి, మార్క్‌రమ్‌లను చహల్ అవుట్ చేయడంతో రాజస్తాన్ రాయల్స్ పైచేయి సాధించింది. కానీ కుల్దీప్ యాదవ్ వేసిన తర్వాతి ఓవర్లో తొలి నాలుగు బంతులను 6, 6, 6, 4గా మలచి గ్లెన్ ఫిలిప్స్ మ్యాచ్‌ను మళ్లీ రైజర్స్ చేతుల్లోకి తెచ్చాడు. ఐదో బంతికి అతను అవుట్ కాగా, ఆఖరి ఓవర్లో సమీకరణం 17 పరుగులుగా మారింది. సందీప్ శర్మ వేసిన ఈ ఓవర్లో తొలి 5 బంతుల్లో 12 పరుగులు వచ్చాయి. చివరి బంతికి అబ్దుల్ సమద్‌ను అవుట్ చేసి సందీప్ శర్మ సంబరాలు చేసుకున్నాడు. అయితే అది నోబాల్‌గా తేలింది. సన్‌రైజర్స్ విజయానికి ఫోర్ అవసరం కాగా, సందీప్ మళ్లీ వేసిన ఆఖరి బంతిని సమద్ సిక్సర్‌గా మలిచాడు! దాంతో సన్‌రైజర్స్ శిబిరం సంబరాల్లో మునిగిపోగా, జైపూర్ స్టేడియం మూగబోయింది. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ 4 వికెట్ల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్తాన్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. జోస్ బట్లర్ (59 బంతుల్లో 95; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా, కెప్టెన్ సంజు సామ్సన్ (38 బంతుల్లో 66 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 81 బంతుల్లోనే 138 పరుగులు జోడించడం విశేషం. అనంతరం హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 217 పరుగులు సాధించింది. అభిషేక్ శర్మ (34 బంతుల్లో 55; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ త్రిపాఠి (29 బంతుల్లో 47; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆఖర్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (7 బంతుల్లో 25; 1 ఫోర్, 3 సిక్స్‌లు), సమద్ (7 బంతుల్లో 17 నాటౌట్; 2 సిక్స్‌లు) మెరుపులు జట్టును గెలిపించాయి. కీలక క్యాచ్‌లు వదిలేసి, సునాయాస రనౌట్ అవకాశం చేజార్చుకొని రాజస్తాన్ తగిన మూల్యం చెల్లించుకుంది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) నటరాజన్ (బి) జాన్సెన్ 35; బట్లర్ (ఎల్బీ) (బి) భువనేశ్వర్ 95; సామ్సన్ (నాటౌట్) 66; హెట్‌మైర్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం** (20 ఓవర్లలో 2 వికెట్లకు) 214. **వికెట్ల పతనం:** 1-54, 2-192. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-44-1, జాన్సెన్ 4-0-44-1, నటరాజన్ 4-0-36-0, మార్కండే 4-0-51-0, అభిషేక్ 2-0-15-0, విద్వాంత్ 2-0-18-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అన్‌మోల్‌ప్రీత్ (సి) హెట్‌మైర్ (బి) చహల్ 33; అభిషేక్ (సి) చహల్ (బి) ఆర్.అశ్విన్ 55; త్రిపాఠి (సి) యశస్వి (బి) చహల్ 47; క్లాసెన్ (సి) బట్లర్ (బి) చహల్ 26; మార్క్‌రమ్ (ఎల్బీ) (బి) చహల్ 6; ఫిలిప్స్ (సి) హెట్‌మైర్ (బి) కుల్దీప్ 25; సమద్ (నాటౌట్) 17; జాన్సెన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 217. **వికెట్ల పతనం:** 1-51, 2-116, 3-157, 4-171, 5-174, 6-196. **బౌలింగ్:** సందీప్ శర్మ 4-0-48-0, కుల్దీప్ యాదవ్ 4-0-50-1, ఆర్. అశ్విన్ 4-0-35-1, చహల్ 4-0-29-4, మురుగన్ అశ్విన్ 3-0-42-0, మెకాయ్ 1-0-13-0.

క్వార్టర్స్‌లో హుసాముద్దీన్



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (57 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ 5-0తో సావిన్ ఎడువార్డ్ (రష్యా)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన దీపక్ (51 కేజీలు) సంచలన విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. రెండో రౌండ్‌లో దీపక్ 5-2తో 2021 ప్రపంచ చాంపియన్ బిబోసినోవ్ (కజకిస్తాన్)ను బోల్తా కొట్టించాడు. 75 కేజీల విభాగం రెండో రౌండ్‌లో సుమిత్ కుండు 1-3తో సోసులిన్ పావెల్ (రష్యా) చేతిలో... ప్లస్ 92 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో నరేందర్ 0-5తో అర్జోలా అలెజాంద్రో (క్యూబా) చేతిలో ఓడిపోయారు.

రజతం నెగ్గిన జెరెమి



జిన్‌జూ (దక్షిణ కొరియా): ఆసియా సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో రెండో పతకం చేరింది. పురుషుల 67 కేజీల విభాగంలో జెరెమి లాల్‌రినుంగా స్నాచ్ ఈవెంట్‌లో 141 కేజీలు బరువెత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. అయితే మిజోరం రాష్ట్రానికి చెందిన 20 ఏళ్ల జెరెమి క్లీన్ అండ్ జెర్క్ ఈవెంట్‌లో తడబడి మొత్తం బరువును నమోదు చేయడంలో విఫలమయ్యాడు. మూడు క్లీన్ అండ్ జెర్క్ అవకాశాల్లోనూ జెరెమి నిర్ధారిత బరువును ఎత్తలేకపోయాడు. శనివారం జరిగిన మహిళల 55 కేజీల విభాగంలో బింద్యారాణి భారత్‌కు రజత పతకం అందించిన సంగతి తెలిసిందే.

ఆసియా క్రీడలకు భారత బ్యాడ్మింటన్ జట్ల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్‌లలో చైనాలో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ జట్లను ప్రకటించారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-20లో ఉన్న వారిని నేరుగా ఎంపిక చేయగా... మిగతా బెర్త్‌లను ఆదివారం ముగిసిన సెలెక్షన్ ట్రయల్స్ టోర్నీ ద్వారా ఖరారు చేశారు. **భారత పురుషుల జట్టు:** ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్య సేన్, మిథున్ మంజునాథ్, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల-ఎంఆర్ అర్జున్, రోహన్ కపూర్, సాయిప్రతీక్. **మహిళల జట్టు:** పీవీ సింధు, అష్మిత, అనుపమ, మాళవిక, గాయత్రి గోపీచంద్-ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో, సిక్కి రెడ్డి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్శిటీ, గుంటూరులో 46 పోస్టులు

గుంటూరులోని లామ్‌లో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ సీఎస్ స్కీమ్‌లో భాగంగా తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 46
- **పోస్టుల వివరాలు:** ఫీల్డ్ సూపర్‌వైజర్-05, స్టాటిస్టిషియన్-01, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ -34, కంప్యూటర్ స్టాఫ్-03, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-03.
- **అర్హత:** పోస్టులను అనుసరించి డిగ్రీ,బీసీఏ, బీఈ, బీటెక్, ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** కంప్యూటర్ స్టాఫ్/జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించకూడదు. ఇతర పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్:** andhrapradeshcss@gmail.com
- **దరఖాస్తులకు చివరితేది:** 10.05.2023.
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

ఇండియన్ నేవీలో 227 ఎస్ఎస్‌సీ ఆఫీసర్ పోస్టులు

కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవీ ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2024, జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 227
- **పోస్టులు:** జనరల్ సర్వీస్-50, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్-10, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్-20, పైలట్-25, లాజిస్టిక్స్-30, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్-15, ఎడ్యుకేషన్-12, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)-20, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)-60.
- **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏ,ఎంసీఏ,పీజీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100, ఇతర అలవెన్సులు.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలతో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.05.2023.
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఇలా చేస్తే.. టాప్ ర్యాంక్ ఖాయం

ఇంజనీరింగ్.. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం! ఇందుకోసం ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు అధిక శాతం మంది ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా తెలంగాణలో టీఎస్ ఎంసెట్, ఆంధ్రప్రదేశ్‌లో ఈఏపీసెట్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల సంఖ్య భారీగా ఉంటోంది. అలాగే ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యార్థులు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు వీలుగా ఈ ఎంట్రెన్స్‌లు రాస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో త్వరలో ఈ ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. బెస్ట్ ర్యాంకుకు నిపుణుల సలహాలు...

- మే 15 నుంచి ఏపీ ఈఏపీసెట్; మే 10 నుంచి టీఎస్ ఎంసెట్
- ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, అనుబంధ కోర్సుల్లో ప్రవేశం
- తెలంగాణలో బీఎస్సీ (నర్సింగ్)కు కూడా ఎంసెట్ ర్యాంకే ఆధారం
- కాన్సెప్ట్‌లపై పట్టుతోనే బెస్ట్ ర్యాంకు అంటున్న నిపుణులు



ఇంటర్మీడియెట్ (ఎంపీసీ/బైపీసీ) అర్హతగా బీటెక్, అగ్రికల్చర్ అనుబంధ కోర్సులు, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్, అగ్రిలక్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీసెట్)గా; తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎంసెట్)గా ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

జేఈఈకి పోటీ పడుతున్న విద్యార్థులు సైతం ఈఏపీసెట్, ఎంసెట్‌లకు సన్నద్ధమవుతుంటారు. దీంతో పోటీ కూడా తీవ్రంగానే ఉంటోంది. పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే మంచి ర్యాంకు సొంతం చేసుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

ఏపీలో కోర్సులు ఇవే

- ఏపీలో ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో..ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బీటెక్ (డైరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్),బీటెక్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో.. బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ, బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్సెస్ కోర్సులు ఉన్నాయి.
- ఫార్మసీ విభాగంలో.. బీ-ఫార్మసీ, ఫార్మ్-డి కోర్సులున్నాయి.

తెలంగాణలో కోర్సులు

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో.. బీఈ/బీటెక్, బీటెక్ బయో టెక్నాలజీ, బీటెక్(డైరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.
- అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్‌లో.. బీఎస్సీ అగ్రికల్చర్(ఆనర్స్), బీఎస్సీ హార్టికల్చర్ (ఆనర్స్), బీఎస్సీ ఫారెస్ట్రీ, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్‌సీ, ఫార్మ్ డీ కోర్సులున్నాయి.
- తెలంగాణలో ఈ ఏడాది నుంచి బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఎంసెట్‌లో అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్ ర్యాంకును పరిగణనలోకి తీసుకోనున్నారు.
- ఫార్మసీ కోర్సులకు సంబంధించి 50 శాతం సీట్లను ఇంజనీరింగ్ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా, మరో 50 శాతం సీట్లను ఫార్మసీ/మెడిసిన్ స్ట్రీమ్ ర్యాంకుతో భర్తీ చేస్తారు.

పరీక్ష సిలబస్

ఈ ఏడాది ఈఏపీసెట్, ఎంసెట్‌కు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సిలబస్‌లో 70 శాతం సిలబస్‌నే ఎంట్రన్స్ సిలబస్‌గా పేర్కొన్నారు. 2021-22లో మొదటి సంవత్సరం విద్యార్థులకు కోవిడ్ కారణంగా 30 శాతం సిలబస్‌ను తగ్గించిన విషయం తెలిసిందే. దానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు.

మొత్తం 160 మార్కులకు పరీక్ష

- ఏపీ ఈఏపీసెట్, టీఎస్ ఎంసెట్.. ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మసీ స్ట్రీమ్‌లకు వేర్వేరుగా.. మొత్తం 160 మార్కులకు నిర్వహించనున్నారు.
- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో.. మ్యాథమెటిక్స్ నుంచి 80; ఫిజిక్స్ నుంచి 40; కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతుంది.
- అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్‌లో..బయాలజీ(బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు.

ప్రిపరేషన్ ఇలా

మ్యాథమెటిక్స్‌కు 50 శాతం వెయిటేజీ

ఇంజనీరింగ్ స్ట్రీమ్ ఎంట్రన్స్‌లో 50 శాతం వెయిటేజీ ఉన్న సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్. కాబట్టి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తొలుత ప్రాథమిక సూత్రాలపై పట్టుసాధించాలి. త్రికోణమితిలో సూత్రాలు ఎక్కువగా ఉంటాయి. వాటిని గుర్తుపెట్టుకొని సరైన చోట అన్వయించగలిగేలా ప్రిపరేషన్ సాగించాలి. దీంతోపాటు విద్యార్థులు వేగం, కచ్చితత్వంపై దృష్టి సారించాలి.

ముఖ్య చాప్టర్లు: ఇంటర్ మ్యాథ్స్ సిలబస్‌ను ఆల్జీబ్రా, కాల్కులస్, జామెట్రీ, వెక్టార్ ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీగా విభజించొచ్చు. విద్యార్థులు బోర్డు పరీక్షల కోణంలో లిమిట్స్ అండ్ కమ్యూనిటీ, డిఫరెన్షియేషన్, అప్లికేషన్స్ ఆఫ్ డెరివేటివ్స్, ఇంటిగ్రేషన్స్, డిఫైనెట్ ఇంటిగ్రల్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్‌పై దృష్టిపెట్టి ఉంటారు. జామెట్రీలో 2డీ, 3డీ జ్యామెట్రీ, లోకస్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ యాక్సెస్, స్ట్రెయిట్ లైన్స్, సర్కిల్, సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, పారాబోలా, ఎల్లిప్స్, డైరక్షన్ కొసైన్స్, డైరక్షన్ రేషియోస్, ప్లేన్ తదితరాలు కీలక అంశాలుగా ఉంటాయి. అదే విధంగా ఆల్జీబ్రాలో ఫంక్షన్లు, మ్యాథమెటికల్ ఇండక్షన్, మ్యాట్రిసెస్, కాంప్లెక్స్ నంబర్స్, డిమోవియర్స్ థీరమ్, క్వాడ్రాటిక్ ఎక్స్‌ప్రెషన్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్ తదితరాలపై ఫోకస్ పెట్టాలి. ట్రిగనోమెట్రిలో ట్రిగనోమెట్రి రేషియోస్ అప్టు ట్రాన్స్‌ఫర్మేషన్స్, ట్రిగనోమెట్రిక్ ఈక్వేషన్స్, ఇన్వెర్స్ ట్రిగనోమెట్రిక్ ఫంక్షన్స్, హైపర్‌బోలిక్ ఫంక్షన్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్ టాపిక్స్‌ను సమగ్రంగా ప్రిపర్ కావాలి. వెక్టర్ ఆల్జీబ్రా నుంచి ఐదు లేదా ఆరు ప్రశ్నలు వస్తున్నాయి. అడిషన్ ఆఫ్ వెక్టర్స్, ప్రొడక్ట్ ఆఫ్ వెక్టర్స్, మెజర్స్ ఆఫ్ డిస్పెర్షన్ అండ్ ప్రాబబిలిటీలో.. మెజర్స్ ఆఫ్ డిప్రెషన్, ప్రాబబిలిటీ, ర్యాండమ్ వేరియబుల్స్, ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్‌పై పట్టు సాధించాలి.

-ఎం.ఎస్.రావు, సబ్జెక్ట్ నిపుణులు

ఫిజిక్స్‌పై పట్టు కీలకం

ఈ విభాగంలో కొంచెం ఎక్కువ వెయిటేజీ ఉన్న అంశం.. హీట్ అండ్ థర్మోడైనమిక్స్. ఈ చాప్టర్ నుంచి దాదాపు పది ప్రశ్నలు అడిగే అవకాశముంది. దీని తర్వాత వర్క్ ఎనర్జీ పవర్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్ అండ్ రొటేషనల్ మోషన్, లాస్ ఆఫ్ మోషన్, మోషన్ ఇన్ ఎ ప్లేన్, మూవింగ్ చార్జెస్ అండ్ మ్యాగ్నటిజం చాప్టర్ల నుంచి ఐదు లేదా ఆరు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. గ్రావిటేషన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆసిలేషన్స్, వేవ్స్, ఎలక్ట్రోస్టాటిక్ పొటెన్షియల్ అండ్ కెపాసిటెన్స్‌పై నాలుగు ప్రశ్నల చొప్పున అడిగే అవకాశం ఉంది. వీటి తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఇండక్షన్, రే ఆప్టిక్స్, ఆల్టర్నేటింగ్ కరెంట్, వేవ్ ఆప్టిక్స్, మోషన్ ఇన్ ఎ స్ట్రెయిట్ లైన్, మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్, ఎలక్ట్రిక్ చార్జెస్ అండ్ ఫీల్డ్స్, డ్యూయెల్ నేచర్ ఆఫ్ రేడియేషన్ అండ్ మేటర్, న్యూక్లియై, సెమికండక్టర్ ఎలక్ట్రానిక్స్‌పై దృష్టిపెట్టాలి. పరీక్షలో అత్యధిక వెయిటేజీ ఉంటున్న మెకానిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆ తర్వాత ఎలక్ట్రిసిటీ, మోడ్రన్ ఫిజిక్స్ పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

-రవీంద్ర, సబ్జెక్ట్ నిపుణులు

కెమిస్ట్రీ కొంత సులభమే

విద్యార్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఫిజికల్ కెమిస్ట్రీలో.. సొల్యూషన్స్ చాప్టర్ నుంచి ప్రధానంగా ప్రాబ్లమ్ బేస్డ్ ప్రశ్నలు అడుగుతున్నారు. దీంతోపాటు రౌల్ట్స్ లా, ఐడియల్, నాన్ ఐడియల్ సొల్యూషన్స్, సొల్యుబిలిటీ, మొలారిటీ, మొలాలిటీ, వేపర్ ప్రెజర్ ఆఫ్ లిక్విడ్ సొల్యూషన్స్ తదితరాలపై దృష్టిపెట్టాలి. సాలిడ్‌స్టేట్‌లో క్లాసిఫికేషన్ ఆఫ్ క్రిస్టలైన్ సాలిడ్స్, ఎక్స్‌రే క్రిస్టలోగ్రఫీ, బ్యాండ్ థియరీ ఆఫ్ మెటల్స్, మ్యాగ్నెటిక్ ప్రాపర్టీస్, ఎలక్ట్రోకెమిస్ట్రీ చాప్టర్‌లో నెర్న్స్ ఈక్వేషన్‌పై ప్రాబ్లమ్ బేస్డ్ ప్రశ్నలు, ఎలక్ట్రాలసిస్ రిలేటెడ్ ప్రాబ్లమ్స్‌పై ఫోకస్ పెట్టాలి. గ్రూప్ మూలకాలు, బాయిలింగ్, మెల్టింగ్ పాయింట్లు, ఎలక్ట్రోపాజిటివిటీ, ఎలక్ట్రోనెగిటివిటీ, ఫస్ట్ ఆర్డర్ రియాక్షన్, టైప్స్ ఆఫ్ ఎలిమెంట్స్, స్టాండర్డ్ రిడక్షన్, పొటెన్షియల్ వాల్యూమ్ టాపిక్స్‌పై దృష్టిపెట్టాలి. బోరాక్స్, డైబోరేన్ స్ట్రక్చర్, ప్రిపరేషన్, ప్రాపర్టీస్, డైమండ్, గ్రాఫైట్ స్ట్రక్చర్లు, సిలికాన్ల గురించి క్షుణ్నంగా చదవాలి. వీటితోపాటు డి, ఎఫ్-బ్లాక్ ఎలిమెంట్లు, స్టాండర్డ్ రిడక్షన్ పొటెన్షియల్ వాల్యూ, వెన్నర్ థియరీ తదితరాలపై ఫోకస్ పెట్టాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీని జనరల్, హైడ్రోకార్బన్లు, హాలో కాంపౌండ్లుగా విభజించుకొని చదవాలి. ఇందులో హైడ్రోకార్బన్లు, ఆల్కీన్లు, ఆల్కైన్లు, హోమోజినైజేషన్, రియాక్షన్ విత్ బేయర్స్ రియేజెంట్, హాలోజన్, ఎస్ఎల్ మెకానిజమ్స్, యాసిడ్ స్ట్రెంత్ ఆఫ్ ఫీనాల్స్, కార్బాక్సిలిక్ యాసిడ్స్, అమైన్స్‌పై దృష్టిపెట్టాలి. కెమిస్ట్రీని ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలుగా విభజించుకొని చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి దానిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

-విజయ్ కిశోర్, సబ్జెక్ట్ నిపుణులు

బోటనీ

డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్(మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ (బ్యాక్టీరియా, వైరస్), జెనెటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో టెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

-బి.రాజేంద్ర, సబ్జెక్ట్ నిపుణులు

జువాలజీ

డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటోజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనేటా అమెరికానా, ఎకోలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీ అంశాలపై దృష్టి పెట్టాలి.

-కె.శ్రీనివాసులు, సబ్జెక్ట్ నిపుణులు

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ

- ఎంసెట్, ఈఏపీసెట్‌లకు ప్రిపరేషన్ సాగించే క్రమంలో విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు దానికి సంబంధించిన సూత్రాలపై అవగాహనతో అడుగులు వేయాలి.
- ఒక కాన్సెప్ట్‌కు చెందిన ప్రశ్నను భిన్న కోణాల్లో సాధించేందుకు కృషి చేయాలి.
- ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్‌కు ప్రిపరేషన్ సమయం కేటాయించాలి.
- విద్యార్థులు ప్రతి చాప్టర్‌లోని సినాప్సిస్‌పై పట్టు సాధించాలి.

ఏపీ ఈఏపీసెట్-2023 ముఖ్య తేదీలు

- **ఈఏపీ-సెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు:** మే 15 నుంచి మే 19 వరకు;
- **అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్ష తేదీలు:** మే 22, 23
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

టీఎస్ ఎంసెట్ 2023-ముఖ్య సమాచారం

- **టీఎస్ ఎంసెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు:** మే 12, 13, 14
- **అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు:** మే 10, 11 తేదీల్లో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://eamcet.tsche.ac.in/

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	695	61,054
నిఫ్టీ ▽	187	18,069

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,235	△	269
డోజోన్స్	33,674	△	547
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,778	△	76
డాక్స్	15,961	△	227
షాంఘై	3,334	▽	16
నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	△	35

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

రాబడులు చూసి మోసపోవద్దు!



- పెట్టుబడి చేసిన వెంటనే రాబడి ఆశించొద్దు
- ఫలితాలను ఇచ్చే వరకు ఓపిక పట్టాలి
- పనితీరుకు బెంచ్ మార్క్ కీలకం
- ఏడాది, రెండేళ్ల రాబడులను చూడొద్దు
- ఈక్విటీలు ఐదేళ్లకు మించిన కాలానికే
- రాబడులు, రిస్క్ ఆధారంగా పెట్టుబడులు
- అప్పుడే ఆశించిన మేర ఫలితాలు

మ్యూచువల్ ఫండ్స్ పనితీరుపై ఏటా సంవత్సరం ఆరంభంలో పలు సంస్థలు విశ్లేషణా నివేదికలను ప్రకటిస్తుంటాయి. మంచి రాబడులు ఇచ్చినవి, బలహీన, చెత్త పనితీరు చూపించిన వివిధ విభాగాల్లోని మ్యూచువల్ ఫండ్స్‌పై ఇన్వెస్టర్లకు సమగ్ర సమాచారాన్ని అందిస్తుంటాయి. నిజానికి ఈ సమాచారం ఇన్వెస్టర్లు ఫోమో (మంచి పనితీరు చూపించే వాటిని కోల్పోతామనే వెర్రి) బారిన పడేందుకు దారి తీసే ప్రమాదం లేకపోలేదు. వివిధ విభాగాల్లో మంచి పనితీరు చూపించిన టాప్ మ్యూచువల్ ఫండ్స్ సమాచారం చూసినప్పుడు.. ఇన్వెస్టర్లలో తమ పోర్ట్‌ఫోలియోలోని బలహీన రాబడులు ఇచ్చిన పథకాలపై సమీక్ష మొదలవుతుంది. 2020 మార్చి కనిష్టాల నుంచి చూసినప్పుడు 200 శాతానికి పైగా రాబడులు ఇచ్చిన పథకాలను గుర్తించొచ్చు. అటువంటప్పుడు ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో కేవలం 20-40 శాతం రాబడులనే ఇచ్చిన పథకాలను చూస్తే అసహనానికి గురికావచ్చు. ఇది ఆకర్షణీయమైన పథకంలోకి పెట్టుబడులను మళ్లించేలా ప్రేరణ కల్పించొచ్చు. తక్కువ రాబడులు ఇచ్చిన పథకాలు లేదా స్టాక్స్ నుంచి మీ పెట్టుబడులను వెనక్కి తీసేసుకుని, గడిచిన ఏడాది, రెండేళ్లుగా మంచి రాబడులతో దూసుకుపోతున్న పథకాలు లేదా స్టాక్స్ వెంట పడడం ఫోమోనే అవుతుంది. ఇలా ఒక పథకం లేదా స్టాక్స్‌లో పెట్టుబడులను విక్రయించే ముందు ఇన్వెస్టర్లు కేవలం రాబడులనే ప్రామాణికంగా తీసుకోకూడదు. పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే ముందు పరిగణనలోకి తీసుకోవాల్సిన కీలక అంశాలను వివరించే కథనం ఇది...

పెట్టుబడులను తరచూ మదింపు వేయడం మంచి విధానం కాదు. పెట్టుబడి పెట్టిన తర్వాత కొన్ని నష్టాలు చూడొచ్చు. కొన్ని వెంటనే లాభాల క్రమంలో నడవొచ్చు. ఇలా నష్టాలు చూపిస్తున్నవి సరైన ఎంపిక కాదని భావించి వాటిని విక్రయించేసి, లాభాలు చూపిస్తున్న వాటిల్లోకి పెట్టుబడులు మళ్లించే ఇన్వెస్టర్లు చాలా మందే ఉంటారు. కొన్ని సందర్భాల్లో ఇలా చేయడం వల్ల స్వల్పకాలంలో మంచి లాభాలను కళ్లజూస్తారు. కానీ ఆచరణలో ఇలా తరచుగా (ఏడాది, రెండేళ్లలోపు) చేయడం అది అంతిమంగా నష్టాలకు దారితీయవచ్చు. అప్పటి వరకు నష్టాలు చూపించిన వాటిని వదిలించుకుని, లాభాలు కురిపిస్తున్న వాటిల్లోకి ప్రవేశించడం వల్ల ఒక రిస్క్ ఉంది. ఒక ఫండ్ లేదా స్టాక్ అనేది ఎన్నో పరిణామాల ప్రభావంతో మార్కెట్లో ఆటుపోట్ల మధ్య ప్రయాణం చేస్తుంటుంది. కొంత కాలం ర్యాలీ చేయడం కొంత కాలం దిద్దుబాటుకు గురికావడం లేదంటే కొంత కాలం ఒక శ్రేణి పరిధిలో స్థిరీకరణ చెందడం సర్వ సాధారణం. ఒక ఒక వర్గం ఇన్వెస్టర్లు కొంత ర్యాలీ చేసిన ఫండ్స్ లేదా స్టాక్స్‌లో లాభాలను స్వీకరిస్తుంటారు. వీరు ఎక్కువ కాలం పాటు కొనసాగరు. వీరి చర్యతో ఆ ఫండ్ లేదా స్టాక్ అమ్మకాల ఒత్తిడితో అక్కడి నుంచి నష్టపోతుంది. అమ్మకాల ఒత్తిడి తగ్గిన తర్వాత స్థిరీకరణ చెందుతాయి. కొంత కాలం స్థిరీకరణ తర్వాత కనిష్ట స్థాయిల వద్ద వాటిల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ముందుకు రావడం వల్ల అవి తిరిగి ర్యాలీ బాట పడతాయి.



ర్యాలీ చేస్తున్నాయని చెప్పి పెట్టుబడులు అన్నింటినీ తీసుకెళ్లి బుల్లిష్ మూమెంటమ్ ఉన్న వాటిల్లో పెట్టేశారనుకోండి. ఆ తర్వాత అవి కరెక్షన్‌కు లోనైతే అప్పుడు అవి కూడా నష్టాలను చూపిస్తాయి. నష్టాలకు ఓర్చుకోని తత్వం వల్ల ఇన్వెస్టర్లు వాటిని కూడా విక్రయించేందుకు మొగ్గు చూపొచ్చు. ఇలా విక్రయించిన మ్యూచువల్ ఫండ్స్ లేదా స్టాక్స్ ఆ తర్వాత ఏదో ఒక సందర్భంలో తిరిగి ర్యాలీ చేయడం మొదులు పెడతాయి. అందుకని లాభాలనే ప్రామాణికంగా తీసుకుని తరచూ పోర్ట్‌ఫోలియోలో మార్పులు, చేర్పులు చేయకూడదు. దీన్ని ప్రణాళిక లేని పెట్టుబడిగా పేర్కొంటారు. మరో రకం ఇన్వెస్టర్లు కొంత లాభానికే (షార్ట్ టర్మ్ ఇన్వెస్టర్లు) విక్రయాలు చేస్తుంటారు. దీనివల్ల లాభంపై 15 శాతం మూలధన లాభాల పన్ను చెల్లించాలన్న విషయాన్ని వారు మర్చిపోతుంటారు. పెట్టుబడులు ఎప్పుడూ కూడా నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి. పైగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లేదా స్టాక్స్ అనేవి ఐదేళ్లు అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసమే ఎంపిక చేసుకోవాలని నిపుణులు తరచూ సూచిస్తుంటారు. దీర్ఘకాలం కోసం ఎంపిక చేసుకున్నవి స్వల్పకాలంలో మార్కెట్లలో అస్థితరల వల్ల నష్టాలను చూపించొచ్చు. అటువంటప్పుడు స్థిరత్వాన్ని ప్రదర్శించాలి. అంతేకానీ, తరచూ పోర్ట్‌ఫోలియోను గందరగోళంగా మార్చేయకూడదు. 2020 మార్చి నుంచి ఇలా మార్పులు చేసిన వారికి చేదు ఫలితాలు ఎదురయ్యాయి. చేసిన తప్పుకు మూల్యం కూడా చెల్లించాల్సి వచ్చింది.

ఉదాహరణకు యాక్సిస్ బ్లూచిప్ ఫండ్ 2021లో 21 శాతం రాబడులను ఇవ్వగా, 2022లో 6 శాతం నష్టాలను ఇచ్చింది. గడిచిన ఏడాది కాలంలో ఈ ఫండ్ ఎలాంటి రాబడులు ఇవ్వలేదు. కానీ, గత మూడేళ్లలో సగటున చూస్తే వార్షికంగా 15 శాతం రాబడులు ఇచ్చింది. అందుకే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులు వృద్ధి చెందడానికి తగినంత సమయం ఇవ్వాలి. నేడు పెట్టుబడులు పెట్టి రేపు లేదా వచ్చే నెల సమీక్షిస్తామంటే అది సరైన విధానం అనిపించుకోదు. అదే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వ్యాల్యూ డిస్కవరీ ఫండ్ 2020లో 22 శాతం రాబడులు ఇవ్వగా, 2021లో 37 శాతం, 2022లో 15 శాతం చొప్పున రాబడులు తెచ్చి పెట్టింది. హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీక్యాప్ పథకం పనితీరు బాగోలేదని చెప్పి 2021లో పెట్టుబడులు విక్రయించేసి ఉంటే, 2022లో విచారించాల్సి వచ్చేది. ఎందుకంటే 2022లో ఈ పథకం 17 శాతం రాబడులు తెచ్చి పెట్టింది. ఇలా ఒక్కో పథకం పనితీరు ఒక్కో మాదిరిగా ఉంటుంది. ప్రభుత్వరంగ సంస్థలు, ఇన్‌ఫ్రా కంపెనీలు 2020 వరకు ప్రతికూల రాబడులనే ఇచ్చాయి. కానీ, ఆ తర్వాత నుంచి ర్యాలీ చేస్తున్నాయి. గత పదేళ్లలో డైవర్సిఫైడ్ ఈక్విటీ విభాగంలో మంచి ఫండ్ ఏటా 21 శాతం కాంపౌండెడ్‌గా రాబడిని ఇవ్వగా, బలహీన పథకం ఏటా 11 శాతం రాబడిని తెచ్చి పెట్టింది. అంటే బలహీన పథకం కూడా దీర్ఘకాలంలో డెట్ సాధనాల కంటే మెరుగైన రాబడులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

మినహాయింపులు...

బలహీన పనితీరు చూపించే మ్యూచువల్ ఫండ్స్ నుంచి పెట్టుబడులతో బయటకు రావాల్సిన సందర్భాలు కూడా ఉంటాయి. మీరు పెట్టుబడులు పెట్టడానికి ముందు ఆశించిన మేర రాబడులను మ్యూచువల్ ఫండ్ ఇవ్వడంలో విఫలమైతే (మూడేళ్లకు మించిన కాలంలో), లేదా బెంచ్ మార్క్ (సూచీ) పనితీరు కంటే మెరుగైన పనితీరు చూపించలేనప్పుడు ఆ పథకం నుంచి తప్పుకోవచ్చు. ఎందుకంటే బెంచ్‌మార్క్‌తో సమానంగా రాబడులు ఇచ్చే నిఫ్టీ 50, నిఫ్టీ నెక్ట్స్ 50, నిఫ్టీ 100 తదితర తక్కువ ఖర్చుతో వచ్చే ఇండెక్స్ పథకాలు నేడు ఎన్నో ఉన్నాయి. కనుక సూచీల కంటే తక్కువ రాబడులు ఇచ్చే పథకాల్లో కొనసాగాల్సిన అవసరం లేదు.

బెంచ్ మార్క్‌ను చూడాలి...

ఒక మ్యూచువల్ ఫండ్ రాబడులను సమీక్షించే సమయంలో, ఆయా మ్యూచువల్ ఫండ్ విభాగం అనుసరించే ప్రామాణిక సూచీ (బెంచ్‌మార్క్/ఇండెక్స్) పనితీరు ఎలా ఉందో గమనించాలి. బెంచ్‌మార్క్ కంటే తాను ఇన్వెస్ట్ చేసిన పథకం పనితీరు బాగోలేదా? అన్నది చూడాలి. ఆయా విభాగం వారీ సగటు రాబడులు అంత కచ్చితమైనవి కావు. ఒక పథకం అదే విభాగం సగటు రాబడులతో పోలిస్తే భిన్నమైన పనితీరు చూపించడానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు. ఫండ్ మేనేజర్ పోటీ పథకాలతో పోలిస్తే తక్కువ రిస్క్ తీసుకోవచ్చు. లేదా మైక్రోక్యాప్ స్టాక్స్ లేదా మూమెంటమ్ బ్రేకవుట్ స్టాక్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఫండ్ మేనేజర్ నిర్ణయాలతో బుల్ మార్కెట్లో పరుగులు పెట్టిన ఫండ్స్.. మార్కెట్ కరెక్షన్లలో అంతే మేర నష్టపోతుంటాయి. ఒకవేళ మీరు ఇన్వెస్ట్ చేసిన మ్యూచువల్ ఫండ్ లార్జ్‌క్యాప్ కంపెనీలకు ఎక్కువ కేటాయింపులు చేసి, పోర్ట్‌ఫోలియో కాన్సంట్రేషన్ తక్కువగా ఉంటే (అధిక పెట్టుబడులు ఒకే చోట పెట్టకపోవడం) లేదా మార్కెట్లు పట్టించుకోని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసి ఉంటే గనుక, ఈ రిస్క్ తగ్గించే విధానాల ఫలితంగా బుల్ మార్కెట్లో ఆయా పథకాలు మంచి రాబడులు తెచ్చి పెడతాయి. 2021 వరకు కాంట్రేరియన్, వ్యాల్యూ ఫండ్స్ గ్రోత్ ఫండ్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంతో వెనుక ఉన్నాయి. వడ్డీ రేట్లు రికార్డు కనిష్టాలకు చేరడం గ్రోత్ స్టాక్స్‌కు ఎంతో అనుకూలించింది. కానీ, వడ్డీ రేట్లు తిరిగి పెరగడం మొదలైన తర్వాత అప్పుడు వ్యాల్యూ, కాంట్రేరియన్ ఫండ్స్‌కు కలిసొచ్చింది. అవి మంచి పనితీరు చూపించడం ఆరంభమైంది. ఇలా ఒక తరహా పథకాల నుంచి మరో తరహా పథకాల మధ్య పెట్టుబడులు మారుస్తూ ఉండడం కంటే, ఇన్వెస్టర్ తన రాబడుల ఆకాంక్షలు, రిస్క్ సామర్థ్యాలకు అనుకూలమైన పథకాలు లేదా కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన విధానం అవుతుంది. అంతేకాదు, అవి రాబడులు ఇచ్చే వరకూ ఓపిక పట్టాలి. ఓ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టే ముందు ఫండ్ మేనేజర్‌ను కూడా చూడాలి. ఎన్నో మార్కెట్ సైకిల్స్ (బుల్, బేర్) చూసిన ఫండ్ మేనేజర్ అయితే ఆ పథకం స్వల్ప కాలంలో వెనుకబడ్డా.. ఆ తర్వాత రాబడుల్లో మెరుగైన స్థానానికి తిరిగి చేరుకోగలదు. ఆయా సందర్భాల్లో నిపుణుల సూచనలూ తీసుకోవాలి.





ఉదాహరణకు ఏటా 15 శాతం కాంపౌండెడ్ వార్షిక రాబడి (సీఏజీఆర్) ఆశించి ఒక ఫ్లెక్సీక్యాప్ పథకంలో ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. అప్పుడు మీ పథకం గత మూడేళ్ల కాలంలో 20 శాతం సీఏజీఆర్ రాబడిని ఇచ్చింది. కానీ అదే కాలంలో 38 శాతం సీఏజీఆర్ రాబడిని ఇచ్చిన క్వాంట్ ఫ్లెక్సీక్యాప్ పథకం చూసి ఆందోళన చెందకూడదు.

లక్ష్యాలకు అనుకూలం

ఎందుకంటే మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం ఇచ్చిన 20 శాతం సీఏజీఆర్ రాబడి అనేది బీఎస్ఈ 500 రాబడి కంటే ఎక్కువ. పైగా మీరు ఆశించిన దానికి మించిన పనితీరును పథకం చూపించింది. కనుక పోర్ట్‌ఫోలియో కోసం ఎంపిక చేసుకున్న మ్యూచువల్ ఫండ్స్ అనుకున్న విధంగా మంచి పనితీరు చూపిస్తున్నప్పుడు.. ఇతర పథకాల పనితీరు చూసి వాటిని విక్రయించే నిర్ణయం తీసుకోవడం సరైనది అనిపించుకోదు. ఒక పథకం నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకునే ముందు పాయింట్ టు పాయింట్ వాస్తవ రాబడులను చూడాలి. సరైన రాబడులు ఇస్తున్నప్పుడు ఆ పెట్టుబడిని ఏమీ చేయకుండా వదిలి పెట్టడమే మంచి నిర్ణయం అవుతుంది. మీ లక్ష్యాలకు, మీ ఆకాంక్షలకు అనుగుణంగా ఫండ్ పనితీరు ఉందా, లేదా అన్నదే ముఖ్యం కానీ, మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం టాప్‌లోనే ఉండాలని కోరుకోవద్దు.

కోల్ ఇండియా లాభం డౌన్

- క్యూ4లో రూ. 5,528 కోట్లు
- షేరుకి రూ. 4 డివిడెండ్



న్యూఢిల్లీ: మైనింగ్ రంగ పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా గత ఆర్థిక సంవత్సరం (2022-23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 5,528 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 6,715 కోట్లు ఆర్జించింది. ఉద్యోగుల వేతన సవరణ కారణంగా ప్రొవిజన్లు పెరగడం లాభాలను ప్రభావితం చేసింది. యూనియన్లతో ఒప్పందం నేపథ్యంలో నాన్‌ఎగ్జిక్యూటివ్స్ జీతాలు 2021 జులై నుంచి సవరించడంతో రూ. 5,870 కోట్లు కేటాయించినట్లు కంపెనీ పేర్కొంది. అంతక్రితం ఏడాది ఇవి రూ. 475 కోట్లు మాత్రమే. వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున తుది డివిడెండు ప్రకటించింది.

అమ్మకాలు జూమ్

క్యూ4లో కోల్ ఇండియా మొత్తం అమ్మకాలు మాత్రం రూ. 29,985 కోట్ల నుంచి రూ. 35,161 కోట్లకు ఎగశాయి. బొగ్గు ఉత్పత్తి 7 శాతం పుంజుకుని 224.16 మిలియన్ టన్నులకు చేరింది. విక్రయాలు 180.25 ఎంటీ నుంచి 186.88 ఎంటీకి పెరిగాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-5-2023	
విశాఖ	470-00
చిత్తూరు	488-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	72.00
7-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435-00
వరంగల్	437-00
రిటైల్ ధర	4.95

స్టాక్స్ వ్యూ

ఐసీఐసీఐ బ్యాంక్ — మోతీలాల్ ఓస్వాల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 927 టార్గెట్: రూ. 1,210

ఎందుకంటే: తాజా త్రైమాసికం(క్యూ4)లో ఈ ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) త్రైమాసికవారీగా 0.25 శాతం బలపడి 4.9 శాతాన్ని తాకాయి. ఇందుకు రుణాలపై వడ్డీ రేట్ల పెంపు సవరణలు సహకరించాయి. రుణాల నాణ్యత సైతం మెరుగుపడింది. స్లిప్పేజీలు తగ్గడంతో త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(జీఎన్‌పీఏ) 3.07 శాతం నుంచి 2.81 శాతానికి దిగివచ్చాయి. పునర్‌వ్యవస్థీకరించిన రుణాలు 0.5 శాతం నుంచి 0.4 శాతానికి తగ్గాయి. 1 శాతం తక్కువగా రుణ వృద్ధి 19 శాతం, కార్పొరేట్(ఐబీజీసీసహా) రుణాలు 14 శాతానికి చేరాయి. అయితే నికర వడ్డీ ఆదాయం వార్షికంగా 40 శాతం జంప్‌చేసింది. వార్షిక ప్రాతిపదికన పీవోపీ 34 శాతం పురోగమించింది. ఇందుకు 7 శాతం పుంజుకున్న ఇతర ఆదాయం దోహదపడింది. అధిక రికవరీలు, చౌక రుణ వ్యయాల కారణంగా గత కొన్నేళ్ల



నుంచి రిటర్న్ రేషియోలు మెరుగుపడ్డాయి. వెరసి ఆర్‌వోఏ 2.4 శాతాన్ని తాకింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాది(2022-23)కి నికర వడ్డీ మార్జిన్లు 0.52 శాతం పుంజుకుని 4.5 శాతానికి చేరాయి. ఇవి బ్యాంక్ చరిత్రలోనే అత్యధికంకాగా.. నిధుల సమీకరణ వ్యయాలు పెరుగుతూ వస్తున్నాయి. క్యూ4లో త్రైమాసికవారీగా 0.34 శాతం పెరిగాయి. దీంతో భవిష్యత్‌లో ఎన్ఐఎంపై ప్రతికూల ప్రభావం పడే వీలుంది. మాతృ సంస్థకు రూ. 1,081, అనుబంధ సంస్థలకు రూ. 129 చొప్పున విలువను పరిగణించి టార్గెట్ ధర నిర్ణయించాం.

మ్యాక్రోటెక్ డెవలపర్స్ — ఐసీఐసీఐ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 896 టార్గెట్: రూ. 1,262

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2022-23)లో రియల్టీ రంగ దిగ్గజం మ్యాక్రోటెక్ డెవలపర్స్(లోధా గ్రూప్) రూ. 12,060 కోట్ల విలువైన అమ్మకాల బుకింగ్స్‌ను సాధించింది. కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. 34 శాతం పురోభివృద్ధిని అందుకుంది. వెరసి ఏడాది ప్రారంభంలో కంపెనీ ప్రకటించిన బుకింగ్స్ అంచనాలు రూ. 11,500 కోట్లను అధిగమించింది. అంతేకాకుండా దేశీయంగా కంపెనీ నికర రుణ భారం వార్షికంగా రూ. 2,230 కోట్లు తగ్గింది. మార్చికల్లా రూ. 7,070 కోట్లకు పరిమితమైంది. గతేడాది బిజినెస్‌లోనూ మంచి పురోగతిని సాధించింది. 12 ప్రాజెక్టుల ద్వారా రూ. 15,000 కోట్ల స్థూల అభివృద్ధి విలువ(జీడీవీ)ను జత చేసుకుంది. తద్వారా కంపెనీ తొలి జీడీవీ అంచనాలు రూ. 15,000 కోట్లను అధిగమించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో వార్షికంగా అమ్మకాల బుకింగ్స్‌లో 20 శాతం వృద్ధిని ఆశిస్తోంది. రూ. 14,500 కోట్ల బుకింగ్స్‌ను అంచనా



వేస్తోంది. ఇందుకు ముంబై, పుణే కొత్త ప్రాజెక్టులతోపాటు.. బెంగళూరులో చేపట్టిన రెండు కొత్త ప్రాజెక్టులు సహకరించనున్నాయి. ఈ నేపథ్యంలో వడ్డీకి ముందు రూ. 6,000 కోట్ల నిర్వహణ క్యాష్ ఫ్లో మిగులును సాధించగలమని భావిస్తోంది. ఈ బాటలో రానున్న రెండేళ్ల(2024-26)లో 20 శాతం సాలుసరి వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. రెసిడెన్షియల్ హౌసింగ్‌కు డిమాండు దీర్ఘకాలం కొనసాగగలదన్న అంచనాల నడుమ కొత్త ప్రాజెక్టులను జత చేసుకుంటూ 2026కల్లా రూ. 21,000 కోట్ల అమ్మకాల బుకింగ్స్‌ను ఆశిస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఫండ్స్‌కు పనితీరు ఆధారిత ప్రోత్సాహం: సెబీ



ముంబై: మ్యూచువల్ ఫండ్స్‌కు పనితీరు ఆధారిత ప్రోత్సాహం ఇచ్చే విధానాన్ని సెబీ త్వరలోనే ప్రవేశపెట్టనుందని సెబీ ఈడీ మనోజ్ కుమార్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే సంప్రదింపుల పత్రంతో ముందుకు వస్తామన్నారు. టెక్నాలజీ పరమైన మార్పులతో వచ్చే ప్రయోజనాలను ఫండ్స్ పరిశ్రమ ఇన్వెస్టర్లకు బదిలీ చేయడాన్ని సెబీ ప్రోత్సహిస్తుందని చెబుతూ.. పరిశ్రమలోని కొన్ని వర్గాలు దీన్ని స్వాగతించడం లేదన్నారు. సంప్రదింపులు చేపట్టిన అనంతరం ఎలాంటి ప్రోత్సాహక నిర్మాణం ఏర్పాటు చేయగలమో చూడాల్సి ఉందన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని రకాల ప్రోత్సాహకాలు వాంఛనీయం కాదన్నారు. మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు సంబంధించి స్వీయ నియంత్రణను సెబీ కోరుకుంటున్నట్లు మనోజ్‌కుమార్ చెప్పారు. యాంఫీ పరిశ్రమ కార్యకలాపాలను బలోపేతం చేసే యాంఫి 2.0 కార్యాచరణతో సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో పథకాల వారీగా భిన్నరకాల ఎక్స్‌పెన్స్ రేషియో (ఇన్వెస్టర్ల పెట్టుబడిపై వసూలు చేసే కమీషన్) అమల్లో ఉంది.


బీమా ప్రకటనల నిబంధనలు కఠినతరం

ఐఆర్‌డీఏఐ ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: ప్రకటనల విషయంలో బీమా సంస్థలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా నిబంధనలను కఠినతరం చేయడంపై బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ దృష్టి సారించింది. ఇందులో భాగంగా పథకాల ప్రచార కార్యక్రమాల రూపకల్పన, ఆమోదం విషయంలో సీనియర్ మేనేజ్‌మెంటుకు మరిన్ని బాధ్యతలు కట్టబెట్టేలా బీమా నిబంధనలకు సవరణలను ప్రతిపాదించింది. వీటిపై పరిశ్రమ వర్గాలు మే 25లోగా తమ అభిప్రాయాలను ఐఆర్‌డీఏకి తెలియజేయాల్సి ఉంటుంది. ఐఆర్‌డీఏఐ ప్రతిపాదనల ప్రకారం ప్రతి సంస్థ ఒక అడ్వర్టైజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. మార్కెటింగ్, యాక్చువేరియల్, నిబంధనల అమలు విభాగాల నుంచి తప్పనిసరిగా ఒక్కో ప్రతినిధి ఉండాలి.

ఎస్‌సీఎస్‌ఎస్ ముందే రద్దు చేసుకుంటే?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నాకు సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్)లో రూ.4 లక్షల పెట్టుబడులు ఉన్నాయి. మూడేళ్ల తర్వాత నా పెట్టుబడిని వెనక్కి తీసుకుంటే పెనాల్టీ చెల్లించాలా? ఇందుకు అనుసరించాల్సిన ప్రక్రియ ఏది? – ధీరజ్ సన్యాల్

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ కాల వ్యవధి ఐదేళ్లు. 8 శాతం వార్షిక రాబడిని (హామీతో కూడిన) మూడు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తారు. ఈ పథకం వడ్డీ రేటును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంటారు. కానీ డిపాజిట్ చేసిన రోజు ఉన్న రేటే ఐదేళ్ల కాలానికి అమలవుతుంది. అంటే కొత్తగా ప్రారంభించే ఖాతాలకే సవరించిన రేటు అమల్లో ఉంటుంది. ఈ పథకం కాల వ్యవధి ఐదేళ్లే అయినా, ఫారమ్-2 సమర్పించడం ద్వారా ముందుగానే ఖాతాను మూసివేయవచ్చు. కాకపోతే ఇన్వెస్ట్ చేసిన కాలవ్యవధి ఆధారంగా పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్ చేసిన ఏడాది లోపు వెనక్కి తీసుకుంటే ఎలాంటి వడ్డీ చెల్లించరు. అప్పటికే మూడు నెలలకు ఒకసారి చెల్లించిన వడ్డీ మొత్తాన్ని అసలు నుంచి మినహాయించుకుంటారు. ఏడాది నుంచి రెండేళ్ల మధ్య డిపాజిట్‌ను రద్దు చేసుకుంటే పెట్టుబడిలో 1.5 శాతాన్ని జరిమానా కింద చెల్లించాల్సి వస్తుంది. ఇక రెండు నుంచి ఐదేళ్ల మధ్యలో డిపాజిట్ రద్దు చేసుకుంటే అప్పుడు పెట్టుబడిపై 1 శాతం జరిమానా పడుతుంది. మూడేళ్ల తర్వాత మీ డిపాజిట్‌ను వెనక్కి తీసుకోవాలని అనుకుంటున్నారు కనుక మీరు మీ పెట్టుబడి మొత్తం రూ.4 లక్షలపై ఒక శాతం చొప్పున రూ.4,000 పెనాల్టీ మినహాయించుకుని, మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తారు. మొదటి ఐదేళ్ల కాలానికే ఈ నిబంధనలు అమలవుతాయి. ఎస్‌సీఎస్‌ఎస్ పథకాన్ని ఐదేళ్ల తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. ఇలా పొడిగించి కాలంలో ఏడాది నిండిన తర్వాత, అంటే మొత్తంగా ఆరేళ్ల తర్వాత ఎప్పుడు ముందస్తుగా రద్దు చేసుకున్నా, ఎలాంటి పెనాల్టీ పడదు.

నా వయసు 74 ఏళ్లు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ త్వరలోనే గడువు తీరి (మెచ్యూరిటీ) రూ.25 లక్షలు చేతికి రానున్నాయి. నేను ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకుంటే మెరుగైన రాబడులు వస్తాయి? ప్రభుత్వ పథకాలు అయిన సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్), ప్రధాన మంత్రి వయవందన యోజన (పీఎంవీవీవై), పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (ఎంఐఎస్)లో పూర్తి స్థాయిలో నాకు పెట్టుబడులు ఉన్నాయి. – ఎస్.అరుణ్



ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రాబడులు మెరుగ్గా ఉండవు. కనుక మీరు మెరుగైన రాబడుల కోసం ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎఫ్‌డీలతో పోలిస్తే ఈక్విటీ ఫండ్స్ అస్థిరతలతో ఉంటాయి. కాకపోతే అచ్చమైన ఈక్విటీ ఫండ్స్‌లో మాదిరిగా అస్థిరతలు ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో ఉండవు. ఇవి 15-30 శాతం వరకు ఈక్విటీల్లో, మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, ఆర్బిట్రేజ్ అవకాశాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. స్వల్పకాలంలో ఈ ఫండ్స్‌లోనూ రిస్క్ ఎక్కువే ఉంటుంది. అయితే మూడు నుంచి ఐదేళ్లు అంతకుమించిన కాలానికి రిస్క్ అని నేను అనుకోను. షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ మరోక ఆప్షన్. ఫిక్స్‌డ్ డిపాజిట్ మాదిరే షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లోనూ రాబడులు ఉంటాయి. వీటిల్లో లిక్విడిటీ ఎక్కువ. పోస్టాఫీసు ఎంఐఎస్, ఎస్‌సీఎస్‌ఎస్, పీఎంవీవీవై పథకాల్లో పెట్టుబడులు ఉన్నాయి కనుక క్రమం తప్పకుండా ఆదాయం వస్తుంటుంది. ఈ పథకాల నుంచి రాబడి తీసుకుంటూ ఉంటారు. కనుక పెట్టుబడి విలువ పెరగదు. కనుక మీకు ఉన్న వాటిల్లో ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ మెరుగైన ఆప్షన్ అవుతుంది. ఈక్విటీ వద్దనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌కు వెళ్లొచ్చు.

క్లుప్తంగా...

ముక్కంటికి వెండి కిరీటం



రేణిగుంట: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ కుటుంబ సభ్యులతో కలిసి వెండి కిరీటం వితరణ చేశారు. దీనిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గమ్మను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన జస్టిస్ భాస్కర్ రెడ్డికి వేద పండితులు ఆశీర్వచనం, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

12 వరకు టీఎస్ఐసెట్ దరఖాస్తు గడువు పెంపు

కేయూ క్యాంపస్: తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ఐసెట్–2023కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు (రిజిస్ట్రేషన్) గడువును ఆలస్య రుసుము లేకుండా ఈనెల 12 వరకు పొడిగించారు. ఉన్నత విద్యామండలి ఆదేశాలతో గడువు పెంచినట్టు టీఎస్ఐసెట్ కన్వీనర్ ఆచార్య పి.వరలక్ష్మి ఆదివారం తెలిపారు. రూ.250 ఆలస్య రుసుముతో ఈనెల 15 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో ఈనెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే దరఖాస్తుల సమర్పించిన విద్యార్థులకు ఈనెల 12 నుంచి 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సవరణలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈనెల 26, 27 తేదీల్లో తెలంగాణలో 16, ఏపీలో 4 ప్రాంతీయ కేంద్రాల్లోని 75 సెంటర్లలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులూ టీఎస్ఐసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

తెలంగాణ గురుకుల ప్రిన్సిపాళ్ల సంఘం ఆవిర్భావం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 1062 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యాశాఖల గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్ల సంఘం ఆవిర్భవించింది. సంఘానికి గౌరవ సలహాదారుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షునిగా డాక్టర్ ఆర్.అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాంబాబు, సంయుక్త కార్యదర్శి పోరండ్ల చంద్రమోహన్, కోశాధికారిగా రాజేశం, మహిళా కార్యదర్శిగా నీలిమాదేవి, గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జిగా విద్యాసాగర్, వరంగల్ గ్రేటర్ ఇన్‌చార్జిగా టి.శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. అనంతరం గురుకుల ప్రిన్సిపాళ్ల సంఘం ప్రతినిధులు ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో వినోద్‌కుమార్‌తో భేటీ అయ్యారు.

నిద్రపోయినా.. ఏడ్చినా జీతమిస్తారు..!

పని చేస్తే జీతమిస్తారు ఎక్కడైనా. కానీ.. పరుపులపై నిద్రపోవడం.. క్యూలైన్‌లో నిలబడటం.. శవం దగ్గర ఏడ్వటం లాంటి పనులు చేస్తే కాసుల వర్షం కురుస్తోంది. వివిధ దేశాల్లో ఇలాంటి చిత్ర విచిత్రమైన పనులెన్నో చేసేస్తూ డబ్బులు గడిస్తున్న వారు చాలామందే ఉన్నారు. ఇలాంటి ఉద్యోగాలు కూడా ఉంటాయా అని ఆశ్చర్యపోకండి. అవేంటో చూసేద్దాం పదండి.

కార్యాలయం లేదా పనిచేసే చోట నిద్రపోతే ఉద్యోగం ఊడిపోతుంది. కానీ.. బాగా నిద్రపోయే వారికి మాత్రం అక్కడ జీతాలు ఇస్తారు. 'ప్రొఫెషనల్ స్లీపర్స్' పేరిట ఇలాంటి ఉద్యోగాలను పరుపుల తయారీ కంపెనీలు, కొన్ని ప్రముఖ హోటళ్లు సైతం ఆఫర్ చేస్తున్నాయి. ఫిన్లాండ్‌లోని ఒక హోటల్ ప్రొఫెషనల్ స్లీపర్స్‌ను నియమించుకుంది. ఆ హోటల్‌లోని బెడ్‌లలో రోజూ ఏదో ఒక బెడ్‌పై పడుకుని అవి సౌకర్యంగా ఉన్నాయా.. లేదా అనేది చెక్ చేసి నివేదిక ఇవ్వడమే ప్రొఫెషనల్ స్లీపర్ పని. ఇందుకోసం వీరికి నెలకు రూ.లక్షల్లో జీతాలిస్తున్నారు. అంతేకాదు.. బెడ్‌లు, పరుపుల తయారీ కంపెనీలు సైతం వాటి నాణ్యతను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ప్రొఫెషనల్ స్లీపర్స్‌ను నియమించుకుంటున్నాయి. న్యూయార్క్‌లో పరుపులు తయారు చేసే కాస్పెర్ కంపెనీ బిజినెస్ పెంచుకునేందుకు కొత్తగా ఆలోచించి 'స్లీపర్స్' కావాలని ఈ మధ్యే ఒక ప్రకటన చేసింది. తమ కంపెనీ పరుపు మీద పడుకుంటే కంటినిండా నిద్రపడుతుందని చెప్పడం ద్వారా మార్కెట్ పెంచుకునేందుకు 'ప్రొఫెషనల్ స్లీపర్స్' కోసం వెతుకుతోంది ఆ కంపెనీ. అభ్యర్థులకు ఎక్కువసేపు నిద్రపోవాలనే కోరిక ఉండాలట. చుట్టూ ఏం జరిగినా ఏమీ పట్టనట్టు హాయిగా పడుకోగలగటం ప్రత్యేకత. జాబ్‌లో చేరిన వారు కాస్పెర్ పరుపుల పైపడుకుని బాగా నిద్రపోవడంతోపాటు వారి అనుభవాలను టిక్‌టాక్ వీడియోలు, రీల్స్, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయాలని ఆ కంపెనీ నిబంధనలు విధించింది.

- సాక్షి, అమరావతి

క్యూలో నిలబడినా నెలనెలా ఆదాయమే

- ఫిన్లాండ్‌లో ప్రొఫెషనల్ స్లీపర్స్
- మెట్రో రైలులో 'పాసింజర్ పుషర్స్'లకూ..
- చైనా, ఆఫ్రికాలో దుఃఖితులకు డబ్బులు
- అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఒకరికి బదులు మరొకరు క్యూలో నిలబడితే చాలు డాలర్లే



బెంగళూరులోనూ ఉందో కంపెనీ

నిద్రపోతే చాలు జీతమిస్తామంటోంది మన దేశంలోని బెంగళూరుకు చెందిన 'వేక్‌ఫిట్' సంస్థ. 'రోజూ రాత్రి 9 గంటలపాటు శుభ్రంగా పడుకోండి. నెలకు రూ.లక్ష జీతం ఇస్తాం' అంటోంది. అంతేకాదు.. ఈ జాబ్‌లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు కూడా అవకాశం కల్పించింది. ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనే అభ్యర్థులకు బాగా నిద్రపోయేలా స్లీప్ ఎక్స్‌పర్ట్స్, న్యూట్రిషనిస్టులు, ఇంటీరియర్ డిజైనర్లు, ఫిట్‌నెస్ నిపుణులు పలు సూచనలు కూడా ఇస్తారట. అభ్యర్థులందరినీ ఒక ప్రత్యేక వాతావరణంలో ఉంచి వారందరూ గాఢంగా, ఎక్కువ సేపు నిద్రపోయేలా వివిధ రకాల వ్యూహాలను అమలు చేస్తారు. ఇందులో పాల్గొనే వారికి ఏదైనా డిగ్రీ ఉండాలి. బెడ్ పైకి వెళ్లగానే 10–20 నిమిషాల్లో నిద్రలోకి జారుకునే లక్షణం కలిగి ఉండాలి.

అక్కడ ఏడిస్తే డబ్బులిస్తారు



కొన్ని దేశాల్లో ఎవరైనా చనిపోతే ఏడ్చేందుకు వెళ్లి డబ్బులు సంపాదించుకోవచ్చు. చైనా, ఆఫ్రికా, యూకే వంటి దేశాల్లో మతపరమైన సంప్రదాయంలో ప్రత్యేకంగా దుఃఖితులను నియమించుకుని డబ్బులిస్తారు. వీరంతా ఏడవడంతోపాటు బాధిత కుటుంబ సభ్యులను కూడా ఓదారుస్తారు. ఇందుకోసం ఒక్కో ఈవెంట్‌కు సుమారు రూ.9 వేల నుంచి రూ.16 వేల వరకు చెల్లిస్తారు.

క్యూలో నిలబడితే డబ్బిస్తారు



క్యూలో గంటల తరబడి నిలబడటం ఎవరికైనా ఇబ్బందే. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, వయసు పైబడిన వారు, చిన్న పిల్లల తల్లులు, పిల్లలు క్యూలైన్‌లో నిలబడటం కష్టం. ఇందుకు ప్రత్యామ్నాయంగా అనేక దేశాలు 'లైన్ స్టాండర్' పద్ధతిని అనుసరిస్తున్నాయి. లైన్‌లో మీరు నిలబడలేకపోతే మీకు బదులుగా అక్కడి ఉద్యోగులు నిల్చుంటారు. అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఈ తరహా లైన్ స్టాండర్లు ఎక్కువగా కనిపిస్తుంటారు. ముఖ్యంగా షాపింగ్ మాల్స్‌లో ఫెస్టివల్ ఆఫర్లు ప్రకటించినప్పుడు.. మార్కెట్లో కొత్త ప్రొడక్ట్స్ విడుదలైనప్పుడు వీరికి ఫుల్ డిమాండ్ ఉంటుంది.

ప్రయాణికుల్ని తోసేస్తే జీతం



పండగలు, పర్వదినాల్లో కిక్కిరిసిన రైలు, బస్సుల్లో జనం గుమ్మాల దగ్గర వేలాడటం చూస్తుంటాం. మెట్రో రైలులో ఇలాంటి పరిస్థితి వస్తే తలుపులు మూసుకోకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు విదేశాల్లో ప్రత్యేకంగా 'పాసింజర్ పుషర్స్'ను నియమిస్తున్నారు. జపాన్ రాజధాని టోక్యోతోపాటు వివిధ దేశాల్లోని మెట్రో రైళ్లలో 'పాసింజర్ పుషర్స్' డ్యూటీలో చేరుతున్నారు. మెట్రో రైలు లోపలికి ప్రయాణికులను నెట్టేసి రైలు తలుపులు మూసుకునేలా చేయడమే వీరి పని. ఇందుకోసం వారికి నెలకు మన కరెన్సీలో చూస్తే రూ.70 వేల నుంచి రూ.75 వేల వరకు జీతం ఇస్తున్నారు.

మరిన్ని చిత్రమైన కొలువులున్నాయ్!

ఓటీటీ సంస్థలు ప్రత్యేకంగా మూవీ వాచర్లను నియమించుకుంటున్నాయి. సినిమా ప్రసారం కావడానికి ముందే సినిమా ఎలా ఉంది.. రీచింగ్ బాగా ఉంటుందా.. లేదా.. ఎలాంటి ట్యాగ్స్ ఇవ్వాలనే దానిపై కొందర్ని నియమించుకుని జీతాలిస్తున్నాయి. విడుదలకు ముందే వెబ్ సిరీస్, మూవీలను చూసి సమీక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగానే రిలీజ్ ఆధారపడి ఉంటుంది. కాగా, ఇంటికి వేసిన రంగు (కలర్) ఎంత సమయంలో ఆరుతుందో చెప్పడానికి ప్రత్యేకంగా రంగుల తయారీ కంపెనీలు పెయింట్ డ్రైయింగ్ వాచర్ పేరిట సిబ్బందిని నియమించుకుంటున్నాయి. పెయింట్ ఎంతసేపట్లో ఆరుతుంది.. చేతికి అంటుకుంటుందా అనే వివరాలతో రిపోర్ట్ తయారు చేసి మేనేజర్లకు ఇవ్వడమే వీరి పని. కాగా.. గోల్ఫ్ గేమ్‌లో కొట్టిన బంతిని దూరం నుంచి తిరిగి తేవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఆ సమయాన్ని ఆదా చేసేలా బాల్ డ్రైవర్‌ను నియమించుకుని జీతాలిస్తారు. కాగా, చివరకు కండోమ్ తయారీ సంస్థలు వాటిని మార్కెట్లో విడుదల చేయడానికి ముందు సౌకర్యంగా ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు కూడా కండోమ్ టెస్టర్స్‌ను నియమించుకుంటాయి. వారికి జీతం ఏడాదికి ఇండియన్ కరెన్సీ ప్రకారం చూస్తే.. ఏకంగా రూ.10 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు చెల్లిస్తున్నాయి.

కెమిస్ట్రీ కఠినం.. ఫిజిక్స్ గందరగోళం

గత మూడు పరీక్షల కంటే 'నీట్' టఫ్

- కటాఫ్ మార్కులు తగ్గే అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష ప్రశాంతం

సాక్షి, హైదరాబాద్: ఈసారి నీట్ పరీక్ష మధ్యస్థం నుంచి కఠినంగా ఉందని నిపుణులు విశ్లేషించారు. బాగా చదివినవారికి మధ్యస్థంగా, మామూలుగా వారికి కఠినంగా ఉంటుందని చెబుతున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన 'నీట్'పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో ఈసారి దరఖాస్తు చేసుకున్న వారిలో 95 శాతం మందికి పైగా పరీక్షకు హాజరైనట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. గత నాలుగేళ్లతో పోలిస్తే.. ఈసారి నీట్ కాస్త కఠినంగానే ఉందని పరీక్ష అనంతరం విద్యార్థులు, నిపుణులు చెప్పారు. కరోనా కారణంగా గతేడాది వరకు సులువుగా ఉన్న పేపర్, ఈసారి కొంత కఠినం చేశారని చెబుతున్నారు. దీంతో ఈసారి కటాఫ్ మార్క్ తగ్గే అవకాశం ఉందంటున్నారు. 2020లో జనరల్ కేటగిరీలో కటాఫ్ మార్క్ 147 ఉండగా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల్లో 113 గా ఉంది. ఇక 2021లో జనరల్ కేటగిరీలో కటాఫ్ మార్క్ 138 కాగా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల్లో కట్ ఆఫ్ మార్క్ 108గా ఉంది. గతేడాది (2022)జనరల్ కటాఫ్‌మార్క్ 117 కాగా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల్లో 93గా ఉంది. ఈ ఏడాది అది కాస్తా జనరల్ కేటగిరీలో 110, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల్లో 85 ఉండే అవకాశముందని అంచనా.



పరీక్షకు ముందు చెవిరింగును తొలగిస్తున్న విద్యార్థిని

ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు..

గతేడాదితో పోలిస్తే ఈసారి నీట్ పేపర్ కఠినంగా ఉంది. నాలుగేళ్లలో 2020, 21లో పేపర్లు సులువుగా వచ్చాయి. అయితే అంతకుముందుతో పోలిస్తే గతేడాది కఠినంగా ఉంది. దీంతో కటాఫ్ మార్కు తగ్గింది. ఈ ఏడాది ఇంకా టఫ్‌గా ఉంది. ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నాయి. కెమిస్ట్రీ పేపర్ కఠినంగా ఉంది. సహజంగా విద్యార్థులు కెమిస్ట్రీలో ప్రాబ్లమ్స్‌పై దృష్టిపెట్టి, థియరీ పార్ట్‌ను నిర్లక్ష్యం చేస్తారు. కానీ ఈసారి ఎక్కడో మూలల నుంచి థియరీ ప్రశ్నలు ఎక్కువగా ఇచ్చారు. దీంతో పేపర్ కఠినంగా మారింది. ఇక ఫిజిక్స్ గతేడాదితో పోల్చితే సులువుగానే ఉంది. నాలుగైదు ప్రశ్నలు తికమకగా ఇచ్చారు. ఒక ప్రశ్నకు ఇచ్చిన నాలుగు ఆప్షన్లు ఏవీ కరెక్ట్‌గా లేవు. బాటనీ ప్రశ్నలు సులువుగా ఉన్నా, సుదీర్ఘంగా ఉన్నాయి. చదవడానికి ఎక్కువ సమయం తీసుకున్నాయి. స్టేట్‌మెంట్ టైప్ ప్రశ్నలు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు విశ్లేషించారు.


430 మార్కులు వచ్చినా రాష్ట్రంలో కన్వీనర్ సీటు..

తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్లు పెరిగాయి కాబట్టి తక్కువ మార్కులు వచ్చినా సీటు పొందే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు జనరల్ కేటగిరీలో గతేడాది 450 మార్కులు వచ్చినవారికి కన్వీనర్ కోటాలో సీటు వచ్చింది. ఈ ఏడాది 430 మార్కులు వచ్చిన వారికి కూడా కన్వీనర్ కోటాలో సీటు వచ్చే అవకాశముంది. గతేడాది 700కు పైగా మార్కులు వచ్చినవారు ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాది అంత మార్కులు వచ్చే వారి సంఖ్య తగ్గుతుంది.

ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు సమాధానం లేదు

ఈసారి నీట్ పేపర్ కఠినంగా ఉంది. కెమిస్ట్రీ చాలా కఠినంగా వచ్చింది. ఫిజిక్స్‌లో నాలుగైదు ప్రశ్నలు గందరగోళంగా ఉన్నాయి. వాటిని హడావుడిగా పెడితే తప్పవుతాయి. ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు ఇచ్చిన నాలుగు ఆప్షన్లు కూడా సరిగా లేవు. కాబట్టి దానికి బోనస్ మార్కులు ఇవ్వాలి. 180 ప్రశ్నల్లో 179 మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

– శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య జూనియర్ కాలేజీ, కూకట్‌పల్లి



పేపర్ మధ్యస్థంగా ఉంది

నీట్ పరీక్ష బాగానే రాశాను. పేపర్ మధ్యస్థంగా ఉంది. కెమిస్ట్రీ ఫర్వాలేదు. నాకు కెమిస్ట్రీలో 160, ఫిజిక్స్‌లో 166 వచ్చే అవకాశముందని నేను రాసిన ఆన్సర్లను బట్టి అంచనా వేశా. బాటనీలో కూడా మార్కులు బాగానే వస్తాయనుకుంటున్నా.

– ఆర్ని గోయల్, విద్యార్థి, హైదరాబాద్



ఫిజిక్స్, బాటనీ సులువుగా..

నీట్ పరీక్ష బాగానే రాశాను. కెమిస్ట్రీలో రెండు ప్రశ్నలు తప్పుగా రాసినట్లు అనిపించింది. కెమిస్ట్రీ మధ్యస్థంగా ఉంది. ఫిజిక్స్, బాటనీ పేపర్లు సులువుగా వచ్చాయి.

– లహరి, విద్యార్థిని, హైదరాబాద్



రేపే ఇంటర్మీడియట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాలు మంగళవారం (మే 9వ తేదీ) విడుదల కానున్నాయి. ఫలితాల వెల్లడిపై బోర్డు అధికారులు ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి సబిత ఫలితాలు వెల్లడించాల్సి ఉన్నందున ఆమె వెసులుబాటును పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఫలితాల విడుదల తేదీని ప్రకటించారు. ఫలితాల వెల్లడికి సంబంధించి సాఫ్ట్‌వేర్‌ను కూడా సిద్ధం చేశారు. విద్యార్థులు మంగళవారం ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ల ద్వారా, www.sakshieducation.com ద్వారా వేగంగా ఫలితాలు పొందవచ్చు. కాగా, తొలుత ఇంటర్‌బోర్డు పరీక్ష పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టాలని నిర్ణయించినా, వీలు కాకపోవడంతో ఆఫ్‌లైన్ ద్వారా మూల్యాంకనం చేపట్టింది. పలు దఫాలుగా ట్రయల్‌రన్ చేసిన అనంతరం సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండటంతో జీరో సాంకేతిక సమస్యలు నిర్ధారణైందని, దీంతో ఫలితాల వెల్లడికి ఎలాంటి ఆటంకాల్లేవని అధికారులు నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలోనే మంగళవారం ఫలితాలు వెలువరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ జరిగాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 4,82,501 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 4,23, 901 మంది హాజరయ్యారు. దాదాపు 9.06 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియ ఏప్రిల్ రెండో వారంలోనే పూర్తయింది.

మీ కంపెనీలో 'ఐసీసీ' ఉందా?

- పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి ఐసీసీ తప్పనిసరి
- అన్ని కంపెనీల్లో ఏర్పాటు చేసేలా మహిళా భద్రతా విభాగం ప్రచారం

సాక్షి, హైదరాబాద్: అన్ని రంగాల్లోనూ మహిళా ఉద్యోగుల సంఖ్య పెరిగింది. అన్ని స్థాయిల్లోనూ వారు విధులు నిర్వర్తిస్తున్నారు. మహిళా ఉద్యోగుల సంఖ్యతోపాటు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల సంఖ్యా పెరిగింది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతీ కార్యాలయం, సంస్థలోనూ అంతర్గత ఫిర్యాదుల విభాగం (ఇంటర్నల్ కంప్లైట్స్ కమిటీ) ఏర్పాటు తప్పనిసరి. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం–2013 ప్రకారం ఈ కమిటీ పనిచేస్తుంది. పని చేస్తున్న ప్రదేశాల్లో మహిళా సిబ్బందిని వేధింపులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకునేలా యాజమాన్యానికి ప్రతిపాదించడం, మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులు లేకుండా చూడటం ఈ కమిటీ ప్రధాన లక్ష్యం. తమను లైంగికంగా, మానసికంగా మరే రూపంలో వేధింపులకు పాల్పడిన మహిళా సిబ్బంది ఈ ఐసీసీకి ఫిర్యాదు చేయవచ్చు. ఈ అంశంపై అవగాహన పెంచేందుకు మహిళా భద్రతా విభాగం ట్విట్టర్ ఖాతా ద్వారా దీనిపై విస్తృత ప్రచారం కల్పిస్తోంది.

'అంతర్గత' విభాగంలో ఎవరెవరు?

- చైర్‌పర్సన్: కంపెనీలో ఉన్నతస్థాయిలో పనిచేస్తున్న మహిళ ఐసీసీ చైర్‌పర్సన్‌గా ఉంటారు.
- సభ్యులు: ఈ కమిటీలో ఇద్దరు ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. వీరికి న్యాయపరమైన అంశాలపై అవగాహన ఉండాలి లేదా సోషల్ వర్క్‌లో అనుభవం ఉండాలి.
- మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాడే, ఆ సమస్యలపై పనిచేసే ఎన్జీఓ లేదా అసోసియేషన్ నుంచి ఒక సభ్యులుండాలి.
- కమిటీ మొత్తం సభ్యుల్లో సగంమంది మహిళలే ఉండాలి. వీరి కాలపరిమితి మూడేళ్లు.

ఒక్కటైన 21 జంటలు



నూతన వధూవరులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు

వివాహాలు జరిపించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: శాంతా నారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 21 జంటలకు వివాహాలు జరిపించారు. మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు అమ్మవారి దేవాలయంలో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు నిరుపేద జంటలకు పెళ్లిళ్లు జరిపించి, వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం.. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఒక పెళ్లి చేయాలంటే.. ఆడబిడ్డల తల్లిదండ్రులు పడే ఆర్థిక కష్టాలు వర్ణనాతీతమని, కొందరు తమ ఆస్తులనే అమ్ముకునే పరిస్థితి వస్తుందని అన్నారు. అందుకే ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతా నారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఉచితంగా వివాహాలు జరిపిస్తున్నామన్నారు. చాలా తక్కువ సమయంలో అందరి సహాయ సహకారాలతో వివాహ వేడుక విజయవంతమైందని హర్షం వ్యక్తం చేశారు. మునులు తపస్సు చేసిన కొండ వద్ద, మహిమాన్వితమైన స్థలంలో పెళ్లి చేసుకోవడం మహాభాగ్యమన్నారు. సామూహిక వివాహాల కోసమే ప్రత్యేకంగా కల్యాణ మండపం నిర్మించామని, 100 జంటలు ఒకేసారి వివాహం చేసుకునేలా ఏర్పాటు చేశామని చెప్పారు.



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామిని 35 వేలమందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ధర్మదర్శనానికి 3 గంటలు సమయం పట్టింది. నిత్య ఆదాయం కింద రూ.47,39,167 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. –యాదగిరిగుట్ట

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.